సంస్థాపకులు
కీ॥ శే॥ వి.వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

జ్యోతి
సాహిత్య మాసపత్రిక

నవంబరు 1979

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 17   సంచిక 10

విషయసూచిక

ముఖచిత్రం : 'గోరింటాకు'లో శోభన్‌బాబు, వక్కలంక పద్మ.

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, మద్రాసు-600 024. ఫోన్: 423123.

సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) రు. 43/



Rediffusion/K/1002TLf



Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600024&Printed by D. Hanumantha Rao at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001.

21వ జాతీయ బహుమతి పోటీ

పోటీకి ఈ క్రింది భారతీయ భాషలలో రచనలు పంపుకోచ్చు: అసామియా, బెంగాలి, గుజరాతి, హిందీ, కన్నడ, కాశ్మీరి, మలయాళమ్, మరాఠి, ఒడియా, పంజాబి, సింధి, తమిళ్, తెలుగు, ఉర్దు.

కొంతవరకు చదువనేర్చిన వారికోసం పఠనసామగ్రిని (తగిన చిత్రాలతో) తయారు చేసేందుకు సృజనాత్మక రచయితలను ప్రోత్సహించడమే ఈ జాతీయపోటీలో ఉద్దేశ్యం. అరఠావు కాగితంమీద డబుల్ స్పేస్‌లో ఒక వైపున మాత్రమే టైపుచేసి/లేదా స్పష్టంగా వ్రాసిన 50 పుటలకు ఈ వ్రాత ప్రతులు మించరాదు.

బహుమతులు: ఒక్కొక్కటి రు. 1,000 వంతున అరవై అయిదు బహుమతులను ఈ భాషలలో అత్యుత్తమంగా నిర్ణయించిన రచనలకు ఇస్తారు.

అర్హత: కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన ఏ పోటీకయినా ఇంతక్రితం పంపిన రచనలను ఈ పోటీకి పరిగణించబోరు. ఎంట్రీ ఫారాలు, నిబంధనలకు ఈ క్రింది వారికి వ్రాయండి. మీ చిరునామా వ్రాసిన కవరు మీద (24 సెం. మీ × 10 సెం. మీ.) (హిందీ, ఇంగ్లీషులో)


"TWENTY FIRST NATIONAL PRIZE COMPETITION FOR BOOKS FOR NEO LITERATES" అని వ్రాయాలి.

ఎంట్రీలు స్వీకరించేందుకు ఆఖరుతేది (స్వయంగాగాని, రిజిస్టర్డు పోస్టులోగానీ) 1979 డిసెంబరు 31. ప్రతి ఎంట్రీతో క్రాస్ పోస్టల్ ఆర్డరు రూపంలో రు. 5/-

"The Director, Directorate of Adult Education at New Delhi Post office" చెల్లించేట్టు పంపాలి.

డైరక్టరేట్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్,

10 కమ్యూనిటీ సెంటర్, బసంత్‌లోక్. వసంత విహార్, న్యూఢిల్లీ-110057





davp 75/158

తొలిమాట

'లోకోభిన్నరుచిః' అన్నదానికి ఈ సారి ఉత్తరాల శీర్షిక నిదర్శనంగా నిలుస్తుంది. జ్యోతి కథల పోటీలో మొదటి మూడు బహుమతులు పొందిన కథల గురించి పాఠకులు వ్యక్తపరచిన అభిప్రాయాలలో విపరీతమైన వైవిధ్యముంది. వచ్చిన చాలా ఉత్తరాలలో అన్ని రకాల అభిప్రాయాలు ప్రతిఫలించేలా కొన్నింటిని మాత్రం ప్రచురించాము.

* * *

ఇది రాస్తున్ననాటికి జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక ముస్తాబు సగంపైనే పూర్తయింది. బాపు ముఖచిత్రం, చంద్ర వర్ణచిత్రాలూ, వాసిరెడ్డి సీతాదేవి పూర్తి నవలా, ప్రసిద్ధులూ, కొత్తవారూ కూడా అందిస్తున్న ఆసక్తికరమైన కథలూ, ఎన్నో కార్టూన్లతోపాటు 'కొత్తరకం' కార్టూన్ కథ ఈ ప్రత్యేక సంచికలో ఆకర్షణలు.

* * *

జ్యోతి నిర్వహించే నవలల పోటీ వివరాలు గత మూడు సంచికలలోనే ప్రకటించాము. నవలల పోటీలో పాల్గొనే రచయితలకు, ఆ పోటీకి నవలలు అక్టోబర్ 15 తేదీ లోపు పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

* * *

ఈ సంచికతో ప్రారభించి కళాశాలా విద్యార్థులకు జ్యోతి నిర్వహిస్తున్న కథల పోటీలో యెన్నికయ్యే కథల ప్రచురణ ప్రారంభించాము. జ్యోతిలో మూడు పేజీలు కంటే యెక్కువ కాకుండా ఈ పోటీకి కథలు కళాశాలా విద్యార్థినీ, విద్యార్థులు పంపవచ్చును. ఈ కథల పోటీకి చివరి తేదీ అంటూ ఏదీ నిర్దేశింపబడలేదు. ప్రతి నెలా చివరి తేదీలోపు వచ్చే కథలన్నిటినీ పరిశీలించి, ఆ తర్వాత సంచికకోసం కథల ఎన్నిక జరుగుతుంది. ఈ పోటీ వివరాలకోసం గత రెండు మూడు జ్యోతి సంచికలు చూడవచ్చును.

ఉత్తరాలు

జ్యోతి పదహారణాల + 4 పైసల తెలుగు పత్రికని మీకు తెలీదా? తెలిసీ, 'ప్రింటెడ్ అండ్ పబ్లిషడ్' అని ఇంగ్లీషులో రాసుకొంటా రేమిటి? 'జ్యోతి-ఫలానా నెల' అని అట్టచివర ఆంగ్లంలో అచ్చేస్తారెందుకని?

అందమైన తెలుగు కథ గురించి అభిప్రాయం, అభినందనా సూచనప్రాయంగానైనా తెలియజేయక, 'రచయితకు ఇంగ్లీషు వచ్చు' అని మాకు తెలుసు అంటూ తమకింగ్లీషు అర్ధం చేసుకునేంత భాషాపరిజ్ఞాన మున్నదని ఇతరులకు తెలియజేసే 'విజయమోహన్‌రెడ్డి' గారున్నారన్న సంగతి తమరికి తెలీదా?

అయ్యా, రచయిత రామసంజీవిగారూ! 'ఆల్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్'ని తెలుగులో అనువదించడం తమరికి రాకపోతే, మయసభని నిర్వహించడం మానేయండి. విజయమోహన్‌రెడ్డిగారు చూస్తే కోప్పడతారు. తమరి మయసభలో 'కేరెక్టర్-మేకప్-ఇమేజి-కంపెనీ-షేర్లు-హోల్డర్లు-' అంటూ — ఆం ఇంగ్లీషు తమరికొచ్చన్న సంగతి విజయమోహన్‌రెడ్డిగారికి తెలీదనుకొంటున్నారా?

అయ్యా! ఇదిట 'ఉత్తరాల శీర్షిక' ప్రయోజనం!

—రాజ్‌కుమార్ మెహ్రా,
గుంటూరు.

అక్టోబర్ "జ్యోతి"లోని జుగాష్‌విలిగారి కథ "ఎవరు వాళ్ళు...." చదివాక వ్రాస్తోన్నానిది. రచయితగారు కథ చెప్పే తీరు, శైలి బావున్నాయ్. కానీ కథలో స్పష్టత, పరిపూర్ణతలేవు. కథంతా చదివాక ఆయన చెప్పదలచుకున్న దేమిటో అర్థంకాలేదు. పేరునిబట్టి చూస్తే, రామ్‌సూరి, అంజిరెడ్డిల గురించి చెప్పదల్చుకున్నారు. మరైతే మొదటి భాగంలో భార్యకి పీడోక్కులు ఇవ్వడం....అదంతా కథకి సుద్ద దండగ. కథలోని రెండు భాగాలూ పరిపూర్ణత లేని, రెండు విభిన్న విభాగాలయ్యాయే తప్ప, రచయిత తాను చెప్పదలుకున్నదానికి న్యాయం సమకూర్చలేకపోయారు. కథకు అనవసరమైన విషయమైనా, అత్యవసరం అనిపించేలా చెప్పగల నేర్పు, చాకచక్యం, మధురాంతకం రాజారాంగారికే చెల్లుతుంది!....మరి జుగాష్‌విలిగారు ఎందుకిలా అసంపూర్తిగా (అపరిపూర్ణంగా) వ్రాశారో తెలీడంలేదు....

—కిరణ్‌ప్రభ, హైదరాబాదు.

ఎంతో ఆశగా, ఉత్సాహంగా బహుమతి కథల్ని చూసి, ఎంతో నిరుత్సాహపడ్డానని చెప్పటానికి విచారిస్తున్నాను. బహుమతులు ఏ కొలమానంతో ఇచ్చారో తెలియదుగాని మొదటి రెండు కథలూ చాలా పేలవంగా వున్నాయి. 'అనూగీత' గారి కథకు ఎందుకు ప్రథమ బహుమతి ఇవ్వలేదా అన్న సందేహం వచ్చింది.

కథ ఆలోచింప చెయ్యలేకపోతే మానె కనీసం అనుభూతికూడ ఇవ్వటంలేదు. "ఎవరు వాళ్ళు, ఎవరివాళ్ళు" కథ చాలా చాలా బావుంది.

"నీవూ - నేను" గేయం ఎంతో ఆనందాన్నిచ్చింది. కవిత్వంతో అనుభవించి, పలవరింపజేయగలగటం జ్యోతికి తెలుసు. మంచి కవిత్వాన్ని ఆదరిస్తారనే నమ్మకం మళ్ళీ ఒకసారి కలిగింది.

"ఆలోచించ" గల పాఠకులు సాహిత్యంలో జ్యోతికి ఒక ప్రత్యేక స్థానం ఇస్తున్నారు. దాన్ని నిలబెట్టుకోవలసిన బాధ్యత మీదే.

—శైలకుమార్, మద్రాసు.






నోటి దుర్వాసనను ఆపండి...
కోల్గేట్ డెంటల్ క్రీమ్‌తో
దంతక్షయాన్ని ఎదుర్కోండి

ప్రతిసారీ భోజనం చేసిన తర్వాత, కోల్గేట్‌తో మీ పళ్ళను తోముకోండి కోల్గేట్, ప్రపంచమంతటా దంత వైద్యులు సిఫారసు చేసే తీరులో మీకు రక్షణ సమకూరుస్తుంది.

మీ పళ్ళలో మిగిలిపోయే ఆహారపు అణువులలో బాక్టీరియా పెరుగుతుంది. అవి ముందు నోటి దుర్వాసన, ఆపైన బాధాకరమైన దంతక్షయాన్ని కలిగిస్తాయి.

అందుకే మరి ఎప్పుడూ భోజనంకాగానే కోల్గేట్‌తో తోముకోవడం సరైన మార్గం. అది మీ శ్వాసను తాజాగా రూపొందించేందుకు. పళ్ళను తెల్లగా మెరిసేలా చేసేందుకు, దంతక్షయాన్ని ఎదిరించేందుకు అమోఘమైనదని రుజువయింది.

కోల్గేట్ యొక్క నమ్మకమైన సూత్రీకరణ ఎలా పనిచేస్తుందంటే :




మీ పళ్ళలో ఇరుక్కుపోయిన ఆహారపు అణువులలో దుర్వాసన, దంతక్షయాన్ని కలిగించే బాక్టీరియా పెరుగుతుంది.

కోల్గేట్ యొక్క సాటిలేని చర్యగల నురుగు బాగా లోతుకుచేరి హానికరమైన ఆహారపు అణువులను బాక్టీరియాను తొలగిస్తుంది.

ఫలితం: ఆకర్షణీయమైన తెల్లని పళ్ళు, శ్వాస తాజాగా ఉందన్న నమ్మకం, దంతక్షయంనుండి రక్షణ.

షోయినిగొల్పే, తాజా శ్వాసకోసం, పళ్ళను తెల్లగా రూపొందించేందుకు ప్రపంచంలో ఎక్కువ మంది, మరే ఇతర టూత్‌పేస్ట్ కన్న ఎక్కువగా కోల్గేట్‌నే కొంటూ ఉంటారు !



సంపూర్ణ దంత రక్షణకోసం కోల్గేట్ ట్రిగార్డ్ టూత్‌బ్రష్‌లను వాడండి. అవి పళ్ళ ఎనామిల్‌ను కాపాడి పళ్ళపైవచ్చే ప్లేక్ బారినుండి రక్షించడంతోపాటు చిగుళ్ళకు రక్షణ సమకూరుస్తాయి. మీ కుటుంబంలోని ప్రతివారికీ అనువుగా 8 రకాలలో దొరుకుతాయి.

ఒక్క దంతవైద్యులు మాత్రమే
దీనికన్న మేలైన దంతరక్షణ సమకూర్చగలరు.

"తాజ్‌మహల్"కు ప్రథమ బహుమతి లభించడం ఆశ్చర్యంగానే వుంది. కథావస్తువూ, సెంట్రల్ థీమ్ సున్నితాంశాలుగా వుండడం వల్లనే ఈ కథ బహుమతి యోగ్యంగా తోచిందేమో బహుశా న్యాయనిర్ణేతలకు. కానీ delicate అయిన అంశాల వ్యక్తీకరణ విధానంలో ఉపయోగింపబడే భాషకూడా పటిష్టంగా, విశిష్టంగా వుండాలి మరి. శైలిలో అపరిపక్వత కొట్టొచ్చినట్టు కనబడుతుంది కథలో. వాక్యనిర్మాణంలో order లోపించడంవల్ల అస్పష్టతా, అస్తవ్యస్తతా కనిపిస్తాయి చాలా చోట్ల (ఉదా: ఇప్పటికీ వెన్నెల వెలుగులో మంచం వేసుకు పడుకొని, తెల్లని మేలి ముసుగు కప్పిన ఆకాశ దేవత నుదుటిబొట్టులా వున్న పౌర్ణమి చంద్రుణ్ని చూస్తోంటే అమ్మను చూస్తున్నట్లే వుంటుంది).రానే తీరులో స్పష్టతా, విశిష్టతా, నిర్దిష్టతా కొరవడడవల్ల రచనావిధానంలో immaturity ద్యోతక మౌతుంది. "ఒక అద్భుత దృశ్యం చిత్రించబడాలంటే కుంచెకు ఎంతటి ప్రాధాన్యత వుందో, ఒక జీవితాన్ని తీర్చి దిద్దగలిగే తల్లి కంతే ప్రాధాన్యత వుంది" అన్నప్పుడు 'Painting చేయడానికి తల్లి చాలా అవసరం' అనే అర్థం వస్తోంది॥ కొన్ని వాక్యాలు అర్థహీనంగా వున్నయ్. (ఉదా: నా జీవితంకోసం తనలో వున్న ఎంతటి శీతలాన్ని కరగించి ధారపోసిందోగదా!) "రాగిమయి అయిన అమ్మతో పోలిస్తే ఆ భగవంతుడు కూడా వెలిగే ఒక చిరుదీపమే" అన్నప్పుడు దేనితో పోలిస్తే చిరు దీపమో తెలియదు ("సూర్యుడి ముందు దివిటీ" అన్నట్లుగా వుండాలి పోలిక) కొన్ని వింతైన వినూత్న పదబంధాలుకూడా కనబడుతయ్ అక్కడక్కడ (ఉదా: మధ్యస్థ కుటుంబం — మధ్యతరగతి కుటుంబం అనడానికి బదులు). కథా వస్తువు మాత్రమే కాకుండా శైలీ, శిల్పమూకూడా flawless గా ఉన్న రచనకే ప్రథమ బహుమతి ఇవ్వాలనేది నా ఉద్దేశం.

ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్న కథలు బాగున్నవి. పోటీలో బహుమతి పొందడానికి అత్యవసరంగా భావింపదే "తెచ్చిపెట్టుకున్న సెంటిమెంట్స్" ఈ కథల్లో లేకున్నా శైలీ, కథాకథనమూ బాగున్నవి—ముఖ్యంగా "చదరంగంలో చచ్చేది" అనే కథలో. కానీ ఈ కథలో కుష్టు అంటురోగం కాదని చెప్పబడింది. ఇది తప్పు. కుష్ఠులో కొన్ని రకాలు వున్నవి. Tuberculoid leprosy అనే మరో రకం అంటురోగం కాకపోయినా కథలో describe చేయబడ్డ Lepromatous type మాత్రం అంటురోగమే. బ్యాంకుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించటానికి కష్టపడ్డట్టు రాశారు రచయిత్రి. విషయ పరిజ్ఞానం పట్ల వారికిగల inquisitivenessకు తోడ్పడుతుందనే ఉద్దేశంతో కుష్టుకు సంబంధించిన ఈ విషయాన్ని ప్రస్తావించడం జరిగింది.

—డాక్టర్ నాగరాజు సురేంద్ర,
నల్లకుంట, హైదరాబాదు.

జ్యోతి కథల పోటీలో గెలుపొందిన మొదటి కథ 'తాజ్‌మహల్' చక్కటి శైలితో మనసుల్ని రంజింపచేసింది. మిగతా రెండు కథల బహుమతి పొందాల్సిన స్థాయిలో లేకపోవటం తృప్తికరంగా లేదు. ఓలేటి బుచ్చిబాబు రచన వాస్తవానికి చాలా దూరంగా వుంది—వయసొచ్చిన కూతురు ఇంట్లో వుండగా ఏ తల్లి తండ్రులు అలా నగ్నంగా, అసభ్యంగా ప్రవర్తించరనేది కొంతవరకు నిజం అనుకుంటాను. చూడకూడని సమయంలో కన్న కూతురు చూసిందనే నెపంతో ఆత్మహత్యకు పాల్పడే మనస్తత్వం గలవారు ముందే జాగ్రత్తపడేవారు కదా! వెగటుగాను, ఎబ్బెట్టుగాను వున్న కథ 'తన్నొచ్చిన కన్నీటి కెరటం'—'చదరంగంలో చచ్చేది' ద్వారా రచయిత్రి ఏమి తెలియపరచ దలచుకుందో అర్థంకాదు—పెద్ద బోరు ఈ కథ. ఏమైనప్పటికీ ఉత్తమ కథల ఎన్నిక సరియైన తీరులో జరగలేదనిపిస్తోంది.

—నందమూరి, బెల్లంపల్లి.

శ్రీశ్రీ ప్రహేళిక గురించి

అక్టోబరు సంచికలో బొంబేనుంచి లక్ష్మిగారు వ్రాసిన ఉత్తరానికి సమాధానం 'కవిరాజ'

అన్నదానికి బదులు 'కవిరాజు' అని పడటం కేవలం అచ్చుతప్పు. 'కవిరాజ విరాజితం' అన్న వృత్తం గురించి లక్ష్మీగారు బహుశా విని వుండలేదేమో ననిపిస్తుంది.

ప్రహేళిక ఆధారాల్లోనూ, సమాధానాల్లోనూ అచ్చు తప్పులు తరచుగా దొర్లుతున్నాయి. ఇది ఎంతవరకు వచ్చిందంటే ప్రతీ ఆధారంలో (కాస్త ఇబ్బంది పెట్టేదిగా నున్నప్పుడు) అచ్చు తప్పేమైనా వుందా అని వెదకాల్సి వస్తూంది. ప్రూఫ్ రీడింగ్‌లో ఇంకాస్త జాగ్రత్త తీసుకోలేరా? అక్టోబరు జ్యోతిలో రెండు అచ్చుతప్పు లున్నాయి. 26 నిలువు ఆధారం 'ప్రకారంతో అభ్యుదయం' అని వుండాలి. సెప్టెంబరు సమాధానంలో 18 అడ్డం 'కేలు' అని వుండాలి.

—తోట చంద్రశేఖరరెడ్డి.

మహాకవి శ్రీశ్రీకి 1980 జనవరి 2వ తేదీకి 70 ఏళ్ళు నిండుతాయి, ఈ సందర్భంగా శ్రీశ్రీ సప్తతిపూర్తి మహోత్సవాన్ని 1980 మార్చి 2వ తేదీన కాకినాడలో జరపడానికి తాత్కాలిక కార్యవర్గం (అడ్‌హాక్ కమిటీ) ఏర్పడింది. ఈ కమిటీ ఇటీవల సమావేశమై, క్రింది నిర్ణయాలు తీసుకుంది. (1) డాక్టర్ మిరియాల రామకృష్ణగారి "శ్రీశ్రీ కవిత్వం" థీసిస్సు ముద్రణకు దోహదంచేసి, ఆ గ్రంథాన్ని మార్చి 2వతేదీన కాకినాడలో శ్రీశ్రీ సమక్షంలో ఆవిష్కరించడం (2) మహాకవి శ్రీశ్రీ 70వ జన్మదినోత్సవాన్ని జరిపి, ఆయనను సత్కరించడం (3) మహాకవి శ్రీశ్రీ సప్తతి పూర్తి సత్కార ప్రత్యేక సంచికను రూపొందించి ఆవిష్కరించడం.

ఈ అడ్‌హాక్ కమిటీ పై నిర్ణయాలను ఆమోదించింది. కమిటీకి కార్యదర్శులుగా డాక్టర్ పి. చిరంజీవినీ కుమారి, శ్రీ అవంత్స సోమసుందర్‌లు వ్యవహరిస్తారు. డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి కోశాధికారిగా వుంటారు. సర్వశ్రీ డాక్టర్ పి.యస్. మూర్తి, డాక్టర్ వై. దివాకరరావు, అల్లూరి వెంకటరామరాజు, చెలికాని భావనరావు, జి. సత్యమూర్తి, యల్. కామేశ్వరరావు మొదలైనవారు సభ్యులుగా నియమితులయ్యారు, సాహిత్యాభిమానులు తక్కిన వివరాలకు—శ్రీమతి పి. చిరంజీవినీ కుమారి, ప్రతాపనగర్, కాకినాడ-4 అనే చిరునామాకు వ్రాయవచ్చు.

—అవంత్స సోమసుందర్, కాకినాడ.

అక్టోబర్ నెల "జ్యోతి"లో ప్రథమ బహుమతి పొందిన 'తాజమహల్' కథ చాల బాగుంది. మధ్యతరగతి మానవుని మనసులో దూరి సత్యాలను వెలికితీశారు రచయిత. నిజంగా దరిద్రులకు ఎంత ప్రేమవున్నా వెల్లడిచేసుకునే అవకాశం వుండదు. తల్లికోసం త్యాగం చేసే వారు అతి తక్కువ. భార్యకోసం పాటుపడే వారే ఎక్కువ అనే సత్యాన్ని చక్కగా నిరూపించారు. ఈ రచయిత వల్లూరి శివప్రసాద్ గారికి మా ధన్యవాదాలు.

పోతే యీ నెల జ్యోతిలో నవల "గజం మధ్య - పలాయనం మిధ్య" అనే వంశీగారి నవల ఏమంత బాగాలేదు. ఈ మధ్య ఇలాంటి నవల్సే చాల ఎక్కువ వస్తోన్నాయి. ఏదో ఒక డాక్టరో, స్కూలు మాస్టరో పల్లె ప్రాంతాలకు రావడం, వారు అష్టకష్టాలు పడి పారిపోవడం జరుగుతుంది. ఇలాంటి నవల్సే వ్రాసి పల్లెలపై డాక్టర్స్‌కు దురుద్దేశాన్ని కల్గిస్తున్నాయి. ఇప్పటికే వైద్య సౌకర్యములేక బాధపడే ప్రజలకు ఇలాంటి నవల్స్ వ్రాసి హాని కల్గిస్తున్నారు రచయితలు. ఆ మాటకొస్తే మూఢాచారం కల వారు పల్లెలోనే కాక పెద్ద సిటీల్లోకూడ వుంటారు. రోగాలకు మంత్రాలు వేయించుకునే వారు వున్నారు. అత్యంత ఆధునికమైన మనుష్యులు పల్లెలో వున్నారు. మంచి చెడు ప్రతి చోట వుంటాయి. దీనికి పల్లె పట్నం అనే విచక్షణ లేదు. విజ్ఞానం వైద్యంకోసం అలమటించే పల్లె ప్రజలకోసం ఇలాంటి నవల్స్ వ్రాసి వైద్యుల దృష్టిలో పల్లెలను దిగజార్చకండి. ఎప్పటికప్పుడు నిత్యనూత్న దర్శన మిచ్చే మీ జ్యోతికి మా కృతజ్ఞతలు.

—యాడికి ప్రేమలత,
యాడికి అనసూయాదేవి,
పెండేకల్ ఆర్. యస్.


మీ అందానికి తగిన
మిల మిల మెరిసే చీరెలు!
కంచి, ధర్మవరం, బెంగుళూరు, బెనారస్, ఆరణి పట్టు చీరెలు!!
వేలకొలది రకములు
గ్యారంటీ వెయిట్,
జరీతో తయారైనవి
లభించును.
లక్ష్మీ జనతా స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్సు: శిష్ట్లా, ఫోన్: 73467, 77052

జ్యోతి నిర్వహించిన కథలపోటీలో మొదటి, రెండవ బహుమతులు పొందిన కథలు ఏమీ బాగులేదని చెప్పుటకు చింతిస్తున్నాను. మొదటి బహుమతి పొందిన కథ పవిత్రమైన 'అమ్మ' మీద మంచి వ్యాసం వ్రాసినందుకు బహుమతి ఇచ్చినట్లుగా వుంది. రెండవ బహుమతి పొందిన కథలోని ముఖ్యాంశం ఎదిగిన పిల్లల ఎదుట ఒక ఇరుకు ఇంట్లో ఇదేవిధమయిన పరిస్థితిలో బయటపడి చిత్రహింసకు గురి అయిన తల్లి దండ్రుల కథ ఈ మధ్యనే వచ్చిన ఒక పాత పత్రికలోని కధే. మూడవ బహుమతి పొందిన కథ బాగానే వుంది కాని ఒక స్త్రీ వ్రాసిన కథగా లేదు. అనూగీతకారు తనను పరిచయం చేసుకుంటూ ప్రేమ కథలతో తృప్తి వుండదంటూనే యద్దనపూడి సులోచనారాణి తన అభిమాన రచయిత్రిగా పేర్కొనడం ఆశ్చర్యమే!

—ఎన్. సులోచన, బాపట్ల.

'మాధవి ముఖచిత్రంతో వెలువడిన 'జ్యోతి' మంచి సాహితీ సుగంధాన్ని అందించింది. మంచి కథలతో-అందునా పోటీలో బహుమతి పొందిన మూడు కథలతో మమ్మల్ని అలరించింది.

మొదటి బహుమతి కథ "తాజ్‌మహల్" వ్యక్తి చిత్రణ, లేఖాపరంగా సాగినా, మంచి ఉత్కంఠను కలిగించింది. తల్లిపట్ల అవ్యాజమైన ప్రేమను మనసులోనే పదిలపర్చుకొన్న తనయుని వ్యక్తిత్వ చిత్రణ అసామాన్యం. అపూర్వం. ఈ కథ పత్రికకే హైలైట్.

ఇక రెండవకథ సానుభూతిపొందే విధంగా వుంది. తీసుకున్న థీమ్‌కు రచయిత చూపించిన పరిష్కారానికి కొంచెం పొంతన కుదరలేదనే చెప్పాలి! కథనశైలి బాగుంది. మొత్తం మీద కథా సంవిధాన ఉదాత్తతచె రెండవ బహుమతి యోగ్యమైనదే ఈ కథ.

మూడవ బహుమతి పొందిన కథ-కొంచెం వెరైటీగా వుంది. అంతేగాక ప్రయోగాత్మకంగా ప్రయోజనాత్మకంగా సాగింది. రచయిత్రి తొలి కథతోనే తనది తిరుగులేని శైలి అని నిరూపించుకున్నారు.

మొత్తంమీద మూడు కథలూ బాగుంది

(త్రు)లకు మంచి కథలను ప్రోత్సహించి-మంచి సాహిత్యానికి చేయూతనిచ్చే "త్రివేణీ బుక్ లవర్స్ క్లబ్" రాష్ట్ర వ్యాప్త రచయిత(త్రు)ల సంఘం. తన అభినందనలు అందిస్తోంది.

—యన్. కె. నాగేశ్వరరావు, పెనుగొండ.

మాధవి ముఖచిత్రంగా వెలువడిన అక్టోబరు సంచిక ఆనందాన్ని ఇచ్చింది. మీరు నిర్వహించిన కథల పోటీలో గెలుపొందిన వాటిలో "అడ్డొచ్చిన కన్నీటి కెరటం" చాల బాగుంది. తాజమహల్ అనే కథకు ప్రథమ బహుమతి నివ్వడం హాస్యాస్పదం. అయినా రచయిత రాసినట్టు (పాత్రతో పలికించినట్టు) షాజహాన్ తాజ్‌మహల్‌ను నిర్మించి భార్యపై తనకున్న ప్రేమను వ్యక్తం చేసి, వారిద్దరి ప్రేమను చరితార్థంచేసి కృతార్థుడయ్యాడు. షాజహాన్ నాలా పేదవాడై వుంటే ఏం చేసేవాడు? ప్రేమవుండి తల్లిని కోల్పోబోతున్న నేను ఏడుస్తున్నట్టే, భార్యను పోగొట్టుకున్న అతను దుఃఖిస్తాడు.' ఇది నిజమే.

—వై. బాలరాజు, జనగామ.

అక్టోబర్ సంచికలో శివప్రసాద్‌గారి "తాజ్ మహల్" కథ చదివినాక ఈ ఉత్తరం వ్రాయకుండా వుండలేకపోతున్నాను. మాతృ ప్రేమకు ఎవరు విలువ కట్టలేని నిర్వచనం "తాజ్ మహల్" ద్వార మా కందించారు.

"షాజహాన్‌కు తల్లి వుందికదా మరి ఆ తల్లి పేరునకూడ మరోటి యెందుకని కట్టించలే" దని, రాఘవ అడిగింది తన మావయ్యను కాదు. తల్లిదండ్రులపట్ల కనీన బాధ్యత మరచిన ప్రతి వ్యక్తిని సూటిగా అడిగారు. ఇంత ఉదాత్తమైన కథకు మొదటి బహుమతి ఇచ్చి ప్రోత్సహించిన జ్యోతి సంపాదక వర్గానికి మా కృతజ్ఞతలు.

—చక్రవర్తి చౌదరి, బాపట్ల.

అక్టోబరు 'జ్యోతి'లో "చదరంగంలో చచ్చేది" అనే కథ చదివాను. అన్ని విధాల బాగా రాయబడిన గొప్ప తెలుగు కథ చదివిన తృప్తి కలిగింది. ఇలాంటివి ప్రోత్సహించడం నా విధిగా బావిస్తున్నాను.

—అవసరాల రామకృష్ణారావు,

కళాశాల విద్యార్థులకు చిన్న చిన్న కథలపోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

గుడ్ గర్ల్

అది విశాఖపట్నంలో చౌట్రీ బస్‌స్టాప్.

అక్కడ నిల్చున్నది నేనుకాక ఇంకా చాలా మంది. సమయం సరిగ్గా సాయంత్రం 5 గంటలు. ఎదురుగా సూపర్ బజార్ చాలా అందంగా వుంది. ఆ గేటు ముందు నిల్చున్న చాలామంది అందమైన డ్రెస్‌లు వేసుకొని నడుస్తున్న మనుష్యుల్ని చాలా ఆనందంగా, జూలో జంతువుల్ని చూస్తున్నట్లు చూస్తోన్నారు. పేవ్‌మెంట్ మీద నేపాల్‌వాళ్ళు అమ్ముతున్న స్వెట్టర్లు కూడా చాలా అందంగా వున్నాయి. అప్పుడా సమయంలో రోడ్డుమీద అందమైనమనుష్యులు, అందంలేని మనుష్యులు; ఖరీదైన మనుష్యులు, ఖరీదులేని మనుష్యులు నడుస్తున్నారు—అంతే కాకుండా రిక్షాలు, ఆటోలు, సైకిళ్ళు స్కూటర్లు, బస్సులు, కార్లు, లారీలు కూడా వున్నాయి—అంత మాత్రమే కాకుండా ఒక ఆంబోతు, వెనక ఒక ఆవు, రెండు గేదెలు - గేదెలు తోలే మనిషి, ఒక గజ్జికుక్క, ఒక మంచి కుక్క—ఇంకా ఒక ముష్టివాడుకూడా అందమైన పాటద్వారా అడుక్కుంటున్నాడు.

అప్పుడా వాతావరణం అందంగానూ వుంది. అంద విహీనంగాను కూడా వుంది. బస్సు రాలేదు.

"టైం ప్లీజ్...." నా ప్రక్కనున్న గిరజాల యువకుడు అడిగాడు.

"5-30...." చెబుతూ చూసాను అతన్ని. అతను అటు చూస్తోన్నాడు దీక్షగా. నేను చూసాను.

అప్పుడే వస్తూంది. బస్సుకాదు — ఆ అమ్మాయి చేతిలో ప్లాస్టిక్ సంచితో. ఆమె తెల్లగా వుంది. చీర వెలిసిపోయి అందంగా లేదు. నుదురుమీద ఎర్రని తిలకంబొట్టు చాలా అందంగా వుంది. కళ్ళు దీనంగా వున్నాయి. మొత్తంమీద ఆ అమ్మాయి అందంగా లేదు, అందవిహీనంగానూ లేదు.

ఆ యువకుడు ఆమె దగ్గిరగా వెళ్ళి నిల్చున్నాడు.

అప్పుడు చూసాను అతన్ని సరిగ్గా. ఇంకా ఆమెనే చూస్తున్నాడు.

అతను గిరజాల జుట్టుతో అమితాబచ్చన్‌లా చాలా అందంగా వున్నాడు. అతను వేసుకున్న పాంటు, షర్టు ఖరీదుగానే వుండి అందాన్నిచ్చాయి. అతను పెంచుకున్న మీసాలు కమల్‌హాసన్ మీసాలులా చాలా అందంగా వున్నాయి. అతని చూపులు మాత్రం అందంగా లేవు.

ఆ అమ్మాయి అతన్నొకసారి చూసి దూరంగా జరిగింది. కాసేపటికి అతను కొంచెం దగ్గరగా జరిగాడు.

అందమైన సాయంత్రం చీకటిని పులుముకుంటూ వుంది.

అతను ఏదో అంటున్నాడు ఆమెతో. మనసు నిలవడంలేదు. దగ్గరగా నాలుగు అడుగులు వేసాను.

"ఏమండీ! ఇదేనా మనవూరు....? ఎక్కడ వుంటున్నారు....?"—సమాధానం లేదు.

"ఏం చేస్తోన్నారండీ. కాలేజీలో చదువుతున్నారా....?"—సమాధానం లేదు.

"ఓ....జాబ్ చేస్తోన్నారు కదూ—ఏ కంపెనీలోనండీ....?"—సమాధానం లేదు.

"మిమ్మల్నెక్కడో చూసానండీ....అచ్చు మీలాంటి రూపాన్నే — త్రీ ఇయర్స్ బేక్!" అప్పుడు నాకు నవ్వొచ్చింది. ఆమెమీద జాలేసింది.

రాగతి రమ ఎం.ఏ. (ప్రీ)
ఆంధ్రా యూనివర్శిటీ, వాల్తేరు.

"ఏమండీ కనీసం మీ పేరైనా చెప్తారా....?" ఆమె సూటిగా అతన్ని చూసింది. ఆ చూపులో కసి, కోపం, భయం వున్నాయి. 'ఏమిట్రా ఈ సొద' అనే భావంకూడా వుంది.

"పోనీ లెండి నా పేరు మాత్రం పవన్" అన్నాడు.

ఈసారి నవ్వాపడం కష్టమైంది. విచిత్రంగా చూసింది ఆమె నావైపు. ఎవడో పోకిరికుర్రాడు విజిల్ వేసుకుంటూ వెళ్ళాడు వాళ్ళిద్దర్నీ చూస్తూ. వాడ్ని చూస్తేకూడా నవ్వొచ్చింది.

ఇంతలో బస్సు వచ్చింది. స్పృహ వచ్చినట్లు పరిగెత్తాను. నాలాగ ఎందరో. బస్సు కదిలింది. జారిపోతున్న కళ్ళజోడు సరిచేసుకున్నాను.

అప్పుడు కనిపించారు—పవన్, ఆమె—ఇద్దరూ ప్రక్క-ప్రక్కనే నా ముందునే!

"మీకూ టికెట్ తీసుకున్నాను. మళ్ళీ తీయకండి ప్లీజ్"—అంటున్నాడు పవన్ ఆమెతో. ఆ అమ్మాయి అవస్థపడుతూ వుంది బస్సు హేండిల్స్ పట్టుకోలేక, ప్లాస్టిక్ బుట్ట పట్టుకోలేక, మీదపడే మనుష్యుల్ని తప్పించుకోలేక. రీడింగ్ రూమ్‌వద్ద దిగాను, నదిలో చేపపిల్ల ఈదినట్టు ఈది.

ఆ అమ్మాయి దిగింది బేగ్‌తో. పవన్ దిగాడు. నాకు చాలా సంతోషమైంది. ఆ అమ్మాయి సందులో తిరిగింది - వెనక పవన్- ఆ వెనుక నేను. చర్చివరకూ వచ్చాము. అక్కడ చీకటి చిక్కగా వుంది. వీధి లైటు జోగుతోంది. సడన్‌గా ఆగింది ఆ అమ్మాయి- అతను రెండు అడుగులు వెనగ్గా ఆగాడు—నేను మరో నాలుగు అడుగులు వెనగ్గా ఆగాను. ఆమె కళ్ళు చీకట్లో ఎర్రగా అనిపించాయి.

జోడు తీసి నాలుగు వాయిస్తుంది అనిపించింది.

లేదా—అదేదో సినిమాలోలా మంచి నడత గురించి దీర్ఘ ఉపన్యాసం ఇస్తోందేమో అనుకున్నాను.

"ఏయ్ మిష్టర్!....ఇలారా!!" కంఠంలో కటుకే కాక స్పష్టత వుంది. "ఇలా ఫాలో అవుతూ వస్తోన్నావ్...జీవితమంతా ఫాలో అవగలవా-చెప్పు సమాధానం.?" చాలా సౌమ్యంగా అడిగింది.

'ఏ గుడ్ గర్ల్'—అనుకున్నాను.

అక్క దండిస్తే దిక్కుమొఖం వేసుకున్న తమ్ముడిలా అనిపించాడు పవన్ .... ఏ పూర్ ఫెలో!

"పోనీ—నువ్వయితే చిన్నవాడివి....మరి ఇతనో! ఇంత పెద్దవాడై వుండి....ఇలా ప్రవర్తిస్తాడా....సిగ్గులేదూ??"

ఇతనూ అంటే—నేనేనా-చాలా సిగ్గేసింది. ఎందుకూ అంటే ఎందుకో నాకే తెలియదు. వెనక్కి తిరిగా అతని వెనకే! □

కళాశాల విద్యార్థులకు చిన్న చిన్న కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

మనిషి

ఎం. వాసుదేవమురళి

గాంధీ వైద్యకళాశాల, హైదరాబాదు.

"మీ క్లాసులో అమ్మాయిలు ఎంతమంది వున్నారు?" అని అడిగాడు రమణ. వాడికెప్పుడూ అమ్మాయిల గొడవే.

"వాళ్ళ గొడవ నీ కెందుకుగానీ త్వరగా నడు. నాకు క్లాస్‌కి టైమ్ అవుతోంది" అన్నాను టైమ్ చూసుకుంటూ. అప్పుడే మధ్యాహ్నం పన్నెండైంది. ఒంటి గంటకు క్లాస్ వుంది.

నాకు మెడికల్ కాలేజిలో సీటు వచ్చిన తరవాత రమణ హైదరాబాదు రావడం అదే మొదటిసారి. వచ్చిన దగ్గరినుంచి శవాలుకోసే గదిని చూపెట్టమని గొడవ చేస్తోన్నాడు. అందుకనే 'డిసెక్షన్ హాల్' చూపెడదామని వాడిని హాస్టల్‌నించి బయలదేరదీశాను.

'సీనియర్స్' హాస్పిటల్ నించి ఇంకా రాలే

దనుకుంటాను కాలేజి గ్రౌండ్‌లో ఎక్కువమంది లేరు. తిన్నగా 'డిసెక్షన్ హాలు'కి దారితీసాను. 'డిసెక్షన్ హాల్' పది గజాలు వుందనగా రమణ ముఖంచిట్లించి "ఇంత వాసన వేస్తోంటే మీరు అక్కడ కూర్చుని శవాలు ఎలా కోస్తారు?" అని అడిగాడు.

ఇక్కడికి వచ్చే కొత్తవాళ్ళు మొట్టమొదట అడిగే ప్రశ్న అదే. "అది శవాలని నిలవచేయడానికి ఉపయోగించే 'ఫార్మాలిన్' వాసన. మాకు అలవాటైపోయింది" అంటూ డిసెక్షన్ హాలులోకి దారితీశాను.

ఆ టైమ్‌లో అక్కడ ఎవరూ వుండరు. హాలు గుమ్మంలో నిలబడితే ఎదురుగుండా దూరంగా వున్న గోడకి వ్రేలాడుతూ 'ఎనాటమీకి తండ్రి' అనదగ్గ 'హెన్రీగ్రే' బొమ్మవుంది. చెరోవైపూ పదిహేనేసి చొప్పున మొత్తం ముప్ఫై స్ట్రెచ్చర్లు వాటిమీద సగం సగం 'డిసెక్టు' చేసిన శవాలు వున్నాయి. ఒకేసారి అన్ని శవాలు చూసి దడుచుకున్నాడేమో అని రమణకేసి చూశాను.

వాడు అనుమానంగా ముఖం పెట్టి "ఇవి నిజంగా శవాలా, లేకపోతే మోడల్సా? ఇంత నల్లగా వున్నా యేమిటి? వీటిని కోసి మీరేం చూడగలుగుతారు?" అని అడిగాడు.

"ఫార్మాలిన్‌లో వేయబట్టి అలావున్నాయి. మానవ శరీరంలో ప్రతి అంగుళం నిర్మాణం ఎలా వుందో మాకు తెలియాలి. కాబట్టి అంచెలంచెలుగా శవాన్ని కోస్తూ చూస్తూ పోతాం. ఇదిగో ఇది కాలేయం. ఇది మూత్రపిండాలు. ఇది గుండె. ఇది...." అలా మానవ శరీరంలో మామూలు మనిషికి తెలిసిన భాగాలను చూపిస్తూ చెబుతోంటే వాడు మౌనంగా వింటున్నాడు. వాడి మొహంలో భయం-జుగుప్స-వైరాగ్యం మిళితమైన భావం ఏదో నాకు కనిపించింది.

"ఈ శవాలని కోసేసి చూసిన తరువాత కుట్టేసి వాళ్ళ బంధువులకి అప్పచెబుతారా లేకపోతే మీరే ఎక్కడైనా పాతిపెడతారా?" ధర్మ సందేహం వెలిబుచ్చాడు రమణ.

"పిచ్చి తండ్రీ ఈ శవాలకి బంధువు లెవరుంటారు? ఇవన్నీ ఎవరూ క్లెయిమ్ చెయ్యని శవాలు. బంధువులు చచ్చిన మనిషికన్నా మనీ ఎక్కువ విలువని అమ్ముకున్న శవాలు. వైద్య విద్యార్థులకోసం అని 'డొనేట్' చేసిన శవాలు రావడం బహు తక్కువ. ఇక్కడికి వచ్చిన శవాలు మళ్ళీ అవతలకి వెళ్ళడం వుండదు."

"మరి?"

"ముక్క ముక్కలయిపోతాయి. ఉదాహరణకి చెయ్యి వుందనుకో. మొదట చర్మం తీసేసి కిందున్న నాడులని రక్త నాళాలని చూస్తాం. తరవాత పైనున్న కండరాల నిర్మాణం చూస్తాం. వాటిని కోసేసి లోతుగా వున్న కండరాలని, నాడులనీ, నాళాలని పరిశీలిస్తాం. తరవాత వాటిని తీసేసి ఎముకలనీ కీళ్ళ నిర్మాణాన్ని పరిశీలిస్తాం. అలాగే ఇతర భాగాలని గూడా శరీరంలోంచి తీసి, కోసి, చూసి పారేస్తాం. అర్థమయిందా?" నా వివరణని ఆపి వాడికేసి చూసాను.

వాడు "అబ్బా" అని కళ్ళు మూసుకొని తల విదిలించాడు.

"ఏం కళ్ళు మండుతున్నాయా?" అని అడిగాను ఫార్మాలిన్ ఘాటుకి కళ్ళు మండడం మామూలే కాబట్టి.

"హృదయం మండుతోంది" నిర్లిప్తంగా మొహంపెట్టి అన్నాడు.

"కవిత్వం క్యాంటిన్‌లో చెప్పచ్చు పద" అంటూ అవతలకి తీసుకొచ్చాను.

"కవిత్వం కాదు నిజమే. అసలు ప్రతి ఒక్కడికీ ఒక్కసారైనా ఈ డిసెక్షన్ హాలు చూపెడితే దేశం ఏంతో బాగుపడుతుంది. ప్రతివాడికి తెలుస్తుంది జీవితంలో ఏంలేదనీ చచ్చిన తరవాత అంతా ఒక్కటే అని. ప్రజలు ఘోరాలని చేయడం కొంతైనా తగ్గిస్తారు" ఆ క్షణాన రమణ నాకు ఒక గొప్ప విరాగిలా కనబడ్డాడు.

ఒకేసారి అన్ని శవాలని చూసి వాడు 'డిప్రెస్' అయినట్టు కనిపించాడు. వాడి 'మూడ్'ని మార్చుదామని దూరంగా చెట్టుకింద నిలబడ్డ మా క్లాస్ అమ్మాయిని చూపిస్తూ "ఆ అమ్మాయి ముక్కు బావుంటుందని మా క్లాస్‌లో చాలా మంది అంటారు. కానీ ముక్కులో ఏం అందం కనబడుతుందో నాకు అర్థంకాదు" అన్నాను.

మామూలుగా అయితే వాడు "ముక్కుదాని అందచందాలు" అన్న సబ్జక్టుమీద గంట లెక్చర్

దంచేవాడు. కానీ ఇప్పుడు నిర్లిప్తంగా ఆ అమ్మాయి కేసి చూసి "ఆ అమ్మాయి మొఖం మీద చర్మాన్ని తీసేస్తే మనం మొదటి స్ట్రెచర్ మీద చూసిన శవం మొహానికి ఆ అమ్మాయి మొహానికి తేడా అట్టే వుండదనుకుంటాను" అన్నాడు.


వాడు ఇంతగా ఎఫెక్టవతా డనుకోలేదు. ఇంతలో మా ప్రొఫెసర్ క్లాసులోకి వెళ్ళడంతో రమణని హాస్టలుకిపంపి నేనుక్లాస్‌లోకివెళ్ళాను.

ప్రాక్టికల్స్ పూర్తి చేసి సాయంత్రం ఐదున్నరకి హాస్టలుకి వెళుతూ రమణ మూడ్‌ని బాగు చేయడానికి ఏం చేయలా అని ఆలోచిస్తూ వెళ్ళాను.

హాస్టలులో రూమ్ దగ్గరికి వెళ్ళేసరికి మాటలు వినబడుతున్నాయి. రమణ నా రూమ్ మేట్‌తో అంటున్నాడు "మళయాళం సినిమా కదా పెద్ద రష్ వుండదనుకున్నానండి. కానీ తెగ వచ్చారండి జనం. టికెట్ దొరకడం కష్టం అయింది."

"సినిమాఎలావుంది?" నా రూమ్‌మేట్ ప్రశ్న.

"సినిమా పెద్ద అర్ధం కాలేదండి. అయినా సినిమా చూడడానికి వచ్చిన వాళ్ళంతా కేరళ వాళ్ళు కాదుకదండీ. అంతా హీరోయిన్‌ని చూడడానికి వస్తారు" వాడు విడమర్చి చెబుతున్నాడు. నాకు మతిపోయింది. మధ్యాహ్నం ఒంటిగంట రమణకి సాయంత్రం ఐదున్నర రమణకి ఎంత తేడా! నాకెందుకో హఠాత్తుగా — కొత్తగా కాపరానికి వచ్చి నెల తిరగకుండానే ప్రమాదంలో పిన్ని చచ్చిపోతే ఇక తనకి జీవితమే లేదని తనూ చస్తానని నానా గొడవ చేసి మూడు నెలలు తిరగకుండానే రెండో పెళ్ళి చేసుకున్న బాబయ్య గుర్తుకి వచ్చాడు. మళ్ళీ నాకే అనిపించింది వైరాగ్యం శ్మశానం వరకే పరిమితం కాబట్టి ఈ ప్రపంచం ఇలా వుంది. లేకపోతే ఈ లోకంలో గౌతమబుద్ధులు, అశోకులు చాలా మంది వుండేవారు □



శ్రీమతి ఆర్. మాధవీలత రచించిన 'ఈ తరం మగువ' యిటీవల మద్రాసులో శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారికి అంకితమిచ్చిన సందర్భంలో కృష్ణశాస్త్రిగారి ఉపన్యాసాన్ని చదువుతున్న శ్రీ బి. యస్. ఆర్. కృష్ణగారు. శ్రీమతి ఎ. జి. హేమలత, డి. హేమలతా, ఆంజనేయులు, రచయిత్రి ఆర్. మాధవీలత కూడా చిత్రంలో ఉన్నారు.

క్రొత్తగా!

వేడివేడి వడ్డనలకు ఇగ్లూ హాట్‌ప్యాక్, వండి నాలుగు గంటలైనాసరే ఎంతో కమ్మదనము



మళ్ళీ వేడిచేయడం అంటూ వుండదు :

ఇప్పుడు వంట త్వరగా చేసుకోండి. కూరలైనా, పులుసైనా, అన్నమయినా సరే, క్రొత్తగావచ్చే ఇగ్లూ హాట్ ప్యాక్‌లో పెట్టి మూతపెట్టండి. ఎంత సేపైనాసరే, 4 గంటలదాకా అప్పటికప్పుడు వండినట్లు తాజాగా వేడిగా పొగలొస్తూ రుచిగా కమ్మగా వుంటాయి.

కాలము—ఇంధనము ఆదా :

ఇగ్లూ హాట్‌ప్యాక్ వాడితే తిరిగి వేడిచేసి వడ్డించే అవసరంలేదు. ఆ రోజులు పోయినాయి. ఎంతో తీరిక వుంటుంది. ఖర్చు తక్కువగా వంట అవుతుంది. సాధారణంగా తిరిగి వేడిచేస్తే అహారంలో సత్తువపోతుంది.

ఇగ్లూ హాట్‌ప్యాక్ సుప్రసిద్ధమైన జనరల్ స్టోర్సులలో కావలసిన సైజులో లభిస్తుంది. ఇవ్వాళే ఇగ్లూ హాట్‌ప్యాక్ ఇంటికి తీసుకు వెళ్ళండి. మీకన్నీ లాభాలే. ఇంకా ఎంతో తీరిక కూడా!

ఇదే నిదర్శనము!

ఈ ప్యాక్‌ను రెండు నెలలపాటు వుపయోగించి పరిశోధించి, మద్రాసులో పాకశాస్త్రమునకు సంబంధించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాటరింగ్ టెక్నాలజీవారు చెప్పినది గమనించండి:

"ఇందులో వేడి నిల్వశక్తి చాలా బాగా వుంటుంది తాజాతనము ఎంతమాత్రము చెడదు... 8 గంటల తరువాత కూడా, రుచి ఏమీ తగ్గదు. ఇవి చాలా సమర్ధవంతమైనవి."

IGLOO hotpack

మెటోప్లాస్ట్‌వారి తయారీ

మెట్టూర్ బియర్డ్‌సెల్ లిమిటెడ్

OBM 4897 TG

మహిళా జ్యోతి

పువ్వు - తుమ్మెద

ఎస్. హన్మంత్రావ్

ఉదయం—ఎనిమిదీ పది....

అప్పుడే తెరిచారు లైబ్రరీ.

అంతా నిశ్శబ్దం, పైన ఫ్యాన్స్ చప్పుడు తప్ప!

సైన్సు రాక్ దగ్గర నిలబడి బుక్స్ వెతుకుతున్నాడు శశి.... ఒక్కడే!....

జోళ్ల చప్పుడు, సుతారంగా—

చటుక్కున తలతిప్పి గుమ్మం కేసి చూశాడు ఆతృతగా.

ఇద్దరు ముద్దుగుమ్మలు—ఉష....మంగ.

బుక్స్ మార్చుకోవడానికి కాబోలు—వొచ్చారు.

శశి కళ్లు అమావశ్య నక్షత్రాల్లా మెరిశాయి మిలమిలా....కొన్నిక్షణాలు.

చిన్నగా ఈల వేశాడు పైకి శబ్దం రాకుండా. చిటికెలు వేశాడు. ...."ఓహ్! .... గోల్డెన్ డాల్స్'—" హుషారుగా అనుకున్నాడు.

వాళ్లు వస్తూనే, చూడనట్టు చూశారతన్ని....

పుస్తకాల్ని లైబ్రేరియన్ చేత 'రవుండఫ్' చేయించుకుని 'టికెట్' తీసుకున్నారు.

మంగ అవతలి వరుసలో మూలగా వున్న 'పొయిట్రీ' రాక్ దగ్గరి కెళ్లింది.

నవలల రేక్ కేసి ఉష.

నావల్స్ రాక్కూ, సైన్స్ రాక్కూ సైడ్ బై సైడ్.

....'అన్నీ చదివినవే!....'

విసుగ్గా పక్కకు తల తిప్పింది ఉష.

శశి, చేతిలోని పుస్తకం పేజీలు తిరగేస్తూ ఆ వంకతో, ఆమెనే చూస్తున్నాడు.

అతని కళ్లల్లో— పెదాలపై....కొంటె నవ్వు.

ఉలికిపాటు ఫీలై కలవరంగా తల తిప్పేసింది వుష.

మనసు 'ఎదోలా' అయ్యిందామెకు.

గోరింటాకు పెట్టుకున్న ఆమె ఎర్రటి వేళ్లు మాత్రం నవలల్ని వెతుకుతూనే వున్నాయి.

....'ఇంకా అలానే చూస్తోన్నాడా? .... లేదా?....' మనసులో తర్జన భర్జన..

ఐనా, ఉష అతనివైపు తల తిప్ప దల్చుకో లేదు—తిప్పలేదు కూడా....

ఉష చేతిలోకి 'లత'—'ఒమర్ ఖయాం'

వొచ్చింది. అంతే!....దాన్ని పట్టుకుని వేగంగా లైబ్రేరియన్ సీట్ వైపు నడిచింది.

నడుస్తూ తనకు తెలీకుండానే ఒకసారి అతని కేసి చూసేసింది.

బుక్ 'రాయించు' కున్నాక, ఆయన్ని ఏదో పాత మంత్లీ అడిగి తీసుకుని వరండాలో కెళ్లి కూచుంది.

....'అతను బయట కింకా రాడేం?....' ('ఛీ!....ఇదేంవిటి? .... అతని గొడవ తన కెందుకు?—')....'పాపం! ....కావాల్సిన బుక్ ఇంకా దొరకలేదు కాబోలు!....'

వేళ్లు పేజీల్ని తిరగేస్తున్నాయి.... కళ్లు అక్షరాల్ని చూస్తోన్నాయి—కాని మనసు మాత్రం పుస్తకం మీదలేదు. మరి?....

లోన, శశి సైన్సు రాక్ నించి కదిలాడు.

....'ఏది రెండో బేబి?....' అటూ ఇటూ చూశాడు. లైబ్రేరియన్ దగ్గర కొచ్చి, అక్కడున్న తొట్టి లోని బుక్స్‌ని పరిశీలిస్తున్నట్లు నటిస్తూ— చూశాడు.

ఇంకా మంగ కవిత్వపు రాక్ దగ్గరే వుంది. బయటికి తీసిన బుక్స్‌ని, రెండేసి పేజీలు చూసి మళ్లీ పెట్టేస్తున్నది.

....'లిటరరీ టచ్ బాగా వున్నట్టుందే!....' మెత్తగా అడుగు లేస్తూ అనువాద నవలల రాక్ కేసి నడిచాడు.

ఆ రాక్ పొయిట్రీ రాక్ సరసనే వుంది.

నవలల్ని వొరసగా తీస్తోన్నాడు.

....'స్పార్టకస్' .... 'పారిస్ పతనం'.... 'దిటవు గుండెలు'....

తీస్తోన్నాడేగాని, వాటిని చూడటం లేదసలు. ఆ వంకతో చూస్తున్నాడు ఆమెను....

మంగ గ్రహించింది, ఆ సంగతి.

ఆమె చేతిలోంచి పుస్తకం జారి పడింది.

వంగితీస్తో, చూసింది అతని కేసి.

....'ఎవరీ బాలకుడు?....' సరదాగా అనుకుంది.

అతను అలానే దొంగ చూపులు....

ఆ చూపులకు, మంగకి నవ్వొచ్చింది. కింది పెదవిని పంటితో సుతారంగా నొక్కి ఆపేసింది నవ్వుని.

పుస్తకాలు తీస్తోంది.

చెలం — "సుధ" .... నారాయణబాబు— "రుధిరజ్యోతి"....'అర్థం కావేమో'—పెట్టేసింది వాటిని.

ఇంకా తన్ని చూస్తూనే వున్నాడనిపించింది ఆమెకు.

ఆ ఆలోచనకి చిరుకోపం మొలకెత్తింది ఆమెలో.

చివ్వున తలతిప్పి చూసిందతన్ని.

కోపంగానే చూశా ననుకుంది.

కోపాల్లో రకాలున్నాయి. కొన్ని కోపాలు అసలు కోపాలే కాదు. ఎండా వెలుగే....మరి వెన్నెలా వెలుగే!....కాని రెంటికీ తేడా లేదూ?

ఆమె కళ్లలో అసలు తీక్షణత లేదు.

లేత నీలం కళ్లద్దాల్లోంచి నవ్వుతున్నాయి అతని కళ్లు..ఏదో ప్రాధేయపడుతున్నట్లున్నాయి అతని చూపులు....కొద్దిసేపు 'అలా' చూసి—పుస్తకం లోకి తల తిప్పుకుంది.

ఆమె చేతిలో దాశరధి....'గాలిబ్ గీతాలు'.

పేజీలు సుతారంగా తిప్పుతూ ఒకచోట ఆగి చదివింది.

....'భాను సోమాదులకు తీసిపోని నాదు
నేత్రములు నీ పదాల నంట నీయవేమొ?....'

—చురుక్కుమంది ఆమెకు.

ఆ పుస్తకం తీసికొని అతని పక్కనించి పేజీలు తిరగేస్తూ విసవిస నడచింది లైబ్రేరియన్ వైపు.

బుక్ రిజిష్టర్‌లో సంతకం చేసి తలెత్తుతూ చూసిందతన్ని.

అతనింకా ఏదో ముఖ్యమైన పుస్తకం దొరకనట్టు సీరియస్‌గా వేతుకుతూనే వున్నాడు.

'ఆహా!....నటనాగ్రేశ్వరుడు!....'

విచ్చుకుంటున్న పూరేకుల సుతారపుసొగసు-చిర్నవ్వు తాకిడికి కదిలిన ఆమె పెదాల్లో.

వరండాలో కొచ్చింది. మంత్లీ తిరగేస్తూ వుష కనిపించింది. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

"పోదా మాండీ?"....పుస్తకం మూసి లేచింది ఉష. మనసు మాత్రం....'ఇంకావుందాం'.... అంటో గోల చేస్తోంది. "కాలేజీకి టైం అవుతుంది."—సర్దిచెప్పింది మనసుకి.

"ఆ"

('కొంసేపు వుందాం'....అందాం అనుకుంది మనసులో మంగ.)

ఉష మంత్లీ యిచ్చేయడానికి లోని కొచ్చింది.

ఇచ్చేస్తూ చూసిందతన్ని.

అతనూ ఇటే చూస్తున్నాడు.

తలొంచుకుని బయటి కొచ్చేసింది. ఇద్దరూ కదిలారు.

శశి ఏ పుస్తకమూ తీసుకోకుండానే, వొచ్చేశాడు బయటికి.

రంగు రంగుల అర్థ సర్కిల్ డిజైన్లున్న చీరె, జాకెట్లలో—నిటారుగా నడుస్తోన్న ఇంద్ర ధనుస్సులా—మంగ....

ఆమె మేనివన్నెకు మ్యాచ్ అయిన పండు మొగలిరేకు రంగు డ్రెస్‌లో, వెన్నెల దాల్చిన రూపంలా—వుష....వెడుతున్నారు.

మంగ కురుల్లోంచి వస్తోన్న సింహాచలం సంపెంగల పరిమళాన్ని, వుష జడలోంచి వస్తోన్న బొగడపూల సుగంధాన్ని జమిలిగా ఆస్వాదిస్తూ శశి—వాళ్ల వెనుకనే....

రోడ్డుమీద....

....'వస్తున్నాడా అతను?....' కనురెప్పలు సుతారంగా కదుపుతూ క్రీగంట చూసింది ఉష.

....'ఫాలో అవుతున్నట్లున్నాడు!'....కళ్లు దీర్ఘం చేసి వాలుచూపులు చూసింది మంగ.

'వస్తున్నాడు.'—ఆనందం. తృప్తి.


'ఫాలో అవుతునాడు.' — సంతోషం. గర్వం.

'బావున్నాడు కదూ!....' అనుకుంది ఉష (ఛీ!.... ఏఁవిటీ వూహాలు?....)

'మాన్లీగా వున్నాడు'—మంగ. ('యూ బ్రూట్ అతనేలా ఏడుస్తే నీ కెందుకు?....' మనసుని కసురుకుంది.)

విసవిస నడుస్తున్నారు, ఎర్రటి పాదాలపై కుచ్చిళ్లు పారాడుతుంటే.

....వాళ్ల వేగానికి తగ్గట్టుగా అడుగులేస్తూ శశి.



కొత్తగా మెరుగు పర్చబడిన డెట్ బిళ్ళ, బజార్లో దొరికే డెటర్జెంట్ ఉతికే బిళ్ళల కంటే ఎంతో మేలైనది.

మరకిని వదిల్చే శక్తికీ, నురుగు నివ్వడంలోనూ, సువాసనలు చిందించడంలోనూ దీనికి మరేదీ సాటికాలేదు.

వాడి చూడండి! తేడా ఏమిటో మీరే తెలుసుకోండి! నిజమే, సుప్రీమ్ డెట్ బిళ్ళే 'తళతళలాడే' తెలుపు యిచ్చేది!

దివ్యమైన తెలుపు,
డెట్ యొక్క తెలుపు

Shilpi-dm 17a/76 Tel

....'బావున్నారు .... "పాపలు" .... (శశి పర్సనల్ డిక్షనరీలో ఆ పదానికి ప్రత్యేకార్థం వుంది.) ఎపుడూ కనిపించలేదు.... ఇళ్లెక్కడో? ఇద్దరికీ దూరంగా వుంటే బాగుణ్ను. ఇద్దరూ ఫ్రెండ్స్ కాకుంటే బాగుణ్ను—భలే వున్నారు యిద్దరూ.....

ముందు వాళ్లు వెనుక శశి—నడుస్తూనే వున్నారు.

—'తన గురించే!....'—అనుకుంది పుష

....'హి ఫాలోస్ మి!'—మంగ

కాని....

అతను మాత్రం....

* * *

శశి వో చిన్నసైజు కాసనోవా.

అందాల్ని అనుభవించటం, ఆనందించడం తప్ప మగాడికి ఏ బరువూ బాధ్యతా దేవుడు నిర్దేశించలేదని అతని ఫిలాసఫీ.

అంచాత సాధ్యమైనన్ని అందాల్ని అనుభవించటం, సాధ్యమైనంత ఆనందాన్ని జుర్రుకోవటం అతని లైఫ్ ప్రిన్సిపల్.

శశి తన లైఫ్ ప్రిన్సిపల్‌ని ప్రాక్టికల్‌లో పెట్టడానికి—అతని అందం .... ఆకర్షణ .... డబ్బూ—సాధనాలు.

* * *

అదేవిటో....అంతా శశి ఆశించినట్లే అయ్యింది.

అతను కోరుకున్నట్టుగానే వాళ్లిద్దరూ ప్రాణస్నేహితులూ కారు, ఎక్కడికైనా జంటగా తప్ప విడిగా వెళ్లని సాన్నిహిత్యం వున్నవాళ్లూ కారు. కనీసం క్లాస్‌మేట్స్ కాదు. కేవలం స్కూల్ మేట్స్‌మాత్రం.

ఆవేళ—వూరికి ఆ చివర్న, ఈ చివర్న.... వున్నవాళ్ల యిళ్ల నించి ఒంటరిగానే బయల్దేరారు లైబ్రరీకి. దార్లో కలిశారు కాకతాళీయంగా. ముఖపరిచయం కొద్దీ పలకరించుకుని, కల్సి వొచ్చారు— అంతే!

....ఈవిషయాలన్నీ కొద్దిపాటి 'పరిశీలన' తోటే అర్థమయ్యాయి, ఎక్స్‌పర్ట్ శశికి.

ఇంకేం—యుగాల పురుషత్వం అతన్ని వుత్సాహపర్చింది.

దిగటమేకాదు, త్వరలోనే వాళ్లనీ దించాడు....

శశి, వాళ్లిద్దరితోనూ 'సైమల్‌టేనియస్'గా సాగిస్తోన్న "ప్రేమ" (క్షమించాలి—ఇది తెలుగుకథ.)....చెకచెకా చిర్నవులూ....పలకరింపులూ....ప్రేమ లేఖలు రాసుకోవడాలు.... "ఒకరి కొకరు" అనుకోవడాలు—లాంటి దశలన్నిటినీ ఝుమ్మని దాటేసి 'చివరిదశ' కొచ్చేసింది.

అవును—మగాడి వంచనా చాతుర్యం ముందు ఆఫ్టరాల్!....ఆడదెంత?....

—ఇక తర్వాతి కథ గురించి వివరంగా చెప్పనక్కర్లేదు. అదేం కొత్త కథ కాదు. యుగాల నించీ జరుగుతున్నదే, అది అందరికీ తెలుసున్నదే.

అది....ఏంలేదు .... పువ్వుల్నించి తేనెని తృప్తితీరా పీల్చేసుకున్న తుమ్మెద మరోసారి ఎగిరిపోయింది.

తేనె కోల్పోయి వాడిపోయిన వో పువ్వు ఎక్కడో రాలిపోయి వెంటనే మట్టిలో కల్సిపోయింది.

మరో పువ్వు నలుగురూ నడిచే దార్లో రాలిపడి, ఎన్నో కరకు కాళ్ల కింద నలిగి నలిగి రేకలు వూడగొట్టుకుని—చివరికి ఆ మట్టిలోనే కల్సింది.

అయితే—తుమ్మెద మాత్రం యింకా కొత్త పూలను వేటాడుతూనేవుంది....

ఈ కథకి ఇప్పట్లో ముగింపులేదు. కాని ముగిసే రోజు ఒకటి వుంది....

మగాడి వంచనని తెల్సుకోలేని అమాయకతలో, తప్పించుకోలేని అశక్తతలో—ఆ వంచనకి నాశనమయ్యే హీనస్థితిలో ఆడది లేని రోజున....

తనకి సంఘం, ధనం, అధికారం ప్రకృతి యిస్తోన్న ఆధిక్యతా బలిమితో—స్త్రీ తనకి ఆనందాన్నిచ్చే వో వస్తువు అనుకునే స్థితిలో మగవాడు లేని రోజున....

ఈ కథకు అంతం!....


అందాకా—

ఆడది పువ్వు.

మగాడు తుమ్మెద.

అంతే.

ప్రతి తల్లికి కావలసింది...



కొత్త! సై-బాన్* లోషన్

సురక్షితమైన, ఫలప్రదమైన పేనులమందు. జిడ్డులేదు. ఆహ్లాదకరమైన సువాసన.

సై-బాన్ చాలా ఫలప్రదమైనది. రాత్రి పూట దీనిని నెమ్మదిగా తలలో రుద్దండి. ఉదయానికల్లా చచ్చిన పేలనూ, ఈళ్ళనూ దువ్వి పారేయండి. తల అంటుకొనందు. పేల బాధనే మరచి పోతారు.

సై-బాన్‌కు జిడ్డు లేదు


సై-బాన్‌లో నూనెలేదు దాని మూలంగా తక్షణం సమస్యను సమూలంగా పెరికివేస్తుంది.
జిడ్డు లేదు. గలేబులకు మరకలు పడవు.
బాదరబంది లేదు. సత్వరం వ్యాపిస్తుంది.

సైబాన్‌కు ఆహ్లాదకరమైన సువాసన ఉంది.

ఇతర పేలమందులలాగు సై-బాన్ కంపు కొట్టదు. దీనికి ఆహ్లాదకరమైన లవెండరు సువాసన ఉంది. రాత్రంతా ఈ సువాసన వేస్తూనే ఉంటుంది.

సై-బాన్ సురక్షితం

సై-బాన్ లోషన్ జుట్టుకూ, జుట్టు క్రింద చర్మానికీ సురక్షితం. సై-బాన్ లోషను ఉపయోగించడం మూలంగా జుట్టు రంగులో మార్పు కలగదు, జుట్టు రాలదు కూడా! సహజమే. ఇది లెడర్‌లె నుంచి వస్తూంది. ఐదు సంవత్సరాల, పరిశోధనకూ, పరీక్షలకూ ఇది ఫలితం. ఈ పరీక్షల మూలంగా, ఇది నిస్సంకోచంగా సురక్షితమైనదనీ, ఫలప్రదమైనదనీ రుజువు అయ్యింది. అన్ని మందుల దుకాణాలలోనూ దొరుకుతుంది.



Lederle

లెడర్‌లె ఉత్పత్తి
*అమెరికన్ సయానమిడ్ కంపెనీవారి రిజిష్టర్డ్ ట్రేడ్‌మార్కు

సై-బాన్*
రాత్రికిరాత్రే, పేలనూ, ఈళ్ళనూ హతమారుస్తుంది.

Sista's-CY-881 R1 Tel

సీరియల్

ప్రేమసింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

14

స్వప్న వుతికిన చీరెలు వరసగా తాడుమీద ఆరేసి అంచులు సరితీస్తోంది. నిన్నటి వరకూ పరీక్షలతో కాలం గడిచిపోయింది. తెల్లవారుఝామున లేవటం, రాత్రి పొద్దుపోయేవరకూ చదవటం, అదొక లోకం అయిపోయింది. బట్టలు ఏరోజుకి ఆ రోజువి తప్ప అన్ని వుతకనే లేదు. ఈరోజు కూడా అలవాటు ప్రకారం తెల్లవారఝామున మెలకువ వచ్చేసింది. మళ్ళీ నిద్రపట్టనే లేదు. అప్పుడే లేచి చేసే పనికూడా లేదు. మంచంమీద అటు, యిటు మెసలుతూ పడుకుంది. పరీక్షలు అయిపోయినాయి. స్వప్నకి ఎంతో ఆనందంగా వుంది. అన్ని పేపర్లూ బాగా వ్రాసింది. పాసవుతాననే ధైర్యం బాగా వుంది. ఏ పనైనా ఏకాగ్రతతో చేస్తే ఆ ధ్యానంలో ఎంత అనిర్వచనీయమైన తృప్తి వుంది. ఈ పరీక్ష పాసవుతే ఏదయినా వుద్యోగం చూసుకోవచ్చు. అప్పుడెవరి దయాధర్మాల మీద ఆధారపడకుండా, తన కాళ్ళమీద తను నిలబడవచ్చు. స్వప్నకి ధైర్యంగా అన్పిస్తోంది. సుధీర్ చేయూత యిస్తున్నాడు. అది ఆధారం చేసుకుని, తన స్వశక్తిమీద తను నిలబడగలిగే సంయమనం సంపాయించుకోవాలి. బేలతనం పోకూడదు.

స్వప్న లేచివచ్చి కిటికీ దగ్గర నిలబడింది. తొలి వుషస్సులో ప్రకృతి మేలిముసుగు జారవిడుస్తున్న సౌందర్యవతిలా భాసిస్తోంది. స్వప్న కిటికీ చువ్వలని పట్టు

జరిగిన కథ :

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నకు సీరియస్‌గా వుందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. సుధీర్ సహాయం వద్దనుకొనికూడా పొందవలసే వచ్చింది. స్వప్న మేనమామ వెంట వాళ్ళింటికి వెళ్ళింది. మేనమామ భార్య రుసరుసలాడింది స్వప్నని చూసి. మేనమామ భార్య తనకు బలవంతంగా పెళ్ళి ఏర్పాటు చేస్తే తప్పించుకు పారిపోయింది స్వప్న. ఒక డాక్టరు మిత్రుడు ఫోన్‌చేస్తే వెళ్ళిన సుధీర్ పెళ్ళిదుస్తుల్లో వున్న స్వప్నను అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్నను నర్సు మరియమ్మ ఇంట్లో ఉండే ఏర్పాటు చేశాడు డాక్టరు. స్వప్న కారణంగా తనకిచ్చిన మాట పోగొట్టుకున్నందును సుధీర్‌పై కోపగించుకొంది విమల. స్వప్నని ఓదార్చి, పెళ్ళి చేసుకొంటానని చెప్పి, తన కౌగిలిలోకి తీసుకొని ముద్దాడినట్లు కలగన్నాడు సుధీర్. మెలకువ వచ్చినా స్వప్నని తాకిన అనుభూతిని మాత్రం మరువలేకపోయాడు. తల్లి బలవంతాన, విమలకు సారీ చెప్పేందుకు బయలుదేరాడు సుధీర్. ఆపదలో వున్న స్వప్నను తా నాదుకోవలసిన పరిస్థితులను మామయ్యకు వివరించి, తర్వాత విమలతో ముచ్చట్లాడి ఆమె కోపాన్ని పోగొట్ట గలిగాడు సుధీర్. సుధీర్ ప్రోత్సాహంతో బి. ఎ. పరీక్షకు కట్టింది స్వప్న. తనకు తెలియకుండానే సుధీర్‌ని అభిమానించ సాగింది.

కుని, వాటికి ముఖం ఆనించి ఆ ప్రకృతినే చూస్తోంది! ఎన్నడు ఎరగని శోభతో విలసిల్లుతున్నట్లుగా అనిపించింది! ఆ చెట్లు ఎంత ప్రశాంతంగా వున్నాయి! తపోవనంలా వుంది ఆ నిశ్శబ్దం!

మరియం అంటే స్వప్నకి కృతజ్ఞత! ఆమె దగ్గర వుంచుకోవటమే కాదు, స్వంత తల్లిలా చూస్తుంది! ఒక పూట భోజనం చేయకపోతే వూరుకోదు. అది సుధీర్ పట్ల వున్న గౌరవమేనని తనకి తెలుసు! అయినా సరే, ఆ ఆత్మీయత తనకి ఎంతో బాగుంది!

స్వప్నకి ఆ రోజంతా తీరుబడే! ఇల్లంతా సర్దింది! తన బట్టలన్నీ తీసి వుతికి ఆరేస్తుండగా, వాకిట్లో సైకిల్ గణగణ వినిపించింది.

సుధీర్ టైపిస్ట్ వచ్చాడు. స్వప్న చేస్తున్న పని ఆపి, వెళ్ళింది.

అతను సైకిల్‌మీద నుంచి దిగకుండానే, ఒక కాలు నేలమీద మోపి, జేబులో నుంచి కవరు తీసి యిచ్చాడు.

అది చూడగానే స్వప్న ముఖం కాంతిపుంజంలా అయింది. గభాల్న చింపి చదివింది. అది సుధీర్ వ్రాసాడు. అందులో యిలా వుంది. "స్వప్నా, నిన్నటివరకూ పరీక్షలకి చదవటంతో విసుగెత్తిపోయిందేమో కదూ! సాయంత్రం కారు పంపుతాను. నువ్వు, కోమలి ఎక్కడికైనా వెళ్ళి తిరిగి రండి. సినిమాకి వెళ్ళ దలుచుకుంటే యితనితో చెప్పు. టికెట్స్ రిజర్వ్ చేయించి తెస్తాడు. సుధీర్."

ఎంత సింపుల్‌గా, సూటిగా వుంది వుత్తరం! స్వప్నకి చెప్పలేని సంతోషం కలిగింది. తలెత్తుతూ అంది. "సినిమాకి వెళ్ళను. సాయంత్రం గుడికి వెళ్ళి వచ్చేస్తాం అని చెప్పు" అంది.

అతను సరే నన్నట్టు తల వూపాడు.

"సాయంత్రం అయిదు గంటలకి కారు తీసుకువస్తాను. రెడీగా వుండండి." అని చెప్పి వెళ్ళిపోయాడు.

స్వప్న చీరెలు ఆరేసే చోటికి వచ్చింది! చీర అంచు సరిచేస్తూ సుధీర్ వ్రాసిన ఆ చీటీని మళ్ళీ చదివింది!

మళ్ళీ మళ్ళీ అదే ప్రశ్న! సుధీర్‌కి నేనంటే యెందుకింత యిష్టం! స్వప్న మనసు ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేకపోతోంది! అతను నోటితో ఏదీ చెప్పడు! కానీ అతను చేసే ప్రతి పనీ, తనంటే ఆత్మీయత చూపేట్లుగా వుంటుంది!

స్వప్న మనసులో యుద్ధం ప్రారంభమవుతోంది! అతనంటే, తెలియకుండానే, ఇష్టంలాటిది ఏర్పడుతోంది! గౌరవంకంటే, అభిమానమే అధికమౌతోంది! స్వప్నకి అంతలోనే మళ్లీ భయంవేస్తుంది! నేనేంచేస్తున్నాను? అతను మామయ్య పట్ల అభిమానంతో, కాస్త ఆదరం చూపుతుంటే గాలిమేడలు కట్టేయటం లేదుకదా! అని సంకోచం కలుగుతుంది. ఏది ఏమైనా అతని సాయంతీసుకోక తప్పలేదు. ఆ ఋణం తను తీర్చలేనిది!

స్వప్న అక్కడున్న జామచెట్టుకి ఆనుకుని ఆ చీటీని మళ్లీ చదివింది!

ఆ వుత్తరంలో ప్రతి వాక్యంలో, ప్రతి అక్షరంలో అతని ఆత్మీయత కన్పిస్తున్నట్టుగా వుంది! అతనెంతో బిజీగా వుంటాడు! పరీక్షలపోయినాయి! నిజమే! కానీ తనకి విసుగ్గా వుంటుందని, తోచనట్లుగా అన్పిస్తుందని అతనికెలా తెలుసు? ఏమో! ఈ ప్రశ్నలకి జవాబులే దొరకవు!

సాయంత్రం అయింది! కోమలి ముస్తాబు అయి వచ్చింది! స్వప్న అప్పటికే రెడీ అయింది! 5 గంటలు అవుతుండగా కారు వచ్చింది. అందులో టైపిస్ట్‌కూడా వున్నాడు. స్వప్న, కోమలి వెనక సీటులో ఎక్కారు.

దోవలో కోమలి, టైపిస్ట్ ఒకటే మాట్లాడుతున్నారు. స్వప్న మాట్లాడలేదు. తల వెనక్కి ఆనించి కూర్చుని బైట బజార్లు చూస్తోంది। మనసులో ఒకటే అనిపిస్తోంది। ఇది సుధీర్ పంపిన కారు। అతను, తనకి యింట్లో కూర్చుంటే విసుగ్గా వుంటుందని, తిరగటానికి పంపించాడు. తన మనసు అతనికెలా తెలిసింది। స్వప్నకి చాలా ఆనందంగా వుంది। మన మనసులో మాటని పెదవివిప్పి చెప్పకుండానే తెలుసుకునే ఆత్మీయులు వుంటే యెంత బాగుంటుంది।

కారు గుడి దగ్గరికి వచ్చి ఆగింది టైపిస్ట్ వెళ్ళి కొబ్బరికాయలు తెచ్చాడు। స్వప్న, కోమలి గుడిచుట్టూ ప్రదక్షిణాలు చేసారు.

"స్వప్నా ఏమని దణ్ణం పెట్టుకుంటున్నావు।" అంది కోమలి.

"ఏది? నేనింకా దణ్ణం పెట్టనే లేదే."

"చేతులతో కాదోయ్. మనసుతో."

"నేనేమీ అనుకోలేదు। నువ్వు," అంది.

"నేనా। నాకు ఫస్ట్‌క్లాస్ రావాలని? మా బావతో పెళ్ళి సెటిల్ అవాలని?"

స్వప్న నిట్టూర్చింది। 'నాకలాటి కోరికలే కలగడంలేదు. పరీక్షలంటావా। మనం వ్రాసినమేరకి పాసవుతాం। దేవుడేం చేస్తాడు।' అంది.

"ఏం చేస్తాడా! తలచుకుంటే కావాల్సినంత చేస్తాడు! మన పేపర్లు దిద్దేటప్పుడు వాళ్ళ మనసు చికాకుగా వుంటుందనుకో. ఎంత బాగా వ్రాసినా మార్కులు పడవు. అదే ప్రసన్నంగా వుంటారనుకో. మార్కులు వ్రాసినదానికంటే బాగా పడ్తాయి."

"బాగుంది!" నవ్వింది స్వప్న.

ఇద్దరు గుడిలోకి వెళ్ళారు. పూజ పూర్తి అయింది. తిరిగి కారు దగ్గరకి వచ్చారు. వాళ్లు కారు దగ్గరకి వస్తుండగానే, ఇంతలో గుడి ఆవరణలోకి రంయ్‌న పచ్చటి అంబాసిడర్ వచ్చి ఆగింది. అందులో నుంచి షిఫాన్ చీర కట్టుకుని, ముత్యాల నగలు ధరించిన ఒక తెల్లటి అమ్మాయి దిగింది. గుడివైపు వెళ్ళబోతున్నదల్లా అక్కడున్న తెల్లటి ఫియట్ చూసి కనుబొమలు ముడిపడగా అటు వచ్చింది. కళ్ళతో వెతికింది. డ్రైవరు వచ్చాడు.

"బావ ఎక్కడ?" అంది.

"ఆయన రాలేదు" అన్నాడతను.

"అత్తయ్య వచ్చిందా?"

"ఉహూ" తల వూపాడు.

"మరి?"

"అరుగో" చూపించాడు.

"ఎవరు వాళ్ళు" అప్పటికే, స్వప్న, కోమలి కారు దగ్గరకి వచ్చారు. 'యెవరు వాళ్లు?' తీక్షణంగా అడిగింది.

'ఈ అమ్మాయి స్వప్న. ఈమె ఆమె ఫ్రెండ్ కోమలి!' టైపిస్ట్ ఖంగారుగా చెప్పాడు. 'యీ అమ్మాయి, విమల అని లాయర్‌గారి మేనమామ కూతురు.'

స్వప్న, నమస్కరించింది. కానీ విమల నమస్కరించలేదు. చిరునవ్వు నవ్వలేదు.

టైపిస్ట్ కోమలి, స్వప్న కూర్చోవడానికి కారు డోర్ తెరవబోయాడు. విమల 'ఆగు' అంది. 'ఇలా అడ్డమైన వాళ్లందరికీ కారు యివ్వటం బావ యెప్పటి నుంచి చేస్తున్నాడు? మాకు తెలియనే తెలియదు! యీ కారు నాకు కావాలి! వాళ్లని ఏ రిక్షాలోనైనా పొమ్మని చెప్పు' అంది. ఆ మాటల్లో రవంత కూడా, అవతల వాళ్లని అమర్యాద చేస్తున్నాననే వెరపులేదు. టైపిస్ట్ తెల్లబోయినట్లు కారు తలుపుమీద నుంచి చేయి తీయటం కూడా మర్చిపోయినట్టు చూస్తున్నాడు. విమల కారులో తను యెక్కి కూర్చుంది. 'డ్రైవర్ రా! ఆ కారుని యింటికి తీసుకురమ్మన్నానని వాడికి చెప్పు' అంది. డ్రైవర్ తల వూపాడు. దూరంగా నిలబడి చూస్తున్న అంబాసిడర్ డ్రైవర్‌కి చెయ్యివూపి కారు తెమ్మన్నట్లు సైగచేసాడు.

"పోనీ!" అంది విమల.

డ్రైవర్ కారులో కూర్చుని వెంటనే స్టార్ట్ చేసాడు. ఫియట్ కదిలి వెళ్లి

పోయింది! దాని వెంటే తోకలా అంబాసిడర్ కూడా వెళ్లిపోయింది.

స్వప్న నిటారుగా నిలబడిపోయింది. టైపిస్ట్ మతిపోయిన వాడిలా ఖంగారుగా చూస్తున్నాడు కోమలి తికమకగా స్వప్నవైపు చూస్తోంది.

స్వప్న అణువణువులో విచిత్రమైన భావం నిండిపోయింది. అది భరించలేని అవమానం! ఏం చెయ్యలేని నిస్సహాయత్వం! నోరు మెదపలేని రాయిలాటి తెచ్చిపెట్టుకున్న మౌనం.

"ఇదేమిటి" అంది కోమలి.

"ఆ అమ్మాయి అంతే! సుధీర్‌గారికి కాబోయే భార్య! మేనమామ కూతురు" అన్నాడు టైపిస్ట్ నీళ్లు నములుతున్నట్లుగా.

గుడి ఆవరణలోకి అప్పుడే ఒక ఆటోవచ్చి ఆగింది. అందులోనుంచి యెవరో దిగారు. అది ఖాళీగా వెళ్ళిపోతుంటే, స్వప్న గభాలున దాన్ని చెయ్యెత్తి ఆపు చేసింది.

"కోమలీ వెళదాం రా!" అంటూనే కోమలి చెయ్యిపట్టి పరుగెత్తినట్టుగా ఆటోవైపు వెళ్లబోతూ క్షణంఆగి, 'మీ లాయర్‌గారికి మెనీ మెనీ థ్యాంక్స్ అన్నానని చెప్పు' అంది. మరునిముషంలో కోమలిని లాక్కెళ్ళినట్టుగా ఆటో దగ్గరకి వెళ్ళింది. స్వప్న ఏద చెప్పిందో ఏమో, ఆటో వెంటనే కదిలి వెనక్కి తిరిగి రయ్యిన వెళ్ళిపోయింది. అంతా క్షణంలో జరిగిపోయింది. —(సశేషం)

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

ఓరా! అదివా!

గోవిందు నరసింహారావు

"ఒద్దు సార్! డ్రెస్సులో ఉన్నాను."

"కామరాజో! పిరికిమాట లాడతన్నావేటి? పొయిబీస నున్న రోజుల్లోనే మన కద్దులేదు గదా, యియ్యాలేటి నీకు బియ్యం? మందుచ్చుకోని పోలీసోడూ, లంచముచ్చుకోని రెవిన్యూవోడూ మందులోకేనా లేడయ్యా బాబో! అదెరికే గదా! కసింత పత్తెంగా తీసుకొని గాని డూటి కెళ్ళినావంటే—నాసామి రంగా—పులి పులిలాగుంటావుకదయ్యా! రా! కూకో! కసింపేస్లే పోసీ, పీకల మొయ్యావొద్దు."

"నిజవే గాన్సార్, మా యినస్పెక్టరు ఊళ్ళో లేడు గాన్సార్, ఒద్దుసార్."

"ముండింటికాడా, మందుకొట్టుకాడా మొక మాటం పనికిరాదయ్యా పోలీసోడా! అదెరికే గదా! రా, రా."

"అది నిజవే గాన్సార్, ఘా సూపరెంటు ముండాకొడుకు మా చెడ్డ కడుపుడుకు మనిషి సార్! నాలుగ్ పెగ్గులు లాగించేసి—పెళ్ళాం పక్కలోంచి లేచొచ్చేసి పట్టీసుకుంటాడు సార్! అందులో యీ యినస్పెక్టరు వచ్చిందగ్గర్నుంచీ రేటు ప్రకారం స్టేషన్ మామూళ్ళోటి అందడం లేదు. అందుకని మరీ గుర్రుతున్నాడు. లేకపోతేనా........"

"ఓరమాయకుడా? నువ్వు పోలీసోడివా? పంతులివా? నీ ఉజ్జోగంలో యింకోడికి బియపడ్డం ఉంటాదా? కాదూ కూడదూ అంటే మాలాటి పెద్దోళ్ళ దగ్గరలా క్కసింత కనిపిస్తారు గాని. ఏటంతావు? రవిట్నా? రా కూకో!"

శ్రీకాకుళం పెద్ద పట్నంగాదు.

అలానే "శాంతి విహార్" పెద్ద హోటలు గాదు.

శ్రీకాకుళం బతుక్కి విశాఖపట్నం అందదు—ఎమ్మెల్యేలు ఓటరుగాడి కందనట్లు. అదంత పెద్దది.

అలానే విశాఖపట్నం బతుక్కి యే బొంబాయో, ఢిల్లీవో అందకపోవచ్చు. సెంట్రలీడర్లు, ఎమ్మెల్యేల కందనట్లు.

అలానే బలద బతుక్కి శ్రీకాకుళం ఊపిరి సలపనివ్వనంత పెద్దది. ఓటు లేనివాడికంటే ఉన్నవాడికి లాగానే!

అందుకే—శ్రీకాకుళం పేరు తల్చుకుంటే చాలు—వరసపెట్టి నాలుగు పెగ్గులు దిగించీసినంత కిక్కందుకుంటుంది — సింహాద్రి నాయుడికి.

"మన సివాకోలం అన్ని యవ్వారాలకీ కసింతటూ యిటూగా తూగతందిగాని—కామరాజో—ఒక్కటంటే ఒక్కటికాడ మాత్రం దేక్కర్దయిపోతుందయ్యా!" అన్నాడు నాయుడు—పుచ్చుకున్న మందు క్వాలిటీని ముంచుకొచ్చే చుట్టపొగ సర్దిఫై చేస్తుండగా!

చిన్నగా నవ్వేశాడు—మొదటి పెగ్గుకి కన్నెరికం చేస్తున్న కామరాజు.

"అది గాదయ్యా కామరాజో! మనసిప్పి మాటాడేస్తున్నాను—మరేటనుకోకు గానీ—మనకి మరీ యిజానగరాలు, పెద్దాపురాలంత పెద్ద పరుగులొద్దు ఏటి? ఒద్దనే నానూ అంతాను. మాంసం తింటున్నామని వెమికలు మెళ్ళో ఏసుకు తిరగలేం గదా! ఏటి? అర్థమయిందా? కాని—మన జిల్లా ఓల్డు మొత్తం తాగుతుకి తగ్గట్టు మన సివాకోలం ఉండాలంటావా? అక్కర్లేదంటావా? అద్చెప్పు పోనీ! పక్కనున్న పర్లాకిమిడి, నిన్న మొన్నటి

పార్వతీపురాలముందు మనూరు తలెత్తుకు తిరగాలా? వద్దా? ఆ పేంతాల నుంచొచ్చిన నాయుళ్ళముందు మనం నిలబడాలా! వద్దా? సిగ్గేస్తుందయ్యా బావో! అదీ నా బాద! హాసు పత్రి నేకపోతే వాయిజాగెల్తాం. కలిక్టీరాపీసు నేకపోతే యిజానగరం పోతాం. లేదూ మరో ఊరు పోతాం. తగువునేదు. కొంపలేం మునిగి పోవు. కాని ఈ దిగదుడుపు బతుకుందే— సస— దీన్ని భరించలేమయ్యా! అక్కడికి మన గయిరమ్మకి సెప్పినాను—మంచి గుంట కావాలంటే మొహం వోసిపోతన్నాం—కావా లంటే మరో బేడో పావలో తీసుకో గాని— యీ కక్కుర్తి నంజల్ని మాత్రం తగిలించీక అని. ఆ ముండ కెంతసేపూ కలింగపట్నం సేపల్లంజలే దొరుకుతారు నాసుంది. అల్లకంటే బట్టాండుకాడ అడుక్కునే ముండలు నయం. అసలు—అసలు యిది మీ డిపోమెంటికే సిన్నతనమయ్యా! యెవుడికైనా తెలిసిందంటే అక్కడి పోలీసోల్లేటి గాజులు తొడిగించు కున్నార్రా అని మిమ్మల్ని—అక్కడ మీసమున్న మొనగాడే నేడేటి అని మమ్మల్ని బూతులు తిడతారయ్యా—బూతులు-అదెరికేనా పోసీ?"

"చంపీసేరు సార్! అది పచ్చి నిజం. మా యినస్పెక్టరొట్టి వెధవన్నంత నిజం సార్."

"ఒప్పుకుంతన్నావుగదా! నాను సిమ్మాద్రి నాయుడ్నే గావచ్చు. మనకి మనూళ్ళ రంభ లాంటి ముండుండొచ్చు. కాని తెల్లారి నెగిస్తే మన బతుకు సివాకోలంయెగదు! ఇక్కడంటే మరి మందుకి—ముక్కకి కరువు నేదు గదా! ఆ తర్వాత దాని వాయినమేటీ అని? తాంబోళం లేని భోజనంల రుసేటుందయ్యా పోలీసోడా? పొగలు సంగతి బాదకదయ్యా! మరి రేతిరి మాటేటీ అని? దోమల్ని తోలుకుంటూ లాడ్జిం గుల జాగారం సెయ్యాల. నేదూ—ఆ గయి రమ్మ ముండకి వార్తమానించాల. అది ఆర్నెలకితం తానమాడిన పగుడ్రు లంజెల్ని తగిలించేస్తాది. తెల్లార్లూ ఆ సెందాలం మింగ లేక అదో సావు సావాల. రవిట్నా?"

"రైటామరి రైటాసార్! ఆడెవడో సెప్పి నట్టు యీ ఊరేటి మరీ అడివిలాగుందని డూటీల జాయినయినకాడ్నుంచీ మా సెడ్డిదై పోతాన్నానంటే నమ్మండి. బెల్లం వండిన పొయ్యిలంగదా! అయితేటి సెయ్యడం? మా యినస్పెక్టరొట్టి రూళ్ళకర్ర మనిషి-పెళ్ళాంతో సరసం చెయ్యడానిక్కూడా ఆడు రూలు ప్రకా రమే పోతాడు. గాంధీవో నెహ్రూవో కల్లోకి పారొచ్చి తిడతారేమోనని ఆడి బయ్యం— ఆళ్ళకి మరో పని లేనట్టు—ఈడ్ని తిట్టడమే ఆళ్ళ డూటీ అయినట్టూ. పిరికి నాయాల! ఆడితో ఒక సావు గాదంటే నమ్మండి.అయితే ఆడితో మనకేటి అని జల్దుకోకూడదా అని మీ లాటి పెద్దోళ్ళు అనొచ్చు. ఈ ఊరికి మన దింకా కొత్త కాపరం. జోరుకుంటే బాగుం డదు గదా! అందుకని సూత్తన్నానుగాని—లేక పోతేనా? అయినా కామరాజు సంగతి మీకు తెల్దేటి? అడివంటన్నారే మీరు—ఆ ఈ ఊళ్లో —రెండు మూడు క్లాసైన కంపెనీ లెట్టించీక పోతే నన్ను పేరుపెట్టి పిలకండి. మొగంమీద ఉమ్మేయండి. అంతే! కాకపోతే కొంచెం పై మివ్వండి. మరొద్దు సార్!"


"నీ సంగతి నాకు తెల్దేటి? ఓసి మరికసిం తుచ్చుకోవయ్యా? దీనికి నిమిసేటి?"

"ఇదే మోతాదు పదున్నారే! దాటీసినామా —సూపరెంటు నాయాల్తో సరస మాడేసి— పీకలమీదికి తెచ్చుకుంటాను. అందులోనూ ఎన కటకోపాలి జెల్లతినీసున్నాను గూడా! మరొ స్తానుసార్! మీరు సెలవిచ్చిన పసీ మీ దే ఉంటాను. రిబ్బను మీరు కత్తిరించాలి. ఒస్తాను సార్."

అలికిడి చచ్చిపోతోంది. అప్పుడే యేడు రోడ్ల జంక్షను దగ్గర జనం పల్చబడుతున్నారు. అక్కడక్కడా కలక్టరేటు శాల్తీలు, జిల్లా పరి షత్ పార్కులూ, హైస్కూలు శవాలూ సెలవు తీసుకొనే ముందు జరిపే తుదికాండను శాస్త్రో క్తంగా జరిపిస్తున్నారు.

"శ్రీకాకుళం అయిపోయింది గాని—ఇదే విశాఖపట్నంలో అయితేనా—ఈ టైములో యేం కలరు! ఏం బ్యూటీ!! ఆ సగం సంగ

రొమ్ములూ—ఆ మెరిసె పొట్టకింది భాగాలూ, మత్తెకించే బాహుమూల సౌందర్యాలూ, చిచ్చు రేపే చిర్నవ్వులూ, ఎదీ, మనూళ్ళో మచ్చుకొకసైనా పేల్తాయా? అబ్బే! ఎంతసేపు నుంచున్నా—కిందటి నెల పాస్‌చేసిన సప్లిమెంటరీ బిల్ మామ్మూలింకా అందలేదని అఘోరించే 'సి' సెక్షన్ క్లార్కూ—అమ్ముకున్న సిమెంటు పర్మిట్లలో తన వాటాకేమీ పెద్దగా మిగల్లేదని ఏడ్చే రెవిన్యూ యిన్‌స్పెక్టరూ—థెంత్‌క్లాసు వెధవలు తన దగ్గరికి రాకుండా ఏడవకు—ఉన్నదాంతో తృప్తిపడూ అంటారా పెద్దలు? నేనిప్పుడు పెద్దల్లో కలిసిపోయానా అని దాకలా నోరు తెరిచేసి ఆశ్చర్యపడిపోకు. మూడు ముళ్ళూ పడితే నువ్వూ అంతే! మనకి వేడెక్కడంలేదని మనం గోలపెడుతుంటే—అది చల్లారే దారి దొరక్క విశాఖపట్నం పురుగులు ఏడుస్తున్నాయట. మా కజిను తడిసిపోయిన ఉత్తరాన్నే సింబాలిక్‌గా పోస్టు చేశాడు. పిండితే నాగావళికి వరదలొస్తాయేమోనని మానీసేను. అందువల్ల-వాడెవడో ముళ్ళపూడి రమణ



రామారావు దగ్గరికి దాటేస్తున్నారని కుళ్ళే ధర్మారావూ—యీ మగ కంపే కదా!" అని సెలవిచ్చినవాడయినాడు — ఆరోసారిగా ఆరిపోయి అల్లరి పెడుతున్న అప్పు సగరెట్ని పారేస్తూ—రమణమూర్తి.

"ఒరే మావా! మనమ్మ మనమ్మేనా! అందుకేమైనా అభ్యంతరమా? లేదు కదా! అలానే మన శ్రీకాకుళం కూడా! ఒప్పుకుంటావా? లేదని

చెప్పినట్టు మనూరు చుట్టూ గోడలు కట్టించీ సైనా సరే—యింతకంటె పెరక్కుండా చూసుకోవాలి. అలా పెరక్కుండా చూస్తా నన్నవాడికే ఓ జెయ్యాలి. లేకపోతే రేప్పొద్దున్న మన గుంటలు మన్ని తిడతారు. అదలాగుంచు గాని—నీకు పెళ్ళిపెటాకులు లేవు. ఇప్పట్లో అయే శకునాలూ కనిపించడంలేదు గాని నాకు పెళ్ళయింది. మా ఆవిడ చాలా పతివ్రత గాబట్టి వేళపట్టున గూడు చేరుకోవడం అవసరం. అందుకని—ఒరే మావా—మనం బయలు దేరుదాం. తెల్లారాక యిద్దరికీ తొందర తొందర మింగుళ్ళూ—బస్సు ప్రయాణాలూ— పైథాగరస్ సిద్ధాంతాలూ—పెద్ద మేష్టరితో యింక్రిమెంట్ల తగువులూ—వాడి బనీనుమీద ప్రబంధాలూ ఉండనే వున్నాయి. మనవీ మరీ అడుగు అందని బతుకులు కానందుకు సంతోషిస్తూ—కావాలంటే ఓ పెగ్గు కాఫీవే సుమా—మా ఆవిడ యింటిదగ్గరే ఉంది, పోలీసు కుక్కలకి పాఠాలు చెప్తుంది—పట్టించేసి పోదాం. మరి నడు" అంటూ కదిలాడు వైకుంఠరావు.

"మేష్టర్లు" అని నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు కామరాజు.


"ఈ ఊర్ని విశాపట్నం సెయ్యడం మన తరం గాదుగదా! మన మనవడి తరం కూడా కాదు. కాని మనం దీన్ని పార్వతీపురమన్నా సెయ్యలేకపోతే సిగ్గు సిగ్గు. ఇంత పోలీసు బతుకూ బతికి నాలు క్కంపెనీలైనా లేనూళ్ళో పంజేయడమా? జాతోడెవడైనా యింటే నోట్లో గడ్డెడతాడు. దానికి బదులు రిజైనిచ్చేసి—ఒక సారాకొట్టూ—రెండు కంపెనీలూ పెట్టుకోవడం మర్యాద. జనాలు హర్షిస్తారు. మరైతే మదుపు గావాల. పోలీసోడిది పూట బత్తెం, షల్ల ఎలుగూ అని ఎనకటి కో పార్టీ శాపమెట్టేసినాడంట! మనం ఎనకేసిందంటూ ఏటీ లేదు' మరెవడిస్తాడు? ఇక్కడి కాలేజీ గుంటలూ—కుర్రోళ్ళ సంఘాలూ—అంతా సవటల్లాగే ఉన్నారు. ఆంధ్రరాష్ట్రానికీ అగ్గికీ బుగ్గికీ సమ్మెలు చేస్తారుగాని—మా ఊరికో కాబరే హోటలూ, రెండు బార్లూ, ఓ అరడజను కంపెనీలూ కావాలని చెయ్యరేం? మేమూ ఓ దెబ్బ కాతుమే! అబ! దేశాని కేటిగావాలో ఎవ్వడికీ తెలీదు. బాగుపడూ అంటే యేటి బాగుపడతాది? కొడుకు కొజ్జా ఎదవయ్యాక—మనవల్ని కనూ కనూ అంటే కోడలుగుంటేటి కంటాది? అంతగా మనవలుగావ్ గావాలంటే అత్తముండే దారి సూపాలగాని. ఏటో!....పైమవతంది. రాత్రల్లా కునుకన్నది లేకుండా కాసుకు తిరిగినా కొండబ్బులు దొరికిసావవీ వూళ్ళో! దరిద్రగొట్టెదవూరు! ఎంతసేపూ లైటులేని రిక్షావోళ్ళూ, ఎమ్జీకుర్యాగాళ్ళూ దొరుకుతారు. ఆళ్ళకాదేటని తడువుకుంటాం— ఎన్నాళ్లు తడువుకుంటాం? తీరా జేసిగాని అళ్ళు మన కాళ్ళమీద పడితే—ఆళ్ళకి తిరిగి మనమిచ్చుకోవాల. అయినా తలుపులు తిన్నమ్మికి అప్పడాలే టాగుతాయి? ....పక్కింటి పిన్నిగారమ్మాయి మొన్నట్నుంచీ మా చెడ్డదిగా చూస్తంది. ఇంటిది పురుట్నుంచొచ్చేలోగే ఓ పట్టు పట్టీయాల. అంటె జాకెట్టు గుడ్డతోనో, పవుడ్రుడబ్బాతోనో ముందుగా ప్రేమ మొదలెట్టాలి. అంటే యీ రాత్రికి నాల్రూపాయల్దబ్బులు సేసుకోవాల! సూద్దాం. దేవుడే టంటాడో! అడి వాటా నైవేద్యం ఆడికి పారేస్తాంగదా! సాయం చెయ్యడా?"

"వారానికో దొమ్మి, నెలకో మర్డరూ పేలని యిదీ టౌనే నంటావేటి కామరాజూ!" అనడిగారు హెడ్డు వెంకట్రావుగారు—మాదిల్పసుందుగా వస్తున్న కామరాజుని.

"నా మనసులోని మాట మీరెలా పట్టేసేరు సార్! ఏటో అనుకున్నానుగాని—మీరూ పేగులు లెక్కపెట్టీగలరు సార్! మనది ఎనకబడిన జిల్లా అని పెద్దలేటి ఉట్టినే అన్నారా సార్! చెప్పుకుంటే కృష్ణా గోదావరుల్ని చెప్పుకోవాలిసార్! అసలా నీటిలోనే ఉందట సార్ పౌరుషం! అలవాటు పోకుండా దొమ్మీలూ—ఆనవాయితీ తప్పిపోకుండా కూనీలు—ఆహా!—ఏం అందమైన బతుకు సార్! పుడితే అక్కడి పోలీసోడై పుట్టాల. ఆ ఏడు తరాలవాళ్ళూ యీ ఏడు తరాలవాళ్ళూ

రచయిత గురించి

పుట్టింది 1946లో-శ్రీగోవిందు రామమూర్తి, శ్రీమతి సీతమ్మగార్ల తొలిచూలు బిడ్డగా-శ్రీకాకులం జిల్లా దూసి గ్రామంలో. ఉద్యోగిస్తున్నది లెక్కలు మాష్టారిగా, శ్రీమతి రాజ్యలక్ష్మికి భర్తగా, అరవింద్, మధురిమ, కమలాకర్‌లకు తండ్రిగా-రాజాం తాలూకా లింగాలవలస గ్రామంలో.



లెక్కలు చెప్పడం పుస్తకాలు చదవడం కబుర్లు పోగేసుకోవడం వ్యసనాలు. ఇద్దరు కృష్ణశ్శాస్త్రిలన్నా పిచ్చి.

తొలి రచన "ప్రేమ-ద్వేషం" ఈ జ్యోతి ద్వారానే 1967లో వెలుగు చూసింది. ఇంతకు ముందొక్కసారంటే ఒక్కసారి మాత్రమే ఆంధ్రజ్యోతి దీపావళి కథల పోటీల్లో నా "ఆకలి"కి కన్సొలేషన్ బహుమతి లభించింది.

ఈకథకి ప్రత్యేక బహుమతి యిచ్చినందుకు జ్యోతి వారికి కృతజ్ఞుడ్ని. ఇది పాఠకుల మన్నన పొందాలని ఆకాంక్షిస్తున్నవాడ్ని.

తరిస్తారు. ఆ కొట్లాట్లేటి, ఆ కూనీలేటి, ఆ బ్రాందీ బుడ్లేటి, ఆ కోడి మాంసాలేటి, ఆ కొవ్వెక్కిన లంజలేటి? మొహం మొత్తియాల. సీ ఎదవబతుకు! నూతిలోని కప్పా బతకతంది! వంటింట్ల ఆడదీ బతకతంది. ఈ అడివిల మనమూ బతుకుతున్నాం. అంతే."

"సూడండోయ్! ఏటి సెప్పినా మన కామరాజ్ సెప్పాలని నే నుట్టినే అంటుంటానేటి? పార్లమెంటు కెళ్ళాల్సినోడు— పొరపాట్న చిన్న ఫిరాయింపై పోయి — పోలీసోడయి పోనాడు."

"ఒద్దుసార్! అంత పెద్ద పరుగులు ఒద్దు! అయినా మనలో సత్తువుండాలిగాని ఎంద లుంటేటి?"

"అంతేన్లే! మన గురుడిలాటోడు ఎంద లున్నా ఒకటే! అయినా నాకు తెలకడుగు తాను—పోలీసోడికి రూలేటయ్యా? పెద్దలు సూపిన రాదారి నొగ్గేసి రూలు రూలంటే ఎలా సావడం? అలాగని కిందామీదా సూడకుండా ఒకటే దున్నుడయితే పెమాదమే! అందుకు మన అగ్నాతవాసమే సాక్షి! ఏటంటావు కామరాజూ! అయినా ఎద్దు ఒత్తిగిల్లదేటి? కసింత ఓర్చుకోవాల."

"అది పెగ్నకాదు సార్! మొగోడితనం అసలే కాదు."

"కామరాజూ!"

"మీరు కదలకూడదు సార్! మీరు కదిలితే—ఈశ్వరుడు కదిలినట్టే. మీరలా ఓ చిర్నవ్వు పారేసి కూకోండి. కడంది నాకొదిలేండి. మూర్తం వేళకి సరిగ్గారండి."

"ఎన్నాళ్ళకి ఫారెనిస్కీలా కిక్కిచ్చే మాటిన్నానయ్యా కామరాజూ. మాటంటే అదీ! అభయమిచ్చాను. కాని కళ్ళాలొదిలీకు."

"గుర్రం మచ్చికవాలేగాని— అవుండాలేటి సార్?"

ఓరి దున్నపోతు గాడిద కొడకా! గుర్రంలాటి గుంటని నాక్కుండా ఎగరేసుకు దొబ్బేద్దామనేనేటిరా యీ ప్లాను? నా మీదికి పోటీకొచ్చి బతికుందామనేనేట్రయ్యా ఈ దౌర్జన్యం? కాసుకో నా దెబ్బ!"

ర ర ర

కామరాజుని పంతులు సాదరంగా ఆహ్వానించాడు.

"పంతులూ! ఈ లాడ్జి పేరేటి?" గుమ్మములో నిల్చునే అడిగాడు కామరాజు.

"పేరా సార్! సీతారామా! ఏం సార్?" అర్థం గాకలా వుంది అడిగాడు పంతులు. తాటికాయలంత అక్షరాల్తో వున్న బోర్డు వీడి కళ్ళ కానలేదా? లేకపోతే వీడికి చదువు రాదా అని కూడా అనుకున్నాడు. అయినా అడిగింది పోలీసోడు గనుక సమాధానం చెప్పాడు. అలాగని పోలీసోళ్ళకి కళ్ళుండవనిగాని-వాళ్ళకి బోర్డులు చదివేపాటి చదువూ రాదని కాని పంతులు అభిప్రాయమా అని మీరు నన్ను నిలదీయకండి. ఆ వైనం నాకు సరిగ్గా తెలీదు.

"పేరు మా సెడ్డ బాగుంది పంతులూ! సీతా—రామ. ఒకరు పతివ్రత అయితే రెండోవాళ్ళు పెళ్ళాన్ని తప్పించి మరో ఆడదానికేసి సూడనివాడు. మా బేషుగ్గా వుందిగాని పంతులూ—అయితేటి మనది సీతల లాడ్జింగా? రాముళ్ళ లాడ్జింగా?"

"ఏం సార్?"

"అడిగింది ప్రశ్నయ్యా పంతులూ!" టెక్కుగా అన్నాడు.

"ఔను సార్! ఏమయింది సార్?" పంతులికి గాభరా అందుకుంది.

"ఇప్పటికేటీ కాలేదుగాని — నాకంటే ముందల యిందల దూరినారే—ఆళ్ళెవరయ్యా పంతులూ?''

"పార్వతీపురం సార్! భార్యా భర్తలు, ఏం సార్?" కంగారుడోసు పెరిగింది పంతులికి. నైట్ డ్యూటీకి ఎందుకొచ్చానా అన్నంత వరకూ అది హెచ్చింది.

"పార్వతీపురమా? భార్యా భర్తలా? రైట్! మరి మొగోడు పేర్రాసినాడా?"

"ఆఁ రాసుండాలి సార్! సార్ మాది పరువైన లాడ్జింగు సార్! పెరటి తోవలకి మా ప్రొప్రయిటరొప్పుకోడు సార్!"

"సూడు పంతులూ! ప్రొప్రయిటర్ల సంగతీ పోలీసోళ్ళ సంగతీ నాకు సెప్పకు. ముందు ఆ మొగోడి పేరేటో అది చూసి సెప్పు."

"ఇదుగో సార్! రూం నంబరు 4 సార్! ఆ పేరు అప్పల్నాయుడు సార్! మధ్యాహ్నం ఒంటి గంటకి వచ్చారు సార్! ఏం సార్? వాళ్ళేమైనా......" కంగారూ, భయమూ జోడింపుగా నసిగాడు పంతులు.

"అయితొక్కపాలి పదమా! ఆళ్ళని సూడాల...." కదిలాడు కామరాజు.

కామరాజు వెనకబడి—"వాళ్లు మర్యాదస్తుల్లాగే వున్నారుసార్" అన్నాడు పంతులు-కాదు—అనేసేడు పంతులు— ఈ మాట అనొచ్చో అనకూడదో అని జడుస్తూనే—"మర్యాదస్తుల్లాగా కనిపిస్తాన్నరను పంతులూ! సరిపోద్ది. అలా కన్పించినంత మాత్రాన ఆడు మర్యాదస్తుడే ననేస్తే ఎలాగయ్యా పిచ్చిబేమ్మడా? నీక్కనిపించిందానికీ నిజానికీ మధ్య బోల్డంత వారా వుంటాది. అది పోలీసోడ్ని నాకెరిక. ఎవుడు మర్యాదస్తుడో నేను చెప్పలేనుగని—పంతులూ—ఎవుడు కాదో చూసీ చూడగానే నేను పోల్చగలను. మా కళ్ళకి ఆళ్లు సరిగ్గా ఆనతారు. మా కళ్ళు తప్పలేరు పంతులూ? అసలిది గుర్తుంచుకోవయ్యా! అనుమానం ముందల పుట్టి—ఆ ఎనక పోలీసోడు పుడతాడు."

మెట్టుకి మెట్టు ఎక్కుతూ—మధ్య మధ్య ఎఫెక్టు కోసం ఆగి వెనక్కి తిరుగుతూ—పోలీసుల జన్మరహస్యాన్ని సందేశించాడు కామరాజు.

"నిజవేగాని సార్...."

"పంతులూ! సీతా, రాముడూ పుట్టిన దేశమయ్యా మంది! అలాటిలాటిదీ — అల్లాటప్పాదీ గాదు." మెట్టెక్కుతూ వెనక్కి తిరిగి చూడకుండా అన్నాడు.

"ఎంత మాటసార్! పంతులికి నేర్పాలా!"

"ఈ దేశంలో ఆడోళ్ళు సీతల్లాగా— మొగోళ్లు రాముళ్ళాగా వుండాలనే పెద్దలు రామాయణం రాసేరు పంతులూ!"

ఈ గాడిదకొడుకు రామాయణం గురించీ అది రాయడంలోగల పరమార్థం గురించీ పురాణం చెప్పేవాడిలా మాటాడుతున్నాడేమిటా అనిపించింది పంతులికి. అసలా ప్రస్తావన యిప్పుడెందుకూ అని కూడా అనిపించింది.

అయినా "నిజవే సార్!" అన్నాడు— రామాయణం అర్థం తనకీ అవగతం అయిపోయినట్టు.

"ఈ దేశంలో ఆడది తల్లి పంతులూ! చెల్లి పంతులూ! లూకాయి లూకాయిది గాదు" మేడెక్కడం పూర్తయాక— వెనక్కి తిరిగి చూస్తూ అన్నాడు.

"ఔన్సార్" అని అన్నాడు—చివరి మెట్టు మీంచి పంతులు.

ఆగి—నుంచొని — నెమ్మదిగా — గంభీరంగా—"అలాటాడది యివాలేటి సేస్తంది పంతులూ?" అన్నాడు.

"కరక్టే సార్."

"ఏటి కరెక్టయ్యా పిచ్చి బేమ్మడా! నా కొచ్చినేటి? నీ జవాబేటి? అలాటాడది యివాలేటి సేస్తంది? తన ఒళ్ళమ్ముకుంటుంది. మన పరువూ అమ్మేస్తంది. ఔనా?"

ఈ ఒళ్ళమ్ముకోడం అన్నది యివాళ ప్రారంభం అయిందా? లేక రాముడి నాటినుంచీ వుందా? అనడగాలనిపించింది పంతులుకి. ఐనా పోలీసోడితో రామాయణ చర్చెందుకు అనిపించింది. రామాయణ కాలంలో ఏం వున్నాయో ఏం లేవో మనకేం తెలుసు? అయినా మనకెందుకవి? మనకాలం ఎలాగేడుస్తోందో అది చూసుకోక అని తనకు తను సమాధానం చెప్పుకున్నాడు. రామాయణ కాలంలా యివాల్టి ప్రపంచం ఉండదు. ఇవాల్టి దృష్టితో అప్పటి పరిస్థితుల్ని చూడకూడదు అని కూడా అనుకున్నాడు.

ఇలా పంతులు అనుకోవడాలూ—సమాధానం చెప్పుకోవడాలూ కొనసాగిస్తుండగా—

నాలుగడుగులు నడిచి 4 వ నెంబరు రూమ్ చేరి పంతులుకేసి చూసి—ఫర్వాలేదు అన్నట్టుగా నవ్వేసి తలుపు మీద చెయ్యివేసి—

"పంతులు! ఆడిస్తాను అలా నించో! నీ బుద్ధి మంచిదయితే నీకుగాని, మీ లాడ్జికిగాని ఏటీగాదు. నేనుపూచీ. పెళ్ళయిందా?" అన్నాడు కామరాజు!

"నాకా సార్! లేదుసారింకా. ఏం సార్!"

"అప్పలనాయుడు బాబూ! తలుపు తియ్యిమీ!"

"అసలేమయింది సార్?"

"కసింత బేగి తియ్యవయ్యా బాబూ! సిన్నపనున్నాది."

"ఎవరు మీరు?"

"ఎడ్రసు గావాలా అప్పలనాయుడుబాబూ! సరే రాసుకో! పోలీసోడ్ని. సాలా? పేరు కామరాజు. సరిపోద్దా? నీదేగాని పార్వతీపురం అయ్యింటె యీ యివరాలు సాలు ఏటి?"

"మాష్టారూ! తలుపు తియ్యండి."

"తీసెయ్యండి! మీరు తీస్తారా? నేను తియ్యనా?" లోపల్నుంచి ఆడగొంతు సన్నగా.

"పంతులూ! ఇన్నావా?" అమందానందంగా అన్నాడు కామరాజు.

అది విన్నిగారమ్మాయి గొంతు మాత్రం కాదు. దాంది బండగొంతు. నూటలూ యాసగా వుంటాయి. అంతేగాకుండా — తన పేరు విన్నాక గూడా తలుపు తియ్యమందంటే అసలేగాదు.

మరెవరు?

"ఒచ్చింది మన చుట్టపోడు గాడు. పోలీసోడు. ప్రెమాదాం" మరీ మెల్లగా మగగొంతు.

"అది మాత్రం నిజం నాయుడుబాబూ! ఆలీసెమవుతున్నకొద్దీ ప్రెమాదం రేటూ ఎక్కువై పోతుంటాదిగాని బేగి తలుపులు తీసీ."

"తీసెయ్యండీ!" పకడ్బందీగా ఆడగొంతు.

"పీక పోతుంది తెల్సా?"

"పోతే పోనివ్వండి.... మీరు, తియ్యరన్న మాటేనా? అయితే అడ్డు లేవండి. నేను తీస్తాను."



"నా మాట వినవేమీ?"

"వినకపోయుంటేనే బాగుండేది. వినీ— నమ్మి యింతకు తెచ్చుకున్నాను. లెండి. నన్నొదలండి."

"సూడూ! నన్ను రక్షించవూ!"

"నా కాళ్ళు పట్టుకోకండి. నాకసహ్యం. వదలండి."

"ఆడకూతురు తీసేమంటుంది గదయ్యా! మరి సూస్తావేటింకా?" నిబ్బరంగా అన్నాడు కామరాజు.

అతని మనస్సు యిప్పుడు పూర్తిగా కుదుట బడింది. ఆ అమ్మాయి యెవరైతేనేం, పిన్నిగారమ్మాయి మాత్రం కానేకాదు. అంత వరకూ నమ్మకం. అయితే వ్యవహారం చూస్తుంటే భార్యాభర్త కూడా కానట్టుంది. కొంచెం కష్టపడితే జులుం చూపిస్తే ఏమైనా రాలడం తథ్యం. కాకపోతే ఓ వూపు ఊపాల! అదో పెద్ద విద్యగాదు. పుట్టుకతో వచ్చిందే. లేచిన వేళ బాగుంది అనుకున్నాడు.

"మరి నువ్వు తలుపు తియ్యావన్నమాటే నేటయితే?" వృత్తి సహజమైన గాంభీర్యత తోనూ సహజంగానే రేగిన కొంచెం కోపం తోనూ గట్టిగా అరిచాడు కామరాజు.

"చూడండి. మీరెంత బతిమాలుకున్నా కావాల్సిన అల్లరి ఎలాగూ కాకమానదు— తలుపు తీసెయ్యండి."

"అదీమాట. లేకపోతే తలుపు బద్దలు గొట్టించాల్సి వుంటుందంతే."

"సార్ సార్! అప్పలనాయుడుగారూ, కొత్త తలుపులు. మీపుణ్యముంటుంది. తలుపు తియ్యండి బాబూ! ఇప్పటికే ప్రొప్రయిటర్ చేత బండెడు చీవాట్లు తినాల్సి వుంటుంది. కర్మ."

అప్పలనాయుడు అతి నెమ్మదిగా తలుపులు అర తెరచి-డెస్డిమోనాని చంపేసాక ఒథెల్లో పోజులో కాకపోయినా దిగాలుగా దివాలాగా నుంచున్నాడు.

ఒక్క చూపుతో సిట్యుయేషన్ని సర్వే చేశాడు కామరాజు.

నిఖార్సయిన దోషిలా అప్పలనాయుడూ—

నిజమైన రిలీఫ్‌తో మెరిసే కళ్ళలో రేగే తడితో ఆ అమ్మాయి—

కామరాజుకేసి—కామరాజు యూనిఫారం కేసి చూస్తూ.

"ఇప్పుడు సెప్పు తమ్ముడూ! ఏ వూరు మంది?" రెండో చూపుతో అతడ్ని తినేస్తూ అడిగాడు.

"జమానుగారూ! మరేటంటే...."

"నీ పేరు అప్పల్నాయుడు గాదు. నీది పార్వతీపురమూగాదు. ఆ అమ్మాయి నీ భార్యా కాదు. నిజాన్ని రానీ. నాకిదే పనికాదు. నాకు అబద్ధమంటే మాసెడ్డొళ్ళ మంట. రానీ బేగీ."

"అదిగాద్సార్ జమానుగారూ...."

"నాన్పుడు బేరం మరొద్దన్నాను. తమ్ముడూ నాలుగు ముక్కల్లో సెప్పాలంటే సెప్పూ. లేదూ స్టేషన్కి నడు. అక్కడ మా ఎడ్డు నీ తాతలాటోడి సేతైనా నిజం సెప్పిస్తాడు. ఆడి దెబ్బ పడితేగాని నీ నోరు పెగిలేట్టు లేదు. పద పద. పోలీసోడిది ఎదవబతుకైపోనాది. ఒక్క నాయాల మర్యాదగా నిజం సెప్పడు గదా!"

"మాది కొత్తూరు సార్! నేనక్కడ హై స్కూల్లో టీచర్ని." చాలా గాభరాగా వురి తీస్తారేమో లేకపోతే అన్నంత తొందరగా— ఆ రెండు ముక్కలూ జార్చేసేడు.

"ఏటీ?" నిజంగా దెబ్బతిన్నట్టు అడిగాడు కామరాజు.

మేష్టరన్నవాడు అంతపని చేస్తాడనో— చెయ్యడానికి సాహసిస్తాడనో అతనూహించ లేక పోయాడులా వుంది పాపం.

"అసలు...."

"ముయ్ నోరు. శివ శివ. తెల్లారి లెగిసి ఎంత పాపపు మాట విన్నానయ్యా పంతులూ! నా కొడకా! నేను టీచర్ని అని ఎంత సులాగ్గా సెప్పేసినావు? సిగ్గూ శరమూ లేవేం? సూడు! నిన్ను మాత్రం ఒగ్గేదిలేదు. మేష్టర్లూ! మీరూ లాడ్జీలు పడతన్నారా? పంతులూ మరీ దేశం బాగుపడదుగాక పడదయ్యా! కావాలంటే నోటుముద్రమీద రాసిస్తాను. ఏయ్ నాయుడూ! అప్పలనాయుడివో, అత్తలనాయుడివో గాని మరి నువ్వేటి సెప్పినా నేను యినిపించుకోను గాక యినిపించుకోను. పద. ఊఁ పదా...."

అప్పుడు అప్పలనాయుడు—

మేష్టారు గాకపోతే పీడాపోయె!

కనీసం మనిషి కూడా కాదు.

అంతగా దిగజారిపోయి-పాతాళానికి కృంగి పోయి—

"సార్!" అని దీనాతిదీనంగా హీనాతి హీనంగా—నీచాతి నీచంగా—వేడుకోబోగా

"నేను యిననయ్యా! ఇ-ను-కో-ను అంతే" అని మాటోరుగా కదిలాడు కామరాజు.

"అదిగాద్సార్! సార్....సార్ ఇలాటి దెప్పుడూ అలవాటు లేదుసార్....ఇదే.... ఇదే మొదటిసారి....అందుకనిగాని...."

"అంటే....అంటే ఏటామాట? అహాఁ ఏటామాట కర్థమూ అని?" సర్రున లేచాడు.

"అహఁ.... అది కాదు సార్....ఈ అమ్మాయే సార్....ఈ అమ్మాయీ....మా అమ్మాయే సార్....అంటే.... అంటే మా వాళ్ళమ్మాయే సార్ .... మావాళ్ళమ్మాయే అంటే మా స్కూల్లో.... చదువుతున్న.... అమ్మాయేసార్! ఏదో.... సరదాగా....సినీమా కని...."

"మేస్టార్రి నంగిరోడకు! నాకసలే మాచెడ్డ ఒళ్ళు మంటగున్నాది. మీ స్కూల్లో చదువు తున్న ఆడిపిల్లని మాయమాటలుచెప్పి లాడ్జింగుకి తెచ్చింది చాలక....ఏటి నీ ధైర్యం! అసలు ఏటి నీ ధైర్యమూ అని."

వెనకాల వున్న పంతులు అప్పలనాయుడి వీపుమీద గోకాడు.

ఏమిటన్నట్టు వెనక్కి చూసాడు అప్పల నాయుడు.

"చెయ్యి తడుపు .... చెయ్యి తడుపు" అన్నట్టు సర్వావయవాభినయం పట్టేస్తున్నాడు పంతులు.

"ఎంత?" అని సన్న చేసాడు నాయుడు.

"ఈ మాత్రం తెలీదూ కర్మ" అన్నట్టుగా తన నుదుటిమీద కొట్టుకున్నాడు పంతులు. వాటి రేట్ల వివరాలు ఏనాడో గెజిట్ పబ్లికేషను కూడా అయిపోయాయి గదా, ఇంకా నీవరకూ రాలేదా? అన్నట్టుగా ఈసడింపుగా చూసాడు కూడా.

ఆ తర్వాత— "ఎంతో కొంత యిచ్చేసి

ఒదిలించుకో! లేకపోతే చస్తావు" అన్నట్టుగా అభినయించాడు పంతులు. "పద పద" అన్నట్టుగానే "వేగం కానీవయ్యా దేవుడా" అన్నట్టుగానే అప్పలనాయుణ్ణి ముందుకు తోసాడు.

ఈ తతంగాన్నంతా ఓ అరగంట గమనిస్తున్న కామరాజు మరింత బిగుసుకుపోయి—

"ఏటి?" అని హూంకరించాడు.

"పాతిక సార్" అని ఠకీమని అనేసి—గబ గబా జేబులు తడిమేస్తున్నా డప్పలనాయుడు.

"పంతులూ ఓపాలి వక్కకు లెగుమీ" అని పంతుల్ని ఒక్క వుదటున పక్కకి లాగేసి—

"ఏటయ్యా ఏటన్నావు? పాతికా: ఏటయ్యా పాతిక? అసలు పోలీసోడంటే ఏటనుకుంటన్నావేటి? అడ్డులే పంతులూ" అని దాదాపు కొట్టడానికెళ్ళినట్టే మీదికి వెళ్ళాడు.

అంత నిలువుశాల్తీ — మాష్టారప్పలనాయుడూ నిలువునా గజగజలాడిపోవడం గమనించిన పంతులికీ సముద్రాన్ని ముంచేంత నవ్వొచ్చిందిగాని రసాభాస అయిపోతుందేమోనని కాబోలు భయపడి పెదాల్ని బిగించేసుకుని నవ్వుని బంధించేసుకొని—పొట్ట గట్టిగా పట్టుకొని అప్పలనాయుడు మాష్టార్ని నీడ చేసిన చీకట్లోకి ఈడ్చుకుపోయాడు.

కామరాజు ఆ అమ్మాయిని మాటల్లో పెట్టేడు శాంతించినట్లుగా.

"నీకు బుద్ధీ సుద్ధి వుందటయ్యా నాయుడూ! చేసిన వెధవ పనికి సిగ్గుపడి గుట్టు చప్పుడు కాకుండా గప్‌చిప్‌గా పనయ్యే దారి చూసుకోవాలిగాని—ఇలాగేనా? ఇచ్చేది లంచంగదా! కాస్త చాటూ మాటూ వుండొద్దూ. చాలా బాగుందండీ! ఇదేం వేలంపాటా— పబ్లిగ్గా తెలీడానికి? మీ పరిషత్తు గుమస్తాలకి యిలాగే లంచాలిస్తున్నారేమిటి మీరు?" అని కాస్త కసురుకున్నాడు పంతులు.

"ఓసేటయిపోయిందండీ! అదేటోగాని— మా గుమాస్తాలకాడ మాత్రం సాటూ మాటూ లేవు సుమండీ! సచ్చిపోమూ! అయినా పోలీసోడేగదా—పెద్ద ఆఫీసరా ఏటన్నానా?" అని ఆఫీసరుకైతేనే కాస్త రహస్యంగా యివ్వాలిగాని తతిమ్మా అమాంబాపతు జనాల కెలాగిచ్చినా ఫర్వాలేదనే ఫక్కీలో అన్న అప్పలనాయుడికేసి సీరియస్‌గా చూసి—వీడో పనికిమాలిన వెధవన్నర వెధవ అని నిర్ధారణకొచ్చేసి—

"చాలు చాల్లేవయ్యా! మాంసం తింటున్నామని ఎముకలు మెళ్ళో వేసుకు తిరగవేం? కామరాజు అంటే నీకింకా తెలియదులాగుంది. చచ్చిన శవం దగ్గర్నుంచయినా తనకి రావల్సింది వసూలు చేసుకోగల గండలమిండడు. పాతికలకి, ఏభైలకి పడ్డు" అని కామరాజు విలువని వివరించాడు పంతులు.

"బాబ్బాబూ! బుద్ధి గడ్డితింది. ఈ గుంట మా వూళ్ళోనైతే లొంగడం లేదని—పెళ్ళి చేసుకుంటానని చెప్పి తీసుకొచ్చినందుకు— నాకైంది పెళ్ళి. ఏభై లో సర్దుబాటు చేద్దురూ. పంతులుగారూ! సచ్చి మీ కడుపున పుడతాను" అని చేతులు పట్టేసుకున్నాడు.

"నీలాటి వెధవ నా కడుపున పుడితే ఇల్లల్లా కూడే" అని కాబోలు అనుకొని—

"లొంగి రాడయ్యా! అయినా మానవ ప్రయత్నం చేద్దాం" అని పంతులు మానవుడు కదిలాడు.

పంతులు పోకడల్ని ఓ కంట కనిపెడ్తున్న కామరాజు—

"ఏటయ్యా పంతులూ ఆ మంతనాలు? మేష్టర్నాకొడుకు స్కూలు పిల్లని మాయమాటలు సెప్పి తీసుకొచ్చి రేపు సేసీబోతాడూ? ఏటి పోలీసోళ్ళేటి గాజులు తొడిగించు కూర్చున్నారనుకుంటున్నావేటి? నిమిషంల ఉద్యోగం పీకించి పారేస్తాను. నా సంగతి తెల్డుకాబోలింకా! సమ్మిట్ మీటింగులు సాలుగాని బేగి రండి. హైమవతంది" అని గట్టిగా అరచి—

నెమ్మదిగా "ఈ తలమీదెన్ని ఎంద్రుకలున్నాయో అన్ని కేసు లిలాటివి సూసినాను తల్లీ! మొగోడ్ని మాత్రం నమ్మకూడదు.

ఉండు. ఆళ్ళను లాక్కొస్తాను" అని ఆ అమ్మాయికి చెప్పి—పంతులువేపు కదిలాడు.

పక్కనున్న గోడకి కూడా వినిపించనంత నెమ్మదిగా — "ఏటంతన్నాడు?!...." అనడిగాడు.

"ఏభైలో సర్దమంటున్నాడు" అంతకంటె మెల్లగా పంతులన్నాడు.

"ఇదా నీ సాయం? కాయితమైనా లేకపోతే సాలొద్దా! అసలే మా హెడ్డుబాబు బకాసురుడు గదా? ఆవురావురనున్నాడు. ఆడికేటిస్తాను? మిగిలిన తొత్తుకొడుకుల కేటి పంచుతాను? నేనేటి తింటాను? కక్కూర్తి పడతన్నామంటే యెందుకు? ఆలోచించు. సూడు పంతులూ! నీగ్గాని—మీ ప్రొప్రయిటరుకిగాని—పైసా తగలకుండా ఉండాలంటే—వందకి సెట్ చెయ్యి. లేదంటే—ఆ కొరదా మీరు కలపాల! నీ యిష్టం" అని సరళంగా ఆదేశించాడు.

"ఓ పట్టుపడతానుగానండీ—ఆ వెధవ వినుకునేట్టు లేదే! అసలే కక్కూర్తి నాకొడుకులాగున్నాడు."

"పంతులూ! నువ్వు నడు. నీ పని నువ్వు కానీ!" అని మెల్లగా అనేసి—ఆ వెనక—గట్టిగా, భీకరంగా—"పంతులూ! ఆ మేష్టర్నిలా లాక్కురమ్మంటే—దయగియ అంటావేటి? ఆడేటి నీ సుట్టపోడా? మద్దెన నీ ఇదేటి? సెయ్యి నేసుకోడం యిష్టంలేగ్గానీ—నా సంగతి నీకు తెల్దా? మర్యాదగొస్తాడో మరేటి సెస్తాడో అడుగు. అసలే సికాకుగుంది నాకు. నేను ఏ డెక్కిపోతే సచ్చూరుకోగల్దు" అని అరిచాడు.

ఈలోగా పంతులు—అప్పలనాయుడ్ని చేరుకొని-తనేం చెయ్యలేననే ఫోజులో—"లాభం లేదయ్యా! పాతికా, యాభయ్యీ అంటే వాడు వినిపించుకోవడం లేదు. సరిగదా—చూసావా నన్నే కసురుతున్నాడు....పద, పద. నీకు మఠ ప్రవేశం రాసిపెట్టుంటే నేనేం చెయ్యగల్ను?" అని భుజంమీద చెయ్యి వేశాడు.

"పంతులూ! ఇలాటి యవ్వారాలు నాకు కొత్తగనుకగాని....సరే—బాబ్బాబూ! ఎంతైతే ఒగ్గేస్తాడో సెప్పు. మరేటి సేస్తాం? ఏ జెన్మెల అచ్చున్నామో?"

"రెండువందలకి పైమాటైతే మాటాడమన్నాడయ్యా! లేదంటే నోర్మూసుకొని తనతో స్టేషన్కి రమ్మన్నాడు. మరి నీ ఇష్టం. ఉద్యోగస్తుడివి కూడానూ."

"అందుకేగదా! నాయన్నాయినా! అంతిచ్చుకోలేనుగాని—పంతులూ—నాకాడ వందున్నాయి. ఈ పాలికి సర్దుకోమను. కాదూ కూడదూ అంటే జీతాలందాక సర్దుబాటు చేస్తామని చెప్పు."

"ఇన్స్టాల్మెంట్లకి పోలీసోడు పడతాడటయ్యా? చూడూ! అమాయకుడిలాగున్నావ్—అందులో ఉద్యోగమోటి వెలగబెడుతున్నావు—యేం ప్రమాదమో యేం పాడో అని జాలిపడి మాట సాయం చేయబోయానుగాని - నేనేం బ్రోకర్నటయ్యా—మీ యిద్దరిమధ్యా గానుగెద్దులా తిరగడానికి ? మీరూ మీరూ యేం పడతారో పడండి. మధ్య నా కెందుకీ గొడవ? నేను పోయిపడుకుంటాను" అనేసి ముందుకు కదిలాడు.

కదిలిన పంతుల్ని భుజంపట్టుకు ఆపేసి—మాటాడకుండా జేబులోంచి డబ్బు తీసి—15 పదికాయితాలు లెక్కపెట్టేసి —తోసేస్తున్న పంతులి చేతుల్లో బలవంతాన పెట్టేసి—గుడ్ల నీరు నింపుకొని—"పంతులూ! ఇదిగో! ఈ పదీ మిగిలినాయి. ఇంటికెళ్ళాలి గదా? సాలొద్దా? ఎలాగో ఈ పాలికి సర్దీవా? లేకపోతే పీకెగిరిపోతాదిగదా? నీ మేలు జన్మ జన్మలకి మర్చిపోతానేటి? దయలేదా? ఇల్లు నిలబెట్టవా?" అని యేడిచేసాడు—వలవలా — అప్పలనాయుడు.

"సరే! నా తిప్పలు నేను పడతాను గాని—వెనక్కి తిరిగిచూడకుండా పారిపో! ఊఁ!" అని పంతులనేసరికి—అప్పలనాయుడు — కింది మెట్టుమీదున్నాడు.

కామరాజు తన దగ్గరికి వచ్చేలోపుగానే—కొన్ని కాయితాలు తన జేబులో దోపేసుకొని —కామరాజు రాగానే—మిగిలినవాటిని అతని జేబులో తోసేసి—"ఏడుస్తున్నాడు సార్! పాపం! పోనిద్దురూ! ఎక్కడికి!" అని దయ

చూపించాల్సిన అవసరాన్ని గుర్తు చేశాడు.

కామరాజు మరి మాటాడకుండా—ఆ అమ్మాయి దగ్గరకు వస్తూ—"హైకోర్టుకు పంపించి ఆరేళ్ళు చెప్పిద్దునుగాని—ఈ పాలికి ఒగ్గేసేను ఎదవని! ఏడుబ్బీతెదవ!" అనే జనాంతిక ప్రకటనోటి జారీ చేస్తూ—అది సంజాయిషీగా ఎవరూ భ్రమపడరాదని అనుకుంటూ—"అయితే యింతకీ నువ్వేటంటావూ?" అని ఆ అమ్మాయిని అడిగాడు.

"నేనేం చేయనండీ! ఈయనేమో—అరసవిల్లి కోవెల్లో పెళ్ళాడతానని చెప్పి తీసుకొచ్చేసారు. తీరా యిప్పుడు యింటికి వెళ్తే మా నాన్నగారు చంపేస్తారు. పోనీ తెగించి వెళ్దామన్నా—ఛార్జీకి డబ్బుల్లేవు. ఏం చేయమంమంటారు?'' అని అతడ్నే అడిగింది.

"ప్రతీ కుక్కలకొడుకూ డబ్బెట్టి పోలీసోడ్ని కొనీవచ్చు ననుకుంటాడు. కామరాజు సంగతి తెల్దింకా! ఎవుడో ఒక ఎదవ రూపాయ డబ్బులికి ఆశపడి లొంగిపోతే—ఓల్ మొత్తం పోలీసోళ్ళందరూ అంతేనా? ఎదవలేనా? మాకు మాత్రం సరదా యేటి? అందరూ జైళ్ళల కూకుంటె మాకు పండుగలాగుంటా దేటి? అయితేటి సెయ్యడం? మేం లాని కాపాడాల గదా? పోలీసోడి బతుకు కత్తిమీద సవ్వారీలాటిది. ఆడివతల లాని సూడాల. అవతల ప్రజల్ని సూడాల. ఎవళ్ని సూడకపోతే ఆళ్ళకే కోపం! నిర్దోషి శిక్షింపబడకూడదంటాది—లా. అలానే—దోషులూ బోరవిరుసుకు తిరగకూడదంటాది ప్రభుత్వం. ప్రతివోడూ తను తప్పించి మిగిలినోళ్ళందరూ దొంగలే నంటాడు. ఆళ్ళనెందుకు కొట్లతోసేవూ అనడుగుతారు? ఏటో! అంతా గందరగోళం—మాయాజాలం అన్నట్టుంది. ఇచిత్రమేటోగాని—మేం ఎంత జాగర్తగున్నా—యిటూ ప్రెజలూ నమ్మరు—కోర్టులూ నమ్మవు—నమ్మాల్సిందలూ నమ్మరు. దీనికేటి సెప్తాం? డూటీకి కట్టుబడినాక నీలాప నిందలు భరించాల మరి''అని ప్రకటనయొక్క తరువాయి పూర్తి చేసి—

"చూడమ్మా! ఇది పూరేగాని అడివి కాదు. మేం మనుషులమేగాని మృగాలం కాదు. ఈ రాత్రికి మా ఆడదానికి సాయంగా మా ఇంట్లో తొంగో. తెల్లారి లెగసి మీ ఊరు పంపించేస్తాను. పెద్దోడ్నో, చిన్నోడ్నో ఓ మాట సెప్తున్నా నినుకో—తల్లినీ తోడ్నీ ఒగ్గేసి ఇలా మరెప్పుడూ పారాకు. అయిపోయిందేదో అయిపోనాదిగాని—యికనైనా బుద్ధిమీదుండు. పద. నిన్నింటికాడ దింపేసి—నేను మళ్ళా డూటీకి రావాల'' అని ఆమెను తోడ్కొని వెళ్ళాడు.

⸙ ⸙ ⸙

'వసంతవిహార్' లాడ్జిలో గుర్రుపెట్టి పడుకున్న సింహాద్రినాయుడ్ని—రెండు కుదుపులతో లేపి—అతడ్ని ఆవలించుకోనిచ్చి—

"నాయుడుసార్! గైరమ్మ కంపెనీకి కొత్త పిట్ట వొచ్చి పడ్డాది. మా గనంగా ఉన్నాది గుంట. ఇప్పటికింకా యెవరూ మూసూడలేదేమో—పిటపిటలాడిపోతన్నాది. మీదే బోణీ. మరి లెగండి. అప్పుడే సగం రాత్రి ఐపోనాది? సూసినారా? కామరాజంటే ఏటో అర్థమైనాదా. మాటిచ్చిన్నాను—గంటల్లో మాట నిలబెట్టుకొన్నాను. మరి పదండి'' అని తోలుకు వెళ్ళిపోయాడు.

గౌరమ్మకి నాయుడ్ని అప్పజెప్పేసి "సార్! దయుంచాల. తెల్లారి కలుస్తాను" అని సెలవు తీసుకొన్నాడు.

బ్లాక్ స్పాట్

సత్యనారాయణమూర్తి



క్లాక్ టవర్‌లోని గడియారపు ముళ్లు కాల రాక్షసుడి యెగుడు దిగుడు చేతుల్లా వున్నాయ్.

టైం ఏడూనలభై ఐదయింది.

'సన్‌రైజ్ ఇంటర్నేషనల్' 'ఇన్' గేట్లోంచి సరోజ కారు చర్రున దూసుకొచ్చి పార్కింక్ ప్లేస్‌లో ఆగింది. కార్, లాక్ చేసి తాళాలు వేనిటీ బ్యాగ్‌లో పడేసుకుంటూ రిసెప్షన్‌లోకి నడిచింది సరోజ.

రూం నెంబర్—థౌజండ్ అండ్ ఫోర్—

ట్రింగ్.... ట్రింగ్....

తలుపు తెరుచుకుంది.

"వెల్‌కం.... వె ల్ క ం....! వె ల్ క ం! సరోజా!"

రమేష్ స్వాగతం సరోజని గిలిగింతలు పెట్టింది.

మృదువుగా, సుతారంగా ఆమె ఎడమ చేయి పట్టుకుని సోఫా దగ్గరికి నడిపించాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ .... జస్టే మి ని ట్" సరోజని సోఫాలో కూచోబెట్టి రమేష్ ఏంటి రూంలోకి వెళ్ళాడు.

సరోజ వేనిటీబ్యాగ్ తెరిచి, దాని మూతకి అమర్చి వున్న అద్దంలో, మొహం చూసుకుంటూ, కర్చీఫ్‌తో నొసటిమీది చిరుచెమట అద్దుకుంటోంది. ఆ రోజునే 'సెట్' చేయించుకున్న హెయిర్ స్టైయిల్ చెక్కు చెదరలేదని నిర్ధారణ కొచ్చింది.

'ట్రిం' చేయించుకున్న కనుబొమ్మలు బోర్లించిన నెలవంకల్లా వున్నాయని రూఢి చేసుకుంది.

చెంపల మీద 'చీక్ రెడ్' పల్చగా పులిమింది. బ్యాగ్ మూసేసి టీపాయ్‌మీద పెడుతూంటే ట్రే—ట్రేలో స్నాక్స్ — ఐస్ పెయిల్, గ్లాసులూ తెచ్చి టీపాయ్ మీద అమర్చాడు రమేష్.

మళ్ళీ లోపలికి వెళ్ళి బాటిల్స్‌తో తిరిగి వచ్చాడు. సరోజకు ఎదురుగా సోఫాలో కూర్చుని గ్లాసులు నింపాడు.

"కమాన్ సరోజా! లెట్స్ సెలెబ్రేట్" రమేష్ తన గ్లాసు చేతిలోకి తీసుకున్నాడు.

"థేంక్స్" సరోజ కూడా తన గ్లాసు........

"ఛీయర్స్" మూరెడు పొడుగున్న రెండు గ్లాసులు 'ఢీ'.

సరోజ బీరు తాగుతోంది.

రమేష్ విస్కీ....


సరోజ బీరులో నురుగూ, చేదూ వొగరూ వున్నాయి.

రమేష్ విస్కీలో పొగరూ....ఘాటూ....

"బ్యూటిఫుల్....చార్మింగ్....క్యూట్...." రమేష్ సరోజ అందచందాల్ని పొగిడాడు.

"మ్యాన్లీ....హేండ్‌సం....స్మార్టు" సరోజ రమేష్‌లోని ఆకర్షణను వర్ణించింది. గ్లాసులు ఖాళీ అయ్యాయ్.

రమేష్ తన సోఫాలోంచి డబుల్ సోఫాలోకి మారాడు....సరోజ కూడా ఆ సోఫాలోకి చేరింది.



నెక్స్ట్ రౌండ్....

ర ర ర

ఊరు చివర కొత్తగా బలిసిన కోలనీ వెన్ను మీద వేసిన రాచపుండులా వుంది. ఆ పుండుకు అందమైన బ్యాండేజి కట్టినట్లు అక్కడి ఇళ్ళన్నీ ఆధునికంగానూ, అదునాతనంగానూ వుంటంతో కాలనీమాత్రం బోల్డంత గ్లామరస్‌గా కనిపిస్తూంది!

డాబూ, దర్వాజతో ఎగిసిన ఫ్రంట్ ఎలెవేషన్‌లన్నీ—ఒక్కొక్కటీ ఒక్కో జాతి త్రాచులా వున్నాయ్.

సర్వెంట్స్ క్వార్టర్స్ పేరున ప్రతి కాంపౌండులోనూ ఏదో మూలన వున్న ఒకటీ—రెండూ గదులు పుండుమీద వాలే ఈగల్లా వున్నై.

రాజారావుది లంకంత బంగళా. అద్దాల మేడ. రాజారావు గొప్ప వ్యాపారవేత్త. వ్యవహారికుడు. త్రాగుబోతు. తిరుగుబోతు.

అతనికి ఇద్దరు కొడుకులు. వారిద్దరూ ఈ లంకంత బంగళాలో వుండరు. కొడైకెనాల్‌లో చదువుకుంటున్నారు. ఇక్కడ వుండేది అతనూ అతని భార్యా.

బంగళా పై అంతస్థులో డ్రస్సింగు టేబిల్ ముందు జార్జెట్ చీరా, దానిమీదకి 'మేచ్' అయే జాకెట్టూ వేసుకుని అద్దంలో తన రూప లావణ్యాలను చోద్యంగా చూసుకుంటోంది రత్నం.

బంగళాలోకి కారొచ్చి ఆగిన అలికిడికి రత్నం బెంబేలుపడి కిటికీ దగ్గరికి పరిగెత్తింది. కార్లోంచి దిగుతున్న రాజారావుని చూసి వుక్కిరి బిక్కిరయింది. ఆమెకు భయమేసింది గాభరా పుట్టింది....ఏం చేయడానికీ పాలు పోలేదు.

ఎలాగోలాగ మెట్లు దిగిపోతే రాజారావు కన్ను గప్పి బైటపడొచ్చు.

"కానీ....ఎలా?"

"ఇప్పుడాయన తిన్నగా పైకొచ్చేస్తే...."

"అయ్య బాబోయ్! ఇంకేమన్నా వుందా?"

మెట్లమీద బూట్ల టక టక... క్రమేపీ దగ్గరవుతోంది.

రత్నానికి ముచ్చెమటలు పోశాయ్. కాలూ చెయ్యీ ఆడలేదు.

చటుక్కున వెళ్ళి బీరువా పక్కన దాక్కుంది.... ఆ ఖంగారులో మంచాల పక్కన టీపాయ్ మీది మంచినీళ్ళ గ్లాసు కింద పడేసింది. గ్లాసు కిందపడి పగిలిన చప్పుడు రత్నాన్ని మరింత కలవర పెట్టింది.

వెనక్కి తిరిగి చూడ్డానిగ్గానీ, మరెందుకూ గానీ వ్యవధి లేదు.

బీరువా పక్కకి చేరి గట్టిగా ఊపిరి పీల్చుకుని "అమ్మయ్య" అనుకోకుండానే రాజారావు గదిలోకి వచ్చేశాడు.

టై విప్పి కోటు జేబులో పెట్టాడు. కోటు తీసేసి వార్డ్రోబ్‌లో తగిలించాడు. మంచం మీద కూచుని షూ లేసులూ, షూ సాక్సూ విప్పేశాడు. మంచం మీద వెనక్కి వాలిపోతూ గట్టిగా ఆవులించాడు.

"డాళింగ్....డాళింగ్" దొరలాగ పిల్చాడు పెళ్ళాన్ని.

ఆ పిలుపుకు బీరువా వారనున్న రత్నం గిలగిల్లాడిపోయింది.

రాజారావు కొంతసేపు మంచంమీద అలా పడుకుని ఏదో జ్ఞాపకమొచ్చి లేచాడు.

డ్రెస్సింగ్ టెబుల్ దగ్గరకెళ్ళి తల దువ్వుకున్నాడు.

చొక్కా విప్పేసి మంచం మీదకి గిరవాటేశాడు. బీరువా దగ్గరకెళ్ళి గ్లాస్కో పంచా, లాల్చీ తీశాడు... బట్టలు మార్చుకున్నాడు. డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరికి వచ్చి లాల్చీమీద సెంట్ స్ప్రే చేసుకున్నాడు.


రాజారావుకి అద్దంలో బీరువా చాటున చీర కొంగు కనబడింది....బీరువా దగ్గరికి పిల్లిలాగ నడిచాడు.

కొంగు పట్టుకుని ఒక్క లాగు లాగాడు.

కెవ్వున కేక.

"నేను....రత్నాన్నండీ...."

"....ఊఁ....రత్తివా?!" రాజారావు ఆమెను గుచ్చి గుచ్చి చూశాడు.



"....ఏంటీ?.... ఇవేళ ఇంత అందంగా ముస్తాబయ్యావ్?....కళ్ళు చెదిరిపోతున్నాయ్."

"అమ్మగారితో అదేదో కొట్టుకెళ్ళానండి. ఆడ తల దువ్వి జడేసి, కనుబొమ్మలూ అవీ దిద్ది....బొగ్గకింద ఈ సుక్కెట్టారయ్యా...."

"చక్కనుచుక్కలా గున్నావ్....ఇప్పుడు నీ ముందు అమ్మగారు దిగదుడుపే!...." పొగడాలనే పొగిడి రాజారావు ఆమెను వాటేసుకున్నాడు.

"అయ్యగారూ.... నన్నొదిలేండి.... అమ్మగారొచ్చే ఏలయింది....అయ్‌గారూ అమ్మగారి జార్జీట్ కోక నలిగిపోతోంది....నన్నొదిలేండి. మీరు పెద్దోళ్ళు.... నన్నొదిలేండి బాబూ.... మీకు దణ్ణం పెడతా."

రాజారావు రత్నాన్ని వదల్లేదు.

రత్నం లబో దిబో మంటోంది.

అద్దాల మేడ ఏ చడీ చప్పుడూ బయటకి పొక్కనివ్వడం లేదు.

రత్నంలో సత్తువ సన్నగిల్లుతోంది.... అలిసిపోతోంది....

శక్తినంతా కూడదీసుకుని రాజారావుని ఒక్క తోపు తోసింది రత్నం.

వెళ్ళి మంచంమీద పడి బంతిలాగ తిరిగొచ్చి పారిపోతున్న రత్నాన్ని పొదివి పట్టుకున్నాడు, రాజారావు.

నవ్వుతున్నాడు....అతని కళ్ళల్లో కైపూ, కసీ, కామం—

"రాజారావు ఇంటి యజమాని. తను అతనింట్లో నౌఖరు" అన్న వాస్తవం రత్నంలో ఇప్పుడు ఏ కోశానా లేదు.

'రాజారావు ఒక నీతిమాలిన మగాడు. తనొక ఆడది. అతనంటే యిష్టం లేని ఆడది. గుడ్డికామంతో, పశుబలంతో తన మీద పడ్డ అతణ్ని ప్రతిఘటించాలి. లొంగకూడదు.'

రత్నం రాజారావు చెయ్యి కదిలించింది. గుండెల మీద బాదింది. అందిన చోటల్లా గోళ్ళతో గీరింది....రక్కింది. చేతుల్తో కొట్టింది. తలతో కుమ్మింది.

ఎదురు తిరిగిన రత్నం మీద రాజారావుకి అరికాలిమంట తల కెక్కింది.

లాగి చెంపపెట్టు పెట్టాడు.

రత్నం వెళ్ళి మంచం పక్క టీపాయ్‌మీద పడింది. కాల్లో గాజుపెంకు గుచ్చుకుంది. ఐనా

లక్ష్యపెట్టలేదు....రాజారావు తనవైపే వస్తున్నాడు. నేలమీద చెయ్యి ఆనించి లేవబోయింది....లేచింది.

గణ గణా ఫోను....

చికాగ్గానే వెళ్ళి ఫోను తీసి "హలో" అన్నాడు రాజారావు.

"నేను .... సరోజనండీ.... అనుకోకుండా రమేష్ కలిశాడు. అతనితో మాట్లాడాను. వాళ్ళ కంపెనీ ప్రోడక్ట్స్ సోల్‌డిస్ట్రిబ్యూషన్ మన కన్‌సెర్న్‌కే ఇప్పిస్తానని ప్రోమిస్ చేశాడు. కాని....వన్ లాక్ డిపాజిట్ కట్టాలిట."

"వన్ ల్యాక్ ఏవిఁటి! టూ లాక్స్ డిపాజిట్ కట్టినా నష్టం లేదు."

"అదే! ఇంకా మాట్లాడాలి....తొమ్మిదవుతోంది. నేను రావడం లేటు కావచ్చు...."

గోడ వారగా నక్కుతూ నక్కుతూ గుమ్మం వైపు దారి తీస్తున్న రత్నాన్ని చూసి—

"ఆగు" గాండ్రించాడు రాజారావు.

ఉలిక్కిపడి ఆగిపోయింది రత్నం.

"ఎవరది?" అటునుంచి సరోజ ఆరా.

"ఆఁ....అదా.... రత్నం...." నాలుక్కరుచుకున్నాడు రాజారావు.

"అదిప్పుడు మేడమీద బెడ్‌రూంలో ఎందుకుంది?" సరోజ కూపీ.

"ఏం లేదు సరోజా....నువ్వు మాత్రం రమేష్‌తో డీల్ పక్కా చేసుకునిరా...."

"ఇంత రాత్రివేళ రత్నం బెడ్‌రూంలో ఎందుకుందీ అని అడుగుతూంటే మాట మారుస్తారేం?" సరోజ వదిలిపెట్లేదు.

"నువ్వు....ఏ రత్నం అనుకొంటున్నావ్?"

"అనుకోవడ మేవిఁటి! పనిమనిషి నాగరత్నం అంటున్నాను."

"ఛ....ఛ....నో....నో....నాతో మాట్లాడుతోంది రత్నం ఎంటర్ ప్రైజెస్ ప్రొప్రయిటర్ వెంకటరత్నంగారు...." రాజారావు ప్లేటు ఫిరాయించబోయాడు.

"ఒహో....ఆయనా! ఓసారి ఫోన్ దగ్గరికి పిలవండి. ఆయనతో మాట్లాడాలి."

కంగు తిన్నాడు రాజారావు. అరచేత్తో ఫోన్ మౌత్‌పీస్ మూసిపెట్టి గదంతా కలయ చూశాడు.

రత్నం డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర నిలబడుంది. డ్రెస్సింగ్ టేబుల్ అద్దంలో తన రూపం తనకే ఎంతో వికృతంగా కనిపిస్తోంది. సెట్ చేసిన హెయిర్ స్టైయిలు అసహ్యమేస్తోంది. గీతల్లా గీసిన కనుబొమ్మలు అసహజమైన వాతల్లా వున్నాయి.

బ్యూటీ క్లినిక్‌వాళ్ళు పెట్టిన బ్యూటీస్పాట్ "నువ్వెంత? నీ బతుకెంత? లేనిపోని అందచందాలు కావాల్సి వచ్చాయేం నీకు?" అని వెక్కిరించసాగింది.

రత్నంలో ఏదో వెగటు భావం....అద్దం మీదనించి చూపులు మళ్ళించేసింది.

తనకీ రాజారావుకీ, తనకీ గది గుమ్మానికీ మధ్య వున్న దూరాన్నీ, రాజారావుకు అందకుండా—ఎంత వేగంగా అవతలకి చేరాల్సిందీ అంచనా వేస్తోంది.

"స....రోజా.... వెంకటరత్నంగారు బాత్‌రూమ్‌లోకి వెళ్ళారు.... ఐనా.... నే చెబుతున్నాగా! నమ్మకం లేదూ?.... ఋజువులూ, సాక్ష్యాలూ కావాలా?.... ఇంతకీ నువ్వెక్కణ్నించి మాట్లాడుతున్నావ్?"

సరోజ ఠక్కున ఫోను పెట్టేసింది.

"సరోజా....సరోజా...." రాజారావు కూడా ఫోను పెట్టేశాడు విసుగ్గా.

వెనుతిరిగి రత్నం కోసం చూశాడు. బెడ్‌రూమ్ బైట గడియపెట్టిన శబ్దం వినిపించిందే కానీ రత్నం కనబళ్ళేదు.

తలుపులన్నీ బిడాయించిన గదిలో తరుముకొస్తున్న పిల్లి బారినుండి ఎలుక, నీళ్ళుపోయే కన్నంలోంచి బ్రతుకుజీవుడా అని జారుకుంటే గదిలో బందీ అయిపోయిన పిల్లి మోస్తరైంది రాజారావు పరిస్థితి.



మరోసారి టైమ్ చూసుకున్నాడు సారథి.

ఆరు దాటి పదినిమిషాలైంది.

సుదర్శనం ఇక రాడు.

సుదర్శనం సారథి పిన్నికొడుకు. ఉద్యోగ రీత్యా ఆ ఊరికి కొత్తగా వచ్చి, సారథికి ఫోన్ చేసేడు. సాయంత్రం యింటికి రమ్మన్నాడు సారథి. సుదర్శనంకి కొత్త ఊరు తెలియదు. అందుకే బస్టాండ్ దగ్గిర నిలబడి వున్నాడు సారథి.

"సరిగ్గా ఆరు లోపు వచ్చేస్తాను. నువ్వు బస్‌స్టాప్ దగ్గర ఆరుదాకా చూడు చాలు. ఆరు దాటితే నేను రానట్టే!" అన్నాడు సుదర్శనం ఫోన్‌లో.

అప్పుడే ఆరు దాటి పది నిమిషాలై పోయింది.

ఇక వెళ్ళిపోదాం—అనుకుంటున్న సారథి దృష్టి, చిరాగ్గా మొహం పెట్టుకుని రోడ్ క్రాస్ చేసి వస్తున్న 'ఆమె' మీద పడింది.

ఆమెకి పాతికేళ్ళు వుంటాయి. మనిషి పచ్చగా, పుష్టిగా వుంది. కోలమొహం, పెద్ద పెద్ద కళ్ళు—ఏదో ఆఫీసలో పనిచేసి వస్తుందేమో, మొహంలో అలసట కనిపిస్తోంది. ఆమె కట్టుకున్న రాబిన్ బ్లూ చీర, అదేరంగు బ్లవుజు నీరెండలో మెరుస్తూ ఆమె అందాన్ని రెట్టింపు చేస్తున్నాయి.

ఆమె వచ్చి బస్‌స్టాప్‌లో నిలబడి ఒకసారి

నాలుగు వైపులకు చూసింది.

కొంచెం ఎడంగా, ఒంటరిగా నిలబడి ఉన్న సారథి చూపులతో ఆమె చూపులు కలుసుకున్నాయి.

చిన్నగా ఆమె పెదాలు విచ్చుకున్నాయి.

ఆమె అందంగా నవ్వుతోంది—

సందేహం లేదు, తనని చూసే నవ్వుతోంది.

సారథి క్షణంపాటు నిశ్చేష్టుడై, వెంటనే అప్రయత్నంగా తనూ నవ్వాడు.

ఆమె భుజాన వున్న అందమైన బాగ్‌ను విలాసంగా సర్దుకుంటూ సారథి దగ్గిరగా వచ్చింది.

"ఎంత మారిపోయావ్ శ్యామ్! క్షణం పాటు నేను గుర్తే పట్టలేదు. ఎక్కడ ఉంటున్నావ్? ఏం చేస్తున్నావ్?" ఆమె గలగలా మాట్లాడేస్తోంది.

సారథి అయోమయంలో పడిపోయాడు.

ఆమె యింకా ఏదో అడగబోయేంతలో, "క్షమించండి, నా పేరు సారథి. మీరు నన్ను శ్యామ్‌గా పొరబడుతున్నారు...." అనేశాడు ఎలాగో.

"అయితే నన్ను చూసి ఎందుకు నవ్వారు?" ఠపీమని అడిగింది ఆమె.

ఏం చెప్పాలో తెలీక "మీరు నవ్వారని...." అంటూ నసిగేశాడు సారథి.

గలగలమని నవ్వేసింది ఆమె.

"శ్యామ్ నా క్లోజ్ ఫ్రెండ్. మేం విడిపోయి మూడేళ్ళయిపోయింది" ప్రాణస్నేహితుడికి, మనసులో దాచుకున్న రహస్యమేదో చెప్తున్నట్లు గొంతు తగ్గించి అంది ఆమె.

బదులు చెప్పడానికేం లేక చిరునవ్వు నవ్వాడు సారథి.

"మీరే శ్యామ్ అయివుంటే ఏం చేసేదాన్నో తెలుసా? ఈ క్షణంలో ఏదైనా హోటల్‌కి తీసుకెళ్ళి ఫామిలీ 'రూమ్‌లో యెవరూ చూడకుండా గట్టిగా ముద్దు పెట్టేసుకుని వుండేదాన్ని" మళ్ళీ నవ్వింది ఆమె.

ఆమె మాటలు విచిత్రంగానూ, విడ్డూరంగానూ వున్నాయి.

అయితే స్వచ్ఛమైన ఆమె నవ్వు మనసులో తలెత్తే సంశయాలని దూరం చేస్తోంది.

"సారీ! మిమ్మల్ని డిసప్పాయింట్ చేసినందుకు...." తనూ నవ్వుతూ అన్నాడు సారథి.

"నెవర్‌మైండ్! బస్ యిప్పట్లో వచ్చేలా లేదు. మీరు యెక్కడికి వెళ్ళాలి?" అడిగింది ఆమె.

"ఇంటికి—అయితే బస్‌లో కాదు. మా కజిన్‌కోసం వెయిట్ చేస్తున్నాను. మా ఇల్లు యిక్కడికి దగ్గరే!"

ఆమె ఒకసారి ఎడంచేయి పైకెత్తి టైమ్ చూసుకుంది.

అలా చూసుకోడంలోకూడా అందమైన ప్రత్యేకత వుంది.

"కాళ్ళు లాగేస్తున్నాయి. అలా హోటల్‌కెళ్ళి కాఫీ తాగి వద్దాం. కాస్త కంపెనీ యిస్తారా?"

క్షణంసేపు తటపటాయించాడు సారథి.

"మిమ్మల్ని శ్యామ్ అనుకోవడంలేదు. భయపడకండి!" ఛలోక్తిగా అంది ఆమె.

ఫక్కుమని నవ్వాడు సారథి.

ఇద్దరూ ప్రక్కనే ఉన్న హోటల్‌లోకి దారితీసారు. ఫామిలీ రూమ్ ఫుల్‌గా ఉంది. మామూలు చోటే కొంచెం ఎడంగా కూర్చున్నారు.

"ఇక్కడ కూర్చోవడమే మంచిది!" ఆమె అలా యెందుకు అందో సారధికి బోధపడలేదు.

బేరర్‌కి రెండు బ్రూ కాఫీ చెప్పాడు సారథి.

"మీరు యేం చేస్తున్నారు?" అడిగాడు సారథి.

"మీ యెదురుగుండా కూర్చుని కాఫీ కోసం ఎదురుచూస్తున్నాను!"

ఆమె జవాబు నవ్వు తెప్పించింది సారధికి.

"ఐమీన్, యెక్కడ జాబ్ చేస్తున్నారు?"

"మీరు యెక్కడ చేస్తున్నారు?"

"కెనరా బాంక్‌లో. రాష్ట్రపతి రోడ్

బ్రాంచ్" ముందు తనే చెప్పాల్సి వచ్చింది సారధికి.

"నా ఉద్యోగం చెప్పడం నాకు యిష్టంలేదు. మీరు ఏమీ అనుకోరుగా!"

అనుకుంటాను—అనడానికి సభ్యత అడ్డు వచ్చింది సారధికి. అనుకోనన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు.

బేరర్ తెచ్చిన కాఫీని యిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ తాగారు. ఆమె చాలా చక్కగా మాట్లాడుతోంది. ఆమె నవ్వుతుంది—నవ్విస్తుంది.

ఆ నవ్వులో యెంతో ఆకర్షణ కనిపించింది సారధికి.

బేరర్ బిల్లు తెచ్చాడు.

సారధి బిల్లు యివ్వబోతుంటే ఆమె వారించింది.

"మిమ్మల్ని కాఫీకి పిలిపించింది నేను!" బలవంతంగా బేరర్‌కి రెండు రూపాయలనోటు ఇచ్చి లేచింది.

"మగవాడు వుండగా ఆడవాళ్ళు బిల్లు చెల్లించడం బాగుండదు" నొచ్చుకుంటూ అన్నాడు సారధి.

"ఆడది కూడా సంపాదిస్తున్నప్పుడు ఆడ మగ భేదం ఏముంది?"

సారధి మరి మాట్లాడలేదు.

ఇద్దరూ హోటల్ బయటికి వచ్చారు.

ఆకాశంలో మేఘాలు కమ్ముకుంటున్నాయి.

"వర్షం వచ్చేలా ఉంది" ఆకాశంవైపు చూస్తూ అన్నాడు సారధి.

"మబ్బులన్నీ వర్షించవు. అన్నట్లు మీ యిల్లు యిక్కడికి దగ్గిరే అన్నారుగా, నాకు చూపించరూ?"

సారధి గుండె ఝల్లుమంది. ఈమె ఈ వాతావరణంలో ఇంటికి వస్తుందా? ఇంట్లో జ్యోతి కూడా వుంది!

"మా శ్రీమతి కాఫీపొడెం తెమ్మంది. మర్చేపోయాను!" ఇంట్లో తన శ్రీమతి కూడా వుందని ఆమెకి తెలియడానికి డొంకతిరుగుడుగా అన్నాడు సారధి.

"అయితే ఆలస్యం యెందుకు? కాఫీపొడెం కొనండి."

ఇక ఆమె వదిలేలా లేదు. అవసరం లేక పోయినా కాఫీపొడెం కొన్నాడు సారధి. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

"మీ శ్రీమతికి నన్ను ఏమని పరిచయం చేస్తారు?" హఠాత్తుగా అడిగింది ఆమె.

"ఏమని చేస్తాను? జరిగింది చెప్తాను."

"గంట పరిచయంలో యింటికి వచ్చారంటే ఆవిడ నమ్ముతారా?"

"మీరు వస్తున్నారుగా!"

"అందరూ నాలా ఉంటారా?"

సారధి జవాబు చెప్పే అవసరం లేకుండా ఇల్లు వచ్చేసింది.

సారధి తలుపు తట్టాడు.

వంటింట్లోంచి తిన్నగా వచ్చి తలుపు తీసింది జ్యోతి. పేరు జ్యోతి అయినా ఆమె మరకలతో, జిడ్డు మొహంతో జ్యోతి క్రింద వుండే ప్రమిదలా పొట్టిగా లావుగా వుంది.

భర్త పక్కన వున్న అందమైన అమ్మాయిని చూడగానే ఆమె కంగారు పడి "రండి, రండి!" అంటూ తను పక్కకి తప్పుకుంటూ దారి ఇచ్చింది.

ఆమె వచ్చి ముందు గదిలోనే ఉన్న కుర్చీలో కూర్చుంది.

జ్యోతి లోపలికి వెళ్ళిపోయింది.

"మా ఇల్లు మామూలుగా ఉంటుంది" మొహమాటపడుతూ అన్నాడు సారధి.

"నాకు మాత్రం చాలా బావుంది" మనస్ఫూర్తిగా అంది ఆమె.

జ్యోతి మొహం కడుక్కొని, చీర మార్చుకొని రెండు గ్లాసులతో కాఫీ పట్టుకొని వచ్చింది.

"కాఫీ చూస్తే ప్రాణం లేచి వచ్చినట్లుగా ఉంది. ఎప్పుడో మధ్యాహ్నం తాగిన కాఫీ!" గ్లాసు అందుకుంటూ అంది ఆమె.

ఆమె తాము హోటల్లో కాఫీ తాగి వచ్చాం అని యెక్కడ చెప్తుందో అని హడలిపోతున్న సారధి తేలిగ్గా నిట్టూర్చి, తనూ భార్య చేతి

లోంచి కాఫీ అందుకుంటూ "ఈవిడే మా శ్రీమతి" అన్నాడు ఆమెతో.

ఆమె కాఫీగ్లాసు కిటికీలో పెట్టి "నమస్కారం" అంటూ చేతులు జోడించి, మళ్ళీ గ్లాసుని చేతిలోకి తీసుకుంది.

ఆమెని ఏ విధంగా పరిచయం చెయ్యాలో తెలియని సారథి మౌనంగా ఉండిపోయాడు.

ఆమె కాఫీ తాగేసి, "వెదర్ ఎలా ఉందో?" అంటూ తలుపు తీసి చూసింది.

అవతల మబ్బులు కమ్ముకుంటున్నాయి.

"పెద్ద వర్షం వచ్చేలా వుంది" అన్నాడు సారథి.

"నాకు వర్షం అంటే చచ్చేంత భయం" అంటూ మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చుంది.

ఆమెతో భార్య ముందు కులాసాగా నవ్వుతూ మాటాడటం యిబ్బందిగా అనిపించింది సారథికి.

వర్షం ప్రారంభం అయ్యాక, ఒకసారి కిటికీలోంచి లేచింది ఆమె.

"అయ్యో, తుప్పర పడుతోంది. కాస్సేపు కూర్చోండి" అంది జ్యోతి.

"ఫరవాలేదు" నెత్తిమీదుగా కొంగు కప్పుకొని ఆ తుప్పరలో తడుస్తూ వెళ్ళిపోయింది ఆమె.

"ఎవరండీ ఆవిడ?" ఆమె వెళ్ళినవైపే చూస్తూ నిలబడిపోయిన సారథి నుద్దేశించి కుతూహలంగా అడిగింది జ్యోతి.

ఒక్క మాటలో చెప్పడానికి కుదరక, జరిగినదంతా చెప్పాల్సి వచ్చింది సారథికి.

"ఒక్క గంట పరిచయంతో యింటికి వచ్చిందా? నేను నమ్మను" ఆమె కళ్ళ నిండా అనుమానం.

"నమ్మకపోతే నీ ఖర్మ. అదే నిజం!" చికాగ్గా అన్నాడు సారథి.

జ్యోతి కళ్ళలో చివ్వున నీళ్ళు చిమ్మాయి.

* * *

వారం రోజుల తర్వాత సారథి బాంక్ అడ్రస్‌కి ఒక వుత్తరం వచ్చింది. అపరిచితమైన దస్తూరి!

ఫ్రమ్ ఎడ్రస్ లేదు. ఆత్రుతగా కవరు చింపి సంతకం చూశాడు.

"ఆమె" అని ఉంది.

ఆమె యెవరో సారథికి అర్థం అయిపోయి గబగబా చదవసాగాడు.

"సారథిగారూ,

మీరు కొత్త దస్తూరిని చూడటంవల్ల ముందు సంతకం చూస్తారని నాకు తెలుసు. మీకు నా పేరు తెలియదు గనుక 'ఆమె' అనే నా గురించి అనుకుంటారనీ తెలుసు! (అది, ఇది—అని అసహ్యంగా అనుకునే సంస్కారహీనులు కారనే నమ్మకం.) అందుకే అలా సంతకం పెట్టాను.

సారథిగారూ, ఆరోజు నా ప్రవర్తన విచిత్రంగా అనిపించింది కదూ? నా గురించి చెడ్డ అభిప్రాయం ఏర్పడే అవకాశం కూడా ఉంది. నేను ఆ రోజు యెందు కలా ప్రవర్తించానో రాస్తున్నాను. కాస్త ఓపిగ్గా చదువుతారని భావిస్తున్నాను.

నేను కాలేజీలో చదివే రోజుల్లో శ్యామ్‌ని మనస్ఫూర్తిగా ప్రేమించాను. శ్యామ్ కూడా నన్ను ప్రేమించాడనే భ్రమ పడ్డాను. ఇద్దరం సినిమాలు, కథల ప్రభావంవల్ల- షికార్లు, సినిమాలు అంటూ తెగ తిరిగాం. నేను ఫైనలియర్ పరీక్షలు వ్రాసి మా ఊరు వెళ్ళిపోయాను.

ఒకరోజు నాకు ఏదో శుభలేక వచ్చింది— శ్యామ్ పెళ్ళి అని! ఒక లక్షాధికారి కూతురితో అతని పెళ్ళి అంతక్రితం రోజే జరిగిపోయింది.

వెంటనే వెళ్ళి శ్యామ్‌ని కలుసుకున్నాను.

నా కన్నీళ్ళకి అత నిచ్చిన జవాబేమిటో తెలుసా?

"కాలేజీ లైఫ్‌లో ఒక అందమైన గర్ల్ ఫ్రెండ్ ఉండటం మగవాడికో గొప్ప! అందుకే నీతో స్నేహం చేశాను. నిన్ను పెళ్ళి చేసుకుంటానని యెప్పుడైనా అన్నానా? అందమైన బీద భార్యకన్నా, అనాకారి ఐన లక్షాధికారి కూతురు భార్య అవడం మంచిది. డబ్బుతో

అందుల్నా కనుక్కొగలం!

ఆ పశువు మొహం చూడటానికే అసహ్యం వేసింది. వెనక్కి తిరిగి వచ్చేసాను. ఆ షాక్ నుంచి నే నింకా తేరుకోనేలేదు. ఇంతలో వుద్యోగ రీత్యా నేను హైద్రాబాద్ వచ్చాను.

నెల క్రితం అబిడ్స్‌లో అనుకోకుండా శ్యామ్ కనిపించాడు.

ఆ రోజు నుంచీ నా వెంట పడుతున్నాడు.

ఒక రోజు నాకు ఫోన్‌చేసి "సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్‌కి 'స్తావా?' అన్నాడు.

"ఎందుకు?" కటువుగా అడిగాను నేను.

"ఎందుకేమిటీ, సరదాగా తిరుగుదాం! అయినా నా అంత అందమైన బాయ్ ఫ్రెండ్ ఉన్నాడని చెప్పుకోవడం నీకు మాత్రం గొప్ప కాదూ?" వెకిలిగా నవ్వాడు.

"షటప్, ఇది ఫోన్ కాబట్టి బతికిపోయావ్! ఎదురుకుండా వుంటే దవడ పేలిపోయి వుండేది. నీకన్నా వెయ్యిరెట్లు అందగాడూ, నీకు లేని మంచి మనసు వున్నవాడూ ఇప్పటి నా ఫ్రెండ్. అంతే కాదు, నీ వెర్రివేషాల గురించి చెప్తే ఒక దెబ్బతో నిన్ను మట్టికరిపించ గలిగేంత బలమైనవాడు కూడా! మైండిట్! డోంట్ ట్రై టు ప్లే విత్ ఫైర్!" చాలా స్ట్రాంగ్ డోస్ యిచ్చి, ఫోన్ పెట్టేసాను.

కానీ తర్వాత కూడా నన్ను వెంబడించడం మానలేదు అతను. బహుశా నా యిప్పటి ఫ్రెండ్‌ని చూసి, నేను చెప్పిన మాటలు, నిజమో కాదో తేల్చుకోవడానికి కావచ్చు!

అ రోజు కూడా ఆఫీసు నుంచి వస్తుంటే నా వెనకే వస్తూన్నాడు అతను.

బస్‌స్టాప్‌లో మిమ్మల్ని చూడగానే నాకు శ్యామ్‌ని వదిలించుకునే ఉపాయం తట్టింది. మీరు శ్యామ్ కంటే చాలా అందంగా, స్ట్రాంగ్‌గా వుంటారు. మర్యాదస్తులుగా కూడా కనిపించారు నాకు.


మనం నవ్వుకుంటూ మాట్లాడుకోవడాన్ని, మాడిపోతున్న మొహంతో చూస్తూన్న శ్యామని చూస్తే నాకు ఇంకా విరగబడి నవ్వాలనిపించింది.

అతన్ని యింకా ఏడిపిద్దామనే మిమ్మల్ని హోటల్‌కి తీసుకెళ్ళాను. అతనూ హోటల్‌లోకి వచ్చాడు. మళ్ళీ అతను వెంబడిసాడనే మీతో మీ యింటికి వచ్చాను. కాస్సేపు మీ యింటి ముందు తచ్చాడి, అతను వర్షం వచ్చేలా వుందని కాబోలు, వెళ్ళిపోయాడు. మనిద్దరం కలిసి హోటల్‌కి వెళ్ళడం, నేను మీ ఇంటికి రావడంతో నేను చెప్పిన బాయ్‌ఫ్రెండ్ మీరేనని అతనికి రూఢి అయిపోయినట్లుంది. ఈ వారంలో మళ్ళీ ఫోన్ చేయలేదు. ఇక ఆ ప్రయత్నం చేయడనే భావిస్తున్నాను.

నా విషయమై మీ భార్యాభర్తలమధ్య ఏవైనా అపోహలు కలిగివుంటే క్షంతవ్యురాల్ని. ఈ ఉత్తరం మీ శ్రీమతికి కూడా చూపించండి. ఆవిడ మనసులో ఏ మాత్రమైనా అనుమానం యేర్పడి వుంటే అది క్లియరౌతుంది.

మీరు చేసిన సహాయానికి థాంక్స్ చెప్పాలో, మిమ్మల్ని యిబ్బంది పెట్టినందుకు సారీ చెప్పాలో అర్థం కావడంలేదు. నా పేరు చెప్పాల్సిన అవసరం లేదని చెప్పడం లేదు. మరోలా భావించరుగా,

—ఆమె."



డప్పు

యండమూరి వీరేంద్రనాథ్



డప్పేశ్వర్రావు మా సెక్షన్లో పనిచేస్తున్నాడనీ, నా కిందేనని తెలియటంతో పొంగిపోయాను. డప్పు వాయించేవాళ్ళంటే నేను చెవి తెగ్గోసుకుంటాను. అసలు డప్పు వాయించటం అనేది అన్నిటికన్నా ఉత్తమోత్తమమయిన కళ అని నా వుద్దేశ్యం. అరిచేత్తోనూ వేళ్ళతోనూ శృతిబద్ధంగా వాయిస్తూవుంటే వినటానికి యెంత సొంపుగా వుంటుందో. అంత గొప్ప కళాకారుడు నా సెక్షన్‌లో వున్నందుకు యెంతో గర్వించి, వెంటనే నాల్గు ఇంక్రిమెంట్లు జారీ చెయ్యవలసిందిగా నా పై అధికారులకి విన్నవించుకొన్నాను.

నా సిఫార్సుని అంగీకరించి పైవాళ్ళు సదరు ఇంక్రిమెంట్లు జారీచేసేరు.

కళకి తగిన గుర్తింపు లభించినందుకు నేను మహదానందం చెంది, డప్పేశ్వర్రావుని నా గదిలోకి పిల్చి అతనికి వచ్చిన ఇంక్రిమెంట్ల సంగతి చెప్పేను.

అతడు కూడా అమితానందం చెందినవాడై నా గదిలోనే కొద్దిసేపు నా బల్లమీద డప్పు వాయించి వెళ్ళిపోయేడు.

మొత్తం మా సెక్షన్‌లో పనిచేసేది ఆరు

గురు. అందులో ఆరుగురి పెట్టుపని చేసేది రమణరావు వొక్కడే. ముగ్గురు కొంచెం అటూ యిటూగా పర్లేదు. జోగేశ్వర్రావు మాత్రం ఉహూ అసలు పెన్ తియ్యడు. ఇక మిగిలింది డప్పేశ్వర్రావు. అంతటి కళాజీవిని పనిచెయ్యమని అడగడమే? కళ్ళుపోతాయి.

డప్పేశ్వర్రావు పైటకెళ్ళిన అరగంటకి మిగతా ముగ్గురూ లోపలికి వచ్చేరు. అతడిచ్చిన టీపార్టీ ఆరగించి వచ్చినట్టున్నారు. కిళ్ళీలు బిగించేరు. ముగ్గుర్నీ సాదరంగా కూర్చో బెట్టేను.

"మీకు డప్పు అంటే చాలా ఇష్టంలా వుందే" అన్నాడు వాళ్ళలో ఒకరు.

"చాలా యిష్టం. అసలు డప్పుని భారత దేశపు ప్రధాన వాద్యంగా పెట్టాలి" అన్నాను కొంచెం ఆవేశంతో.

అవి తమకి రాకపోవడం తమ దురదృష్టం అన్నారు వాళ్ళు.

వాళ్ళవైపు జాలిగా చూసేను.

"సార్" అన్నాడు వాళ్ళలో ఒకడు. "మీరు డప్పు వాయించేవాళ్ళని ఇంత ప్రోత్స హించడం మా అదృష్టం. కళలకి స్థానం లేకుండా పోతున్న పవిత్ర భారత దేశంలో మీలాటివాళ్లున్నారంటే అది మేం చేసుకున్న పుణ్యం."

....వాళ్ళిలా డప్పు వాయించడం మొదలు పెట్టేసరికి పొంగిపోయాను.

"నాయిన్లారా-మీకేం కావాలి?" అని అడి గేను ఆప్యాయంగా.

"మేము డప్పు నేర్చుకోవాలనుకుంటున్నాం. నేర్చుకుని మీకు పేరు తెస్తాం. ప్రతిరోజూ మూడు గంటలకి వెళ్ళిపోయి డప్పు వాయిం చడం ప్రాక్టీసు చేసుకోవటానికి పర్మిషన్ ఇవ్వండి సార్" అన్నారు ముక్తకంఠంతో.

సరేనని పర్మిషన్ ఇచ్చేసేను.

వాళ్ళ మొహాలు డప్పంత అయినయ్.

ఆ మరుచటి రోజునుంచీ పని మానేసి డప్పు వాయించటం మొదలుపెట్టేరందరూ. వినటానికి ఎంతో బావుండేది. వేళ్ళతో వాయిం చేది-సుతారంగా వాయించేది. వాడికన్నా బాగా వీడు వాయించేది-వీడికన్నా బాగా వాడు వాయించేది. నా చుట్టూచేరి అప్పుడప్పుడూ ముగ్గురూ కలిసి వాయించేవారు. ఒకోసారి ఒక్కొక్కడు వచ్చి సెపరేట్‌గా వాయించే వారు.

మూడు గంటలకి సీట్లు కట్టేసి ప్రాక్టీసుకు వెళ్ళిపోయేవాళ్ళు. వారానికొకసారి కచేరీల కోసం మూడు రోజులు డ్యూటీ లీవ్ పెట్టి వెళ్ళేవాళ్ళు.

డప్పు వాద్యగాళ్ళని నా ఆర్గనైజేషన్ నష్టాన్ని లెఖ్కచేయకుండా ప్రోత్సహిస్తు న్నందుకు నాకు మంచి పేరొచ్చింది.

రోజులు అన్నీ ఒకేలా గడవవు కదా. ఆ రోజు జోగేశ్వర్రావు రెండు నెలల శలవు పూర్తి చేసుకొని వచ్చి జాయినయ్యేడు. అర గంట తర్వాత నా దగ్గర కొచ్చేడు. నా టేబుల్ మీద ఒక సర్టిఫికెట్టు పడేసేడు.

"ఏమిటిది?" అని అడిగేను.

"కెప్టెన్‌ని" అన్నాడు.

"దేనికి?"

"బూరదగుంట గోటీబిళ్ళ అసోసియేషన్‌కి నేనే కెప్టెన్‌ని" అన్నాడు స్టయిల్‌గా.

"అయితే ఏమిటట?" అన్నాను.

"ప్రమోషనూ - ప్రతిరోజూ వన్ అవర్ పర్మిషనూ" అన్నాడు.

నాకర్థం కాలేదు. "ప్రమోషన్ ఏమిటి?" అన్నాను.

"డప్పేశ్వర్రావుకి ఇంక్రిమెంట్లెందుకిచ్చారో నాకు ప్రమోషన్ దానికే" అన్నాడు.

అతడి అజ్ఞానానికి నవ్వేను. "చూడు జోగేశ్వర్ - డప్పేశ్వర్రావు అంటే అఖిల భారతదేశమూ గర్వించదగ్గ డప్పు వాద్యగాడు. నువ్వేమో బూరదగుంట అసోసియేషన్ గోటీ బిళ్ళ కాప్టెన్‌వి. నీకూ అతడికీ పోలికెక్కడ?"

దానికి అతను "డప్పంటే దేశానికి సంబం ధించిన వాద్యం. అందుకే అతడు దేశ ఖ్యాతి పొందేడు. మరి గోటీబిళ్ళ, రాష్ట్రం దాటి వెళ్ళలేదుగా! బస్తీమే సవాల్. మా బూరద గుంట గోటీబిళ్ళ అసోసియేషన్‌తో ఎవరైనా

సరే రండి పోటీకి——" అన్నాడు. ఆవేశం వస్తే అతడు మనిషి కాడని తెలిసి అనునయించేను.

"నీ గోటీబిళ్ళవల్ల దేశానికి లాభం ఏమిటోయ్?" అని.

"డప్పువల్ల మాత్రం ఏముందంటి?" అని ఎదురు ప్రశ్న వేసేడు.

'ఓరి వెధవాయ్. నాకే ఎదురు సమాధానం చెస్తావ్. నీ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు రానీ నీ పని చెప్తాను' అని మనసులో అనుకొని పైకి మాత్రం "చూడవోయ్ జోగేశ్వర్రావ్ - మంచి డప్పు వాద్యగాడు వాయిస్తూ వుంటే-వేల వేల మంది గంటల తరబడి అలా....అలా.... మైమరచి వింటూ వుండిపోతారు తెలుసా?" అన్నాను.

"అది మరీ నేషనల్ వేస్టుకదా" అన్నాడు.

నా కోపం వచ్చింది. "నువ్వేన్నయినా చెప్పు. కేవలం గోటీబిళ్ళ కెప్టెన్‌వయినందుకు నీకు ప్రమోషన్ యివ్వలేను" అన్నాను.

"అయితే స్ట్రయిక్ మొదలెడ్తున్నా" నన్నాడు.

ఉలిక్కి పడ్డాను. అరక్షణంలో మొహం మీద నవ్వు పులిమేసుకొని "ఇంతదానికి స్ట్రయిక్ ఎందుకోయ్——నీ సంగతి నాకు వదిలిపెట్టు" అన్నాను. జోగేశ్వర్రావుకి యూనియన్‌లో పలుకుబడి వుంది. దాని అర్థం గ్రహించి అతడు సంతృప్తిగా వెళ్ళిపోయేడు.

నెల రోజుల్లో అతడికి ప్రమోషన్ వొచ్చింది. ఇద్దరికి ప్రమోషన్ ఇవ్వాలంటే సీనియారిటీ ప్రకారం ఇంకో ఇద్దరికి ఇవ్వాలి కాబట్టి రంగారావుకీ అప్పారావుకీ ప్రమోషన్లివ్వాల్సి వచ్చింది. ప్రతి ఐదు ప్రమోషన్లకీ ఒక షెడ్యూల్ కాస్టు వ్యక్తికి ప్రమోషన్ ఇవ్వాలి కాబట్టి ఎల్లమందికి ఇవ్వాల్సి వచ్చింది.

ఆ తర్వాత మిగిలిన ఒక్కడూ (రమణారావు) వచ్చేడు. "సార్! నా పనిలో ఎక్కడయినా లోపం కనబడుతుందా?" అని అడిగేడు. నిజానికి మా సెక్షన్‌లో సరిగ్గా పని చేసేది అతడొక్కడే.

"లేదోయ్-సూపర్బ్" అన్నాను.

"మరి నాకు ప్రమోషన్!" అని అర్థించేడు.

"చూడు రమణ్రావ్! మన కోటా ఈ సంవత్సరం ఐదే కదా. ఒకటి డప్పు వాయించే వాడికి, ఇంకొకటి గోటీబిళ్ళ ఆడేవాడికి ఇచ్చేం గదా" అన్నాను. "మిగతా ఇద్దరూ సీనియర్స్- ఒక రిజర్వేషను కాండేటూ."

"మీరలా అంటారనే నేను రిజైన్ చేస్తున్నాను సార్" అని చేతిలో లెటర్ బల్లమీద పెట్టేడు.

ఉలిక్కిపడి "అదేమిటోయ్" అన్నాను.

"మా నాన్న పల్లెటూళ్ళో పుణుకులు అమ్ముకునేవాడు సార్! పైసా పైసా కూడబెట్టి అర్ధాకలితో కడుపు మాడ్చుకొని నన్ను చదివించేవాడు. మిట్టమధ్యాహ్నం రోహిణీకార్తి ఎండలో తల్లోంచి చమట కారుతుంటే, ఎండ శరీరాన్ని మాడ్చేస్తుంటే రావిచెట్టుకింద కూర్చొని సల సల కాగే నూనె ముందు నలభై సంవత్సరాల్నించీ కూర్చునే వున్నాడు. రావి చెట్టు ముసలిదైంది. నన్ను చదివిస్తూ చదివిస్తూ మా నాన్న పండుటాకు అయ్యేడు. చదవటం తప్ప ఇంకేమీ నేను నేర్చుకోలేదు సార్! నాకు గోటీబిళ్ళ ఆడటం రాదు. డప్పు వాయించటం రాదు. షెడ్యూల్డు కాస్టువాడినని సర్టిఫికెట్టు సంపాదించటం చేతకాదు. పని చెయ్యటం తప్ప నాకింకేమీ రాదుసార్. దానికి విలువలేని ఈ వ్యవస్థలో ఇలా ఫైళ్ళమధ్య బ్రతకటంకన్న మా పల్లెలో రావిచెట్టుక్రింద నా తండ్రి పక్కనే కూర్చొని పని చేసుకోవడం సంతృప్తిగా వుంటుందని అనుకొంటున్నాను సార్ నేను" అని అతను వెళ్ళిపోయాడు.

బైట మావాళ్ళు వాయిస్తున్న డప్పు వినబడ్తూనే వుంది.

కాని రమణారావు మాటలు గుండెలమీద మోగుతున్నట్టున్నాయి. □



కాలేజీ మొత్తంమీద ఆ బేచ్ అంటే అందిరికీ హడలే!

దానికి లీడర్ "హీమాన్."

అతని పేరు ఏదైనా, అతను పాప్యులర్ అయింది ఆ పేరుతోనే.

ఆడపిల్లల్ని ఏడిపిస్తారు. అలా యిలా కాదు, కళ్ళ నీళ్ళువచ్చి కాలేజీ మానేసేవరకు.

స్టాఫ్‌ని ఏడిపిస్తారు. అలా యిలా కాదు, రెండుచేతులు ఎత్తి దండం పెట్టేవరకు.

ఆడపిల్లలు ధైర్యంచేసి కంప్లయింట్ చేసినా ప్రిన్సిపాల్‌కి ఏక్షన్ తీసుకొనే ధైర్యంలేదు. ఆ సంఘటనకి సాక్ష్యం వుందా అని అడుగుతాడతను. ఆ ముఠాకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పే ధైర్యం పెద్దవాళ్ళలోను, చిన్నవాళ్ళలోను ఎవరికీ లేదు.

లెక్చెరర్సు విసుగెత్తి ఫిర్యాదు చేసినా, అతని బలాబలాలు బోధపరిచి, శాంతపరచి(!) పంపిచేంస్తారు ప్రిన్సిపాల్.

ఇలాంటి తన యిష్టా రాజ్యంలో,

ఆ రోజు వినోద కార్యక్రమంలో, 'హీమాన్', వంటరిగా వెళుతున్న సరోజ రెండు జడలలోను, ఒకటి కత్తిరించేసాడు తన అయిదుగురు స్నేహితుల సమక్షంలో,

సరోజ—

ఏడ్చుకొంది. ఏడుస్తూనే ప్రిన్సిపాల్ రూమ్ వైపు వెళ్ళింది.

బృందం—

ఆనందించింది. ఆనందంతో విరగబడి పైశాచిక నృత్యం చేసింది.

షరా మామూలే!

సాక్ష్యం లేవని 'ప్చ్' అన్నాడు ప్రిన్స్‌పాల్.

సరోజకి, కాలేజీ మానెయ్యటం మినహా మరొక గత్యంతరం కన్పించలేదు.

అయితే,

ఆడపిల్లల జట్టులో, కాస్త ధైర్యశాలి అయిన నీరజ యిక ఆగలేకపోయింది.

సరోజని తీసుకొని ప్రిన్సిపాల్ వద్దకు మరొకసారి వెళ్ళింది నీరజ.

"సాక్ష్యం లేకపోతే నేనేమీ చెయ్యలేనమ్మా" సహజ శాంత ధోరణిలో అన్నాడు ప్రిన్సిపాల్.

"ఇటువంటి వాటికి సాక్ష్యాలు దొరకవండీ. అయినా, అతని అత్యాచారాలు మీకు తెలియనివి కావు. మీరే పూనుకొని ఈ రాక్షసత్వానికి ఫుల్‌స్టాప్ పెట్టించకపోతే ఈ వ్యవస్థ దిక్కుమాలిపోతుంది."

పెదవి విరిచాడు ప్రిన్సిపాల్.

నీరజ కంఠశోష, వ్యర్థం అవుతోంది.

"మీ వ్యవహారం చూస్తూవుంటే, రేప్పొద్దున్న ఆ రౌడీ వెధవలు, కాలేజీ ఆడపిల్లని వంటరిగా, బలవంతంగా లాక్కుపోయి రేప్ చేస్తే, ఆ రేప్ సీనుకి కూడా సాక్ష్యం అడిగేటట్టున్నారు."

"అంతేకద మరి" అన్నట్టు చూసాడు ప్రిన్సిపాల్.

"యూ ఆర్ ఏ ఫూల్....యూ....ఫిట్ ఫర్ నథింగ్ ఈడియట్" తీక్షణ్ణంగా చూస్తూ అని పళ్ళు కొరికింది నీరజ.

ఒక్కక్షణం, నీరజ ఏం మాట్లాడిందో బోధపడలేదు ప్రిన్సిపాల్‌కి.

ఆ ఒక్కక్షణం తర్వాత, ఆ తిట్లు తననే వుద్దేశించినవని గ్రహించాకా శాంతరసం రౌద్రంగా మారింది.

"షటప్! నిన్నీ క్షణంనించి కాలేజీలో నుండి డిస్మిస్ చేస్తున్నాను" దాదాపు అరిచాడు ప్రిన్సిపాల్.

"ఎందుకు సార్!" ఆశ్చర్యం నటిస్తూ అడిగింది నీరజ.

"యూ డేమ్ డర్టీగూస్....నన్ను ఫూల్, ఈడియట్ అంటూ తిడతావా?"

"ఛఛ....ఎంత మాటెంతమాట? నేనిప్పుడటువంటి మాటలే అనలేదే!"

ఈ సారి, రౌద్రం విస్మయంలోకి దిగింది.

"వాట్ డెవిల్ యూ ఆర్? ఇప్పుడిప్పుడు తిట్టి, మళ్ళీ అనలేదంటావా? ఏం సరోజా! నీరజ యిప్పుడు నన్ను తిట్టలేదూ?"

తెల్లమొహం వెయ్యబోతున్న సరోజవైపు తిరిగింది నీరజ.

"చెప్పు సరోజా! ఇక్కడున్న ఒకే ఒక సాక్ష్యానివి నువ్వు. అలాంటి మాటలన్నానా నేను!"

నీరజ స్ట్రాటజీ కొంత అర్థమైనట్టే అనిపించింది సరోజకి.

"అబ్బే....అదేం లేదే....లేద్సార్" అంది సరోజ.


ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు ప్రిన్సిపాల్.

"మీరు నా మీద యాక్షన్ తీసుకోలేరు సార్. దీనికి....సాక్ష్యం లేదు."

శీతాకాలంలో వేసుకున్న సూటు వుక్కబోసింది, ప్రిన్సిపాల్‌కి.

"ఈ మాత్రం దానికే, నాలుగు గోడలమధ్య జరిగిన దానికే, యింత గిలగిలల్లాడిపోతున్నారే, రేపు....మీమీద తనకున్న అధిక్యత నిరూపించుకోవాలని వెర్రికోరిక ఆ రాక్షసుడికి కలిగితే, పదిమందిలోనూ మిమ్మల్ని అతను సాచిపెట్టి లెంపకాయ కొట్టినా ఆశ్చర్యపడనక్కరలేదు. అప్పుడు....ఒక్కడు...ఒక్కడు కూడా మీకు సాక్ష్యం రాలేడు. అప్పటి మీ పరిస్థితి వూహించుకోండి సార్.

"ఏక్షన్ తీసుకోకుండా తల ఎత్తుకొని తిరగగలరా? ఏక్షన్ తీసుకొని అమ్ముకొన్న తలని రక్షించుకోగలరా?"



ఒక్కక్షణం ఆగింది నీరజ.

"ఈ ఒక్కక్షణపు అవమానానికే మీరింత కుదేలయిపోయారే! అనుక్షణం అవమానాల పాలవుతూ ఎంతమంది నిస్సహాయంగా ఏడ్చుకొంటున్నారో గమనించండి. దీనికి అంతం లేనినాడు మీకు, మాకు, మన వ్యవస్థకి కూడా భద్రతలేదు. ఇది అంతం కావటానికి కావల్సింది సాక్ష్యం కాదన్నా....కలేజా....గుండెధైర్యం! ఆ మొగతనం మీకు లేనినాడు...."

పూర్తిచెయ్యలేక ఆగి,

"గుడ్‌బై...." అంటూ సరోజ చెయ్యి పట్టుకొని వెళ్ళిపోయింది నీరజ.

"స్టాప్...." దాదాపు మరోకసారి అరిచాడు ప్రిన్సిపాల్.

"అలా కూర్చోండి."

ఆడపిల్లలిద్దరూ వెనక్కివచ్చి కూర్చున్నారు.

గ్లాసులో నీళ్ళు గటగట తాగేసాడు. టైనాట్ లూజ్ చేసుకొన్నాడు. తిరుగుతున్న ఫేన్‌వైపు తదేకంగా చూస్తూ కొంతసేపు ఆలోచించాడు.

చివరికి,

"సరోజా, రైటింగ్‌లో కంప్లయింట్ యివ్వమ్మా" అని అడిగాడు.

సరోజ యిచ్చిన కంప్లయింట్ పై ప్రిన్సిపాల్ ఎలా యాక్షన్ తీసుకోగలిగాడన్నది ముఖ్యం కాదు.

"భూమి ఆకాశం ఏకం చేసినా సరే, ఇక తమకి ఆ కాలేజీలోనే కాదు ఇక ఎక్కడా పనిచేసే యోగం లేదని" ఆ బృందానికి తెల్పింది.

అంతకంటే ముఖ్యంగా,

"ధైర్యం వున్నవాడికి అసాధ్యం అన్నది లేదని....ధైర్యం లేనివాడు మనిషిగా మాత్రం బ్రతకలేడని" ప్రిన్సిపాల్‌కి తెల్పింది.

ఆ తర్వాత, ఆ కాలేజీలో, మనుషులు నిర్భయంగా మనుషుల్లాగ సంచరించేరు.

సీరియల్



"మీరా యెందుకు రాలేదో తెలియదు. జ్యోతికి తెలిసే వుంటుంది. వాళ్ళింటికి వెళ్ళకుండా మీరా యింటికి తీసుకెళ్ళమంటే ఏం బాగుంటుంది?"

"....ఇంకో నాలుగురోజులు పోతే ఆవిడే వస్తుంది—జ్యోతితో మాత్రం వెళ్ళొద్దు"

మరోసారి ఖచ్చితంగా చెప్పేడు శేఖరం.

అరుణకి కోపం వచ్చింది. "మీరా వచ్చిననాళ్ళు ఆవిడగారు—ఆవిడగారూ అంటూ హేళనగా మాట్లాడావు—యిప్పుడు నీకు చాలా సంతోషంగా వుండే వుంటుందిలే!" అంది కోపంగా.

"అరుణా!" శేఖరం బాధగా అన్నాడు.

"నువ్వెప్పుడు మంచిగా మాట్లాడావు? మీరా పేరు చెప్పే సరికి వెక్కిరింతగా మాట్లాడ్తమే! ....అసలు నేను లేనప్పుడు మీరా వస్తే నువ్వేవో అనే వుంటావు. లేకపోతే యెందుకు రాదూ! మీరా, జ్యోతీ అంటే నీకు పడదు" అరుణ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

శేఖరం పిలుస్తున్నా వినిపించుకోకుండా అరుణ అక్కడనించి వెళ్ళిపోయింది.

అరుణ మాటలని బట్టి మీరా రాలేదని శేఖరానికి ఎప్పటికప్పుడు తెలుస్తూనే వుంది. ఇంక మీరా రాదా?—ఒకవేళ అరుణ వెడితే? యిన్నాళ్ళు రానందుకు ఏదో ఒక సాకు చెప్తుంది—యింక యిక్కడికి వస్తుందో రాదో! అయినా జ్యోతితో వెళ్ళటంగాని జ్యోతి యింటికి వెళ్ళటం కాని చేయకూడదు.

శేఖరం అరుణ గదిలోకి వచ్చేడు. అరుణ షెల్ఫ్‌లో పుస్తకాలు తీసి, మళ్ళీ నీట్‌గా సర్దుతోంది.

శేఖరం టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చుని దానిమీద వున్న పుస్తకాలు ఇటూ, అటూ తిప్పుతూ వుండిపోయాడు కాస్సేపు.

అరుణ ఏదేనా మాట్లాడుతుందేమోనని కాస్సేపు చూశాడు.

అరుణ ఏం మాట్లాడలేదు. మౌనంగా పుస్తకాలు సర్దుకోసాగింది.

"జ్యోతి వస్తానని చెప్పిందా, అరుణా!" అని అడిగాడు.

"లేదు."

"మరి ఇందాక అన్నావుగా!"

"వస్తుందనలేదు. వస్తే వెడతానన్నాను. చెప్పకుండా వెళ్తే నీకు కోపం వస్తుందేమోనని చెప్పాను" ఇటు తిరక్కుండా చెప్పింది.

కాస్సేపాగి అన్నాడు శేఖరం నవ్వుతూ "ఆవిడ రాకపోవటానికి నేనే కారణం అన్నావు యిందాక....ఆవిడ యిల్లెక్కడో గుర్తు చెప్పు వెళ్ళి తీసుకొస్తాను."

పుస్తకాలు సర్దుతున్నదల్లా టక్కున ఆగి యిటు తిరుగుతూ అంది అరుణ: "ఎందుకూ? పొడలగొట్టి ఈ వూరునించే తరిమివేయడానికా?"

"అరుణా!" ఆశ్చర్యంగా చూశాడు శేఖరం.

అరుణ మీరా రావట్లేదనే బాధతోనే అంటున్నా అన్నీ తెలిసి తన్నేదో నిలదీసి అంటున్నట్లుగా అన్పించిందతనికి? ఇంకోటి కూడా శేఖరం బాగా గుర్తించేడు. ఒక్క మీరా విషయంలో తప్ప యింకే విషయంలోనూ—తనకి యెంత నచ్చనిదయినా—అరుణ యింత కష్టంగా నిష్ఠూరంగా మాట్లాడదు.

"అదేమిటి అరుణా! ఆవిణ్ని యీ వూరునించి వెళ్ళగొట్టాల్సిన పని నాకేమిటి? నన్నేం చేసిందని!" అన్నాడు.

"నీకు మీరా అంటే పడదు. ఇది నేను మొదట్నించీ ఊహిస్తూనే వున్నాను. ఎందుకో అర్థంకాదు."

శేఖరం మాట్లాడలేదు. అక్కడే వున్న మీరా అరుణ కిచ్చిన టేబుల్‌లైట్‌ని చూస్తూండిపోయాడు.

"అలా అన్నానని కోపం వచ్చింది కదూ!" అంది అరుణ కుర్చీలో కూర్చుంటూ.

"కోపం ఎందుకూ?" నవ్వు తెచ్చుకుంటూ అన్నాడు శేఖరం.

అరుణ అంది. "ఏమిటో అన్నయ్యా! నాకూ మీరాకి అలా కలిసిపోయింది. తను రాక పోతే నాకు తోచదు. నీతో యెప్పుడూ మీరా గురించి చెప్పేదాన్ని కాదూ! ఎప్పుడూ తనే వచ్చేది. కబుర్లు చెప్పుకొనేవాళ్ళం. ఎప్పుడొచ్చినా చాలా సేపు వుండేది. మళ్లా ఏ నాలుగయిదు రోజులలో తనే వస్తూండేది. ఇంక నేను వెళ్ళడం ప్రశ్నే వుండేదికాదు... నీకు కోపం వస్తే క్షమిం చన్నయ్యా! మీరా యెందుకు రాలేదనే బాధలో—జ్యోతితో వెళ్తానన్నా వద్దన్నావనీ— మొదట్నించీ మీరా అంటే నువ్వు అదోలా మాట్లాడుతున్నావనీ అలా అనేశాను."

శేఖరం నవ్వేడు. "నువ్వు జ్యోతీ వాళ్ళింటికి వెళ్ళడం నా కిష్టంలేదు అరుణా! ఆ అమ్మాయి మంచిది కాదు... ....ఏం, జ్యోతి గురించి నీ ఫ్రెండ్ యేం చెప్పలేదా?" అని అడిగాడు.

"మీరా చెప్పింది! ఆ అమ్మాయి ఎలాంటిదయితే మనకేం? నాతో ఇంత వరకూ బాగానే మాట్లాడింది."

"ఒకసారి నా ఫ్రెండుని తీసుకెళ్ళి అవమానించేర్ట!....వాళ్ళలో మీరా కూడా వుందిట" శేఖరం అరుణకేసి చూడకుండానే అన్నాడు.

"ఎవరతను?" ఆశ్చర్యంగా అడిగింది అరుణ. మీరా చెప్పిన మాటలు గుర్తొచ్చి నవ్వొచ్చింది కూడా.

"నాకు తెలుసు."

"ఇదన్నమాట మీరా అంటే నీకు కోపం!" అంది అరుణ.

శేఖరం మాట్లాడలేదు.

"ఆ రోజు—అదే నా పుట్టినరోజు నాడు—నాకు మీరా చెప్పింది. మీరాకి వాళ్ళతో అంత స్నేహం లేదు. అనుకోకుండా ఆరోజు అక్కడుంది" అంటూ ఆ రోజు మీరా చెప్పిందంతా పూస గుచ్చినట్టు చెప్పింది అరుణ.

శేఖరం తెల్లబోయినట్లు చూస్తూండిపోయాడు.

"అసలు అంతక్రితం మీరాతో జ్యోతి అంతగా మాట్లాడేది కాదుట. ఆ రోజు అనుకో కుండా మీరా అక్కడున్నా మీరా కూడా తమతో కలిసిందని స్నేహంగా మాట్లాడటం మొద లెట్టిందట. మీరాకి అది నచ్చకే యెప్పుడో కాని వెళ్ళదు. ఆ రోజు నేను జ్యోతి యింటికి వెళ్దా మంటే కూడా మీరా యిష్టపడలేదు. మీరా వాళ్ళమ్మగారికి సాధారణంగా ఎక్కువగా స్నేహాలు చెయ్యడం ఇష్టంవుండదుట! అదివరకు రాణీ, ఇందిరా మీరాకి స్నేహితులు. ఇప్పుడు వాళ్ళిద్దరూ లేరు. యిప్పుడు మీరాకి నేనొక్కదాన్నే స్నేహితురాల్ని. నాకు మల్లేనే...."

ఇంకా అరుణ యేదో చెప్తూనే వుంది. శేఖరానికి యింకేం వినిపించటం లేదు. 'ఆ రోజు మీరా అనుకోకుండా తనకేం తెలియకుండానే అక్కడ ఒక పాత్ర వహించింది—మీరాకి అరుణ ఒక్కత్తే స్నేహితురాలు—జ్యోతి అంటే మీరాకి అంత యిష్టంలేదు—'

శేఖరానికి చాలా బాధనిపించింది.

ఇంకో నాలుగురోజులు చూద్దాం! తన గురించి అరుణ స్నేహం మానుకుంటుందా? అను



కున్నాడు శేఖరం.

ఏరోజు కా రోజు అరుణ "మీరా వచ్చింది" అని చెప్తుందేమోనని బయటకెళ్ళి రాగానే అరుణ గదిలోకి వచ్చేవాడు శేఖరం.

అరుణ దిగులుగా కూర్చునుండడంతో మీరా రాలేదని అతనికి అర్థమయిపోయేది.

రాఘవరెడ్డినుండి వుత్తరం వచ్చింది. అతను రెండు రోజుల్లో వస్తున్నట్లు రాశాడు. శేఖరం అరుణ దగ్గరకొచ్చి అన్నాడు "జ్యోతి వస్తే వెళ్తే వెళ్ళు అరుణా!.... జ్యోతి అంత మంచి అమ్మాయిలా కనపడ లేదు. అలాంటివాళ్ళ స్నేహం అంత మంచిది కాదన్న మాటకోసం అన్నాను."

అరుణ ఆశ్చర్యంగా అతన్ని చూసింది. అన్నగారు అదోలా కనిపించటంతో యింకేమీ అడగలేదు.

శేఖరం అక్కడినించి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి—

ఎంత సేపటికీ నిద్రరాక—పుస్తకం కూడా చదవబుద్ధి కాక లేచి కిటికీదగ్గర నిలబడ్డాడు శేఖరం.

మీరా గురించి అరుణ చెప్పేకా అతనికి చాలా బాధగా వుంది.

'తను ఎప్పుడూ ఏ విషయంలోనూ పొరపాటు పడలేదు—తొందరపడలేదు.

కాని, మీరా విషయంలో తను పొరపాటు పడ్డాడు—తొందరపడ్డాడు—

ఇన్నాళ్ళయినా మీరా రాలేదు—

ఒక్కసారి మీరా కనిపిస్తే బాగుండును.

అరుణ కోసమయినా రాదా?

ఒక్కసారి మీరా కనిపిస్తే—'

* * * *

రోజులు గడిచిపోతున్నాయి.

క్షణాలు యుగాలుగా గడిపేవారికి, రోజులు క్షణాల్లా కులాసాగా గడిపేవారికీ—వెనకటి జీవితంలో కోల్పోయిన వాటి గురించి చింతిస్తూ భారంగా రోజులు గడిపేవారికి—వాస్తవాన్ని పక్కకి నెట్టి జరగబోయేవాటి గురించి కలలుగంటూ, గాలిమేడలు కట్టేవారికీ ఒకే విధంగా—దేన్నీ లెక్కచేయని కాలం యధాప్రకారం శరవేగంతో పరుగెడుతోంది.

రోజులు వారాలుగా, వారాలు నెలలుగా—ఇలా ఓ సంవత్సరం గడిచిపోయింది.

ఎంతమందికి ఎన్ని జ్ఞాపకాలని మిగిల్చిపోయిందో!

ఎంతమందికి ఎన్ని అనుభవాల్ని నేర్పిపోయిందో!

ఎంతమందికి ఎన్ని బాధ్యతల్ని అప్పజెప్పి పోయిందో!

ఈ కాలం ఏమీ ఎరగనట్టు ఏమయినా చేయగలదు.

* * *

మీరా బాబుకి నీళ్ళు పోసి, పొడ రద్ది మీరాబాయమ్మగారి మంచం దగ్గరకి తీసుకొచ్చింది.

ఆవిడ లేచి కూర్చుంటూ, "నీళ్ళు పోసేశావా మీరా?" అని అడిగారు.

"ఆఁ, పోశాను బామ్మా!" అంటూ రబ్బరు బట్ట మంచంమీద పరిచి, దానిమీద బొంతా, ఇంకో బట్టా పరిచి బాబుని సున్నితంగా పడుకోబెట్టింది.

ఆ కళ్ళల్లో యెంత అపురూపమైన భావం! బాబుకి ఎక్కడ మెడ నొప్పెడుతుందోనని భయం. బాబు గట్టిగా ఏడిస్తే ఎక్కడ అలిసిపోతాడోనని భయం.

మీరానే తదేకంగా చూస్తున్న మీరాబాయమ్మగారు అడిగారు "అమ్మ యేం చేస్తోంది మీరా!"

"బొట్లో యేదో సవరిస్తోంది. అవన్నీ నేను చేస్తాను నువ్వు విశ్రాంతి తీసుకోమ్మా అంటే వినదు....నువ్వు చెప్పు బామ్మా! నువ్వు చెప్తే తప్పకుండా వింటుంది" మీరా బాబుకి బట్ట సరిగా కప్పుతూ తలెత్తకుండానే చెప్పింది.

మీరాబాయమ్మగారు నిట్టూర్చడం మినహా ఏం అనలేక పోయారు. ఆవిడ యిద్దరి బాధా అర్థం చేసుకున్నారు....కాని, ఓటు ఎవరికి అంటే అది—అది మీరాకేనని ఆవిడకి తెలుసు!

మళ్ళీ మీరానే అంది: "అమ్మకి మందు అయిపోయింది బామ్మా. డాక్టరు దగ్గరకి రమ్మంటే రాదు. పోనీ డాక్టర్ని ఇంటికి తీసుకొస్తానంటే ఒద్దే తీసుకురావద్దంటుంది."

"నేను చెప్తా లేమ్మా! నువ్వేం బాధపడకు" బాబు లేత బుగ్గలు సున్నితంగా పుణుకుతూ అన్నారావిడ.

మూడు నెలలు నిండబోతున్న బాబు ఒళ్ళు చేసి ముద్దుగా బొద్దుగా వున్నాడు.

మీరా బాబు చేయి తన చెంపకి ఆనించుకుని క్షణంసేపు కళ్ళు మూసుకుంది—తర్వాత అక్కడనించి వెళ్ళిపోయింది.

మీరా వెళ్ళినవైపే చూస్తూండిపోయారు బామ్మగారు. ఏమిటో ఈ మమకారాలు అనుబంధాలూను. మీరాని చూస్తే ఆవిడకి చాలా ఆశ్చర్యకరంగా అన్పిస్తుంది ఒక్కొక్కసారి.

కాంతమ్మ బాధ ఆవిడ అర్థం చేసుకున్నారు. ఎన్ని విధాల ఓదార్పు మాటలు చెప్పి కాంతమ్మకి నచ్చచెప్పాలని చూసినా ఆవిడ సమాధానపడలేక పోతోంది.

"దేన్ని చూసి ఇంక సమాధానపడమంటావ్ దొడ్డమ్మా! ఇంక జరగబోయే మంచేముం

దని! ఆ రోజే నా ప్రాణం తీసుకుంటే యెంత బాగుండేదీ?" చంటిపిల్లలా బామ్మగారి ఒళ్ళో తల దాచుకుని ఏడుస్తుంది.

"ఛ! అవేం మాటలు కాంతం! మీరాకి ఎవరున్నారు—దాన్నెవరు చూస్తారు" మందలింపుగా ఆవిడ అన్నదానికి, "నేనుండి ఏం చేశాను?" అంటుంది కాంతమ్మ.

"అలా అనకు: అన్నీ అవే చక్కబడతాయి. అమ్మాయి వింటే బాధపడుతుంది" అంటుందావిడ.

ఇలా ఇంచుమించుగా రోజూ జరిగేదే.

కాంతమ్మకి ఆరోగ్యం అంత బాగుండటంలేదు.

"ఆవిడకి ఒంట్లో యేం జబ్బులేదు" అంటుంది డాక్టరు.

కాస్త తెలుసున్నవాళ్ళు "పోయేవాళ్ళతో మనం పోతామా! ఉన్న పిల్లని చూసుకుని ఓ రాయి వేసుకోవాలి" అంటారు.

ఎలా ఎవరేనా అన్నప్పుడు కాంతమ్మకి వెర్రి బాధనిపిస్తుంది.

మీరా అక్కడనించి వెళ్ళిపోతుంది.

బామ్మగారు తల వంచుకుని కూర్చుంటారు.

ఈ ఉపాయం చెప్పింది బామ్మగారే. లేకపోతే సంఘం బ్రతకనివ్వదు. మీరా బామ్మగారి మీదుండే గౌరవంకొద్దీ—తల్లి క్షేమం గురించి ఈ మాటకి ఒప్పుకోక తప్పలేదు. అందరూ కాంతమ్మకి ఇంకో కూతురు ఉండేదనుకుంటున్నారు. బాబు ఆ కూతురు చనిపోతూ మిగిల్చిన రత్నమే అనుకుంటున్నారు.

మీరా స్నానం చేసి వచ్చేసరికి కాంతమ్మ వంట ప్రయత్నంలో వుంది. "నేను చేస్తానమ్మా! నువ్వెళ్ళు! అసలే ఒంట్లో నీరసంగా వుండి నువ్వెందుకు చేయడం" అంది మీరా.

"ఏం నీరసం లేదు" ఆవిడ పొయ్యిలో కట్టెలు లోపలికి తోస్తూ అంది.

"నువ్వు లేదంటే సరిపోయిందా? లే, వెళ్ళు! నేను చేస్తాను" అంటూ కూరలబుట్ట తీసుకోబోయింది మీరా.

"అబ్బ, నువ్వెళ్లు మీరా! వూరికే కూర్చుంటే నాకు పిచ్చెక్కుతోంది" ఆవిడ మామూలుగా అనాలనుకున్నా ఏదో విసుగూ, కోపం తోసుకొచ్చేయి.

మీరా ఇంకేం వాదించకుండా వచ్చేసింది. ఇంకేమన్నా ఆవిడ వినిపించుకోదు. చెయ్యడానికి కూడా ఇంకే పనీ లేదు. మీరా వచ్చి బామ్మగారి దగ్గర కూర్చుంది. "అమ్మ ఏం చేస్తోందమ్మా!" అని అడిగారావిడ.

"వంట చేస్తోంది. వద్దన్నా వినిపించుకోవటం లేదు." అంది.

బామ్మగారు మాట్లాడలేదు.

బాబు గుప్పెళ్ళు బిగించి నిశ్చింతగా నిద్రపోతున్నాడు.


"ఉయ్యాల్లో పడుకోబెట్టనా బామ్మా!" అంది మీరా.

"ఎందుకు పడుకోనీ! లేపితే నిద్ర చెడిపోతుంది."

నాలుగయిదు రోజులుగా అడుగుదామనుకుంటున్న మీరా ఇప్పుడు అడిగింది "బామ్మా! బాబుకి ఏం పేరు పెడదాం."

ఏదో ఆలోచిస్తూ పరధ్యాన్నంగా వున్న బామ్మగారు ఉలిక్కిపడ్డారు.

"ఏదో నువ్వే మంచిపేరు చెప్పు బామ్మా!" అంది మీరా మళ్ళీ.



మీరాకేసి ఆవిడ వాత్సల్యంగా చూశారు. మీరాలో ఈ ధైర్యం సడలకుండా ఇలాగే వుండేట్టు చేయమని ఆ భగవంతుడిని మనసులోనే వేడుకున్నారావిడ.

పరిస్థితుల ప్రభావంవల్ల కలిగే మొండి ధైర్యం కాకుండా బాబు మీదుండే అపారమైన ప్రేమాభిమానాలు వాత్సల్యమే మీరాని ఇంత ధైర్యంగా వుంచగలిగాయి.

అందుకే బామ్మగారికి మీరా అంటే మరింత అభిమానం ఎక్కువ.

"నువ్వు ఏం పేరు పెడదామనుకుంటున్నావు?" అడిగారావిడ.

"నువ్వే చెప్పు బామ్మా!....మంచి పేరు ఎన్నిక చెయ్!''

బామ్మగారు రెండు మూడు నిమిషాలు ఆలోచించి, "నేను కొన్ని పేర్లు చెప్తాను; నీకేది ఇష్టమో చెప్పు."

"ఏమిటవి?" ఆతృతగా అడిగింది మీరా.

ఆవిడ బాబుని ఆప్యాయంగా చూస్తూ "బాబుకి పేరు బాబంత అందంగా వుండాలి...."

బామ్మగారు పేర్ల కోసం ఆతృతగా, కుతూహలంగా ఎదురు చూడసాగింది మీరా.

"రాజశేఖరం, చంద్రశేఖరం, మురళీకృష్ణ, మోహన్‌కుమార్....''

మీరా ముఖం నల్లగా మాడిపోయింది. మీరా బామ్మగారు చూడకుండా చప్పున ముఖం తిప్పేసుకుంది.

గబ గబా చెప్పుకుపోతున్న బామ్మగారు మీరా ముఖం తిప్పుకోవటంతో "ఏం మీరా! ఇవి నచ్చలేదా?'' అని అడిగారు.

"ఇంకేవేనా చెప్పు!" ఎలాగో గొంతు పెగల్చుకుని అంది.

"విజయ్ కుమార్, విజయ్‌చంద్ర...."

"ఈ రెండింటిలో ఏది బాగుంటుందో చెప్పు బామ్మా!" కాస్త మామ్మూలుగా అవుతూ అంది మీరా.

"నీకే పేరు ఇష్టమో చెప్పు మీరా!" మీరా శిరస్సు నిమురుతూ అన్నారావిడ.

"నువ్వేది అంటే అదే నాకు చాలా బాగుంటుంది బామ్మా! నువ్వే చెప్పు"

"అమ్మని రానీ! అమ్మని కూడా అడుగుదాం."

ఖంగారుగా చూసింది మీరా "ఒద్దు బామ్మా! ఆపని మాత్రం చేయకు—ఇంక ఈ పూటకి మంచంమీంచి లేవదు'' అంది.

ఆవిడకది నిజమేననిపించింది.

కాస్సేపు ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

తర్వాత నెమ్మదిగా బామ్మగారన్నారు "విజయ్‌చంద్ర అంటే బాగుంటుందేమో మీరా! వీడి ముఖం చంద్రబింబంలా వుంటుంది...."

ఆవిడ మాట పూర్తికాకుండానే బాబు నిద్ర లేచేడు.

"ఆఁ, ఆఁ! నీ సంగతే చెప్పుకుంటున్నామురా బాబూ!" బామ్మగారు నవ్వుతూ అన్నారు.

మీరా బాబుని లేవదీస్తూ, "అవును బామ్మా! ఆ పేరే బాగుంటుంది....అమ్మకి మాటల్లో చెప్పు!" చివరి మాట చెప్పలేక చెప్పలేక చెప్పినట్టుగా అంది.

"అలాగేనమ్మా" అన్నారు బామ్మగారు.

మీరా బాబుకి పాలుపట్టి ఉయ్యాల్లో పడుకోబెట్టింది.

వాడు బోసినోటితో నిర్మలంగా నవ్వుతోంటే మీరా మైమరచినట్టుగా అలాగే చూస్తూండి పోయింది కొద్దిసేపు.

తర్వాత ఉయ్యాల దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చుని, చాలా నింపాదిగా అంది "నాకు పేరు నచ్చిందిరా! నిన్ను 'విజయ్' అని పిలవనా? 'చంద్ర' అని పిలవనా! ఊఁ! చెప్పమ్మా!"

బాబు అన్నింటికీ బోసినవ్వుతోటే సమాధానమిస్తున్నాడు.

"నేను 'విజయ్' అనే పిలుస్తాను. ఏం?....ఈ సంఘం ఎన్ని కారుకూతలన్నా కూయని, నువ్వేం పిరికివాడిలా భయపడకు. ధైర్యంగా నిలబడు. అందుకే నిన్ను 'విజయ్' అని పిలుస్తాను ఏం?"

మధ్యలో గొంతు భారంగా మారిపోయినా ఆవేశంగా ఏదో ఉపదేశిస్తున్నట్లుగా చెప్పింది మీరా.

విజయ్ కాళ్ళు చేతులూ చిత్రంగా ఆడిస్తూ, "ఊఁ" అన్నాడు.

మీరాకి వెర్రి ఆనందం కలిగింది. విజయ్‌ని చేతుల్లోకి తీసుకుని ఎగరేస్తూ "అదీ! అలా వుండాలి. మా విజయ్ బంగారుకొండ. విజయ సారథి...." ఇంకా ఏమేమో అంటోంది మీరా. అప్పటికి పాలుతాగి అట్టేసేపు కాలేదేమో మీరా అలా ఎగరవేయటంతో విజయ్ పాలు కక్కేశాడు. పాల మారింది కూడా. మీరా ఖంగారుపడిపోయింది. తను చేసిన తెలివితక్కువపనికి నొచ్చుకుంటూ, విజయ్‌ని ఒళ్ళో పడుకోబెట్టుకుని విజయ్ గుండెలమీద మునివేళ్ళతో సున్నితంగా రాయసాగింది.

విజయ్ కొంతసేపటికి తేరుకున్నాడు.

విజయ్‌ని ఉయ్యాల్లో పడుకోబెట్టి ఇవతలకి వచ్చింది మీరా. ఎవరో తలుపు తడితే వెళ్ళి తలుపు తీసింది మీరా. భాస్కరరావు వొచ్చేడు.

"బాగున్నారా అక్కా?" పలకరించేడు బావ.

"ఆఁ, రా!" అంటూ, "బామ్మా! బావ వచ్చేడు" అంది.

"ఇలా రమ్మను" ఆవిడ మాటల్లోనే బాచి ఆవిడ దగ్గరకి వచ్చేడు.

"ఏమిటి బాచీ కనపడ లేదూ!" అని అడిగారు.

"మావయ్యగారి వూరెళ్ళానండీ! ఇప్పుడే వస్తున్నాను; ఇంకా ఇంటికి వెళ్ళలేదు. వెళ్ళే ముందు కూడా మీకు కనిపించలేదని ఇలా వచ్చేనండి. పిన్నిగారికి ఒంట్లో ఎలావుందండీ? బాబు ఏడీ?" గబ గబా చెప్పేసి అడిగేశాడు. అతని మాటతీరే అంత.

బాచి మాట్లాడుతోంటే కాంతమ్మా, మీరా బాధలని మర్చిపోతారు.

ఊరికి చివరగా వున్న ఆ ఇంటికి బాచి ఒక్కడే అభిమానంగా నిజమైన ఆప్తుడిలా వచ్చి చూసిపోతూంటాడు. ఆ ఇంటికి కాస్త కాస్త దూరంలో నాలుగయిదు ఇళ్ళున్నాయి. అమ్మవారి గుడి వుంది.

ఆ నాలుగిళ్ళల్లో ఒకటి పూజారిల్లు. ఒకటి కంసాలిల్లు. ఒకటి కమ్మరి ఇల్లు. ఇంకోటి రిటైరయిన మాష్టారిది. మీరాబాయమ్మగారు ఆ వూరొచ్చి రెండేళ్ళయింది. ఆవిడ ఇంట్లోనే కృష్ణా రామా అనుకుంటూ కూర్చుంటారు. ఆవిడ ఆ వూరొచ్చిన ఏడాదికే మీరాని తీసుకుని కాంతమ్మ దిగులుగా దిగింది.

కాంతమ్మ ఎప్పుడూ ఎవరితోనూ పరిచయం పెంచుకోదు. అలాంటిది ఇప్పుడు ఇరుగు పొరుగువారితో కూడా మాట్లాడ్డానికి ఆవిడకి భయమే.

అందుకే ఆ యింట్లోవాళ్ళ సంగతులు ఎవరికీ ఏమీ తెలియవు.

ఆ నాలుగిళ్ళవాళ్ళు ఎప్పుడేనా వచ్చి కూర్చుంటారు.

మీరా విజయ్‌ని తీసుకొచ్చి బాచి కిచ్చింది.

అంతవరకూ బామ్మగారితో గడగడా మాట్లాడుతున్న బాచి ఇంక బాబుతో మొదలెట్టేడు.

"భోజనం చేద్దువుగాని లే బాచీ!" అంది కాంతమ్మ.

"ఎందుకండీ! ఇంటికెళ్ళిపోతాను" అన్నాడు బాచి.

"అమ్మాయి చెప్పింది. భోజనం చేసి వెళ్ళు. లే, కాళ్ళూ చేతులూ కడుక్కో—" బామ్మగారన్నారు.

"బాబుకి పేరు ఎప్పుడు పెట్టారండీ?" అని అడిగాడు బాచి మీరాకి బాబుని ఇస్తూ.

"విజయ్‌చంద్ర అంటే బాగుంటుందనుకుంటున్నాము. ఏం కాం...."

అప్పటికే కాంతం వినిపించుకోనట్టు వెళ్ళిపోయింది.

మీరా ముఖం చిన్నబోయింది.

బామ్మగారు నిట్టూర్చారు.

ఇదేం గ్రహించని బాచి "చాలా మంచిపేరండీ బామ్మగారు! ఏమని పిలవమంటారు? 'విజయ్' అనా, 'చంద్ర' అనా—పూర్తి పేరుతో పిలవమంటారా?" అన్నాడు.


వెంటనే తేరుకున్న మీరా "విజయ్ అనే పిలు" అంది.

బామ్మగారు కాంతమ్మని కేకలేసి ఆ సాయంత్రం డాక్టరు దగ్గరకి పంపేరు. డాక్టరు ఏవో మందులిచ్చి విశ్రాంతి తీసుకోమంది.

ఇంటికి రాగానే "డాక్టరేమన్నారు"? అని బామ్మగారు అడిగారు.

మీరా చెప్పింది.

మీరా అక్కడనించి వెళ్ళిపోయాక బామ్మగారన్నారు "మందు తీసుకుంటూ డాక్టరు చెప్పినట్టు విశ్రాంతి తీసుకో కాంతం. రోజు రోజుకీ ఎలా అయిపోతున్నావో చూడు."



కాంతమ్మ మాట్లాడలేదు.

"నీ ఆరోగ్యం గురించి మీరా ఎంత బెంగపెట్టుకుందో తెలుసా?"

"నాకేం ఫర్వాలేదు దొడ్డమ్మా! అందరి ఆయుర్దాయం భగవంతుడు నాకే యిచ్చాడు" ఆవిడ కళ్ళల్లోంచి రెండు కన్నీటిబొట్లు రాలి చేతిమీద పడ్డాయి.

"ఛ! అవేం మాటలు కాంతం! నిన్నిలా అనుకోవద్దని ఎన్నిసార్లు చెప్పాను? అసలే మీరా బాధపడుతోంది నువ్వు మందు సరిగా తీసుకోవట్లేదని, విశ్రాంతి తీసుకోవట్లేదని...."

"నా మాట అది వినదు కాని దాని మాట నేను వినాలా?" కోపంగా అందావిడ.

"ఒక్క పెళ్ళిమాటేగా మీరా వినంది? ఏం చేస్తాం చెప్పు! మీరాకి ఇష్టం లేందే చేసేం లాభం! మనసిక్కడ వుంటే అక్కడ కాపరం చేయగలదా కాంతం? నువ్వే చెప్పు! మీరాకి ఇష్టమయితే మనం చేసినా అందం చందం. వాడే తన ప్రాణంగా చూసుకుంటోంది."

కాంతమ్మకి దుఃఖమొచ్చింది. "నా కంటికి రెప్పలా కాపాడతానని చెప్పలేదా దొడ్డమ్మా! ఆ బాధ నాకు తెలియదూ! ఇప్పుడు దానికేం తెలియట్లేదు. ముందు ముందు ఎంతమందికి ఎన్ని విధాల సమాధానం చెప్పుకోవలసి వస్తుందో దానికేం తెలియట్లేదు."

కాంతమ్మ భుజంమీద చేయివేస్తూ బామ్మగారన్నారు "నీ బాధ నీది—దాని బాధ దానిది. ఇందులో ఎవరిది కాదనేట్టు—నీ బిడ్డ భవిష్యత్తు కోసం నీ ప్రాణం విలవిల్లాడుతోంది. దానిబిడ్డ దూరమౌతాడనే ఊహనే భరించలేదు మీరా........కాని ఒక్కమాట కాంతం! నేనిలా అంటున్నానని ఏమీ అనుకోకు. నీ బాధ మీరా అర్థం చేసుకుంది. ఆ బాధ పోగొట్టడం మీరాకి సాధ్యకానిది—దాని చేయి దాటిపోయింది. నువ్వు మీరా బాధని అర్థం చేసుకున్నా నీ స్వార్థం మీరా బాధని అర్థం చేసుకోనివ్వనుండా చేస్తోంది!"

"దొడ్డమ్మా!" గావుకేక పెట్టినట్టుగా అంది కాంతమ్మ.

"బాధపడకు కాంతం! నీమీద నాకు ద్వేషం లేదు. పరిస్థితులకి రాజీపడటం నేర్చుకో

మానేసింది. చేతివేళ్ళకేసి చూసుకుంటూ అలాగే వుండిపోయింది.

"నువ్వు బాధపడనంటే ఒక మాట అడుగుతాను మీరా!"

"అడుగు బామ్మా" తలెత్తకుండానే అంది మీరా.

"అదివరకోసారి అడిగాను. నువ్వు నాకేం చెప్పలేదు. అమ్మ దగ్గరకన్న ఎక్కువ చనువుగా నా దగ్గర మసులుతున్నావు. నా దగ్గర నీకు దాపరికం వద్దు—సంకోచించకుండా చెప్పు. నీ నూరేళ్ళ జీవితాన్నీ కాల రాచిందెవరు? ఈ ముసలిబామ్మ దగ్గర అబద్ధమాడకు. ఏం దాచకుండా చెప్పు తల్లీ! నీ జీవితం పూలబాట చేయడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తానమ్మా! నా మాట మీద నీకు నమ్మకం, విశ్వాసం లేవా, మీరా?" మీరా తలమీద చేయివేసి ఆప్యాయంగా అడిగారు బామ్మగారు.

దుఃఖాన్ని ఆపుకోవటానికి విశ్వప్రయత్నంచేసి ఓడిపోయింది మీరా. దోసిట్లో ముఖం దాచుకుంది.

ఎన్నాళ్ళగానో నిగ్రహించుకొంటూ వచ్చిన దుఃఖం కట్టలు తెంచుకుంది.

"మీరా నిన్ను బాధపెట్టటానికా—వూరుకో! నువ్వెంతో ధైర్యంగా వుంటావనుకొంటే ఇదేమిటి? వూరుకోమ్మా!"

కొంతసేపటికి మీరా సర్దుకుంది.

"నామీద కోపం వస్తోందా,మీరా?"

"నీ మీద నాకు కోపమా బామ్మా! అసలు నాకెవరిమీదా కోపం రాదు."

"పోనీ ఇది చెప్పు! నా మాటమీద నమ్మకముందా?"

"నమ్మకమే కాదు; చెప్పలేనంత గౌరవం, భక్తి వున్నాయి బామ్మా!"

"మరి నేను అడిగినదానికి ఇలా దాటేస్తావేం తల్లీ! నేను అర్థం చేసుకొంటానన్నానుగా!"

"............................"

"ఏం మీరా! నీ కిష్టం లేకపోతే నేనింకేం అడగను."

"హుఁ! నేనేం చేశానని చెప్పను బామ్మా! నాకేం తెలియదు" మీరాకి చాలా ఆవేశం వచ్చింది. ఆవేదన కలిగింది. ఖచ్చితంగా తన అభిప్రాయం చెప్పకపోతే తను మర్చిపోదామనుకున్నవి మరువనీయకుండా చేస్తారు. అందుకే అంది మళ్ళీ "విజయ్ పుట్టుకకీ నా పుట్టుకకీ ఏమిటి తేడా? అమ్మ నమ్మి మెళ్ళో పసుపుతాడు వేయించుకుంది. నేనెవర్నీ నమ్మలేదు. మెళ్ళో పసుపుతాడు వేయించుకోలేదు. ఆ పసుపుతాడు నా మెళ్ళో లేకపోవడమే నేరమా? అమ్మని ఏదో అంటున్నానని అనుకోకు బామ్మా! అమ్మ ధైర్యంగా ఎప్పుడూ నలుగురిలో తిరగలేదు; నన్ను తిరగనీయలేదు. ఎవరేం అడుగుతారోననే భయంవల్లనే కదా? వివాహం అయినా ఎందుకు భయపడింది? నమ్మి మోసపోయింది...." మీరా గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. "అమ్మ నా బాధ, ఆవేదనా ఎందుకు అర్థం చేసుకోదో తెలియదు. నా గురించి తనకెలా బాధ వుంటుందో నాకలా కాదా...." ఇంక మాట్లాడలేకపోయింది మీరా.

"ఛ! వూరుకోమ్మా! నా తల్లివిగా! నీ బాధా అర్థం చేసుకున్నాను. అమ్మ బాధా అర్థం చేసుకున్నాను. మీరు కాక ఇంక నాకెవరున్నారు చెప్పు! మీ రిద్దరూ నా రెండు కళ్ళూ అయితే విజయ్ నా పంచప్రాణాలూను. వూరుకో అమ్మకి నేను చెప్తాగా."

బామ్మగారి ప్రేమపూరితమైన మాటలతో మీరా తొందరగా తేరుకుంది. మీరా ఇంకా అలాగే కూర్చోవటం చూసిన బామ్మగారు "వెళ్ళి పడుకో మీరా! పొద్దుపోయింది" అన్నారు.

మీరా వెళ్ళిపోయింది.

బామ్మగారికి ఎంత ప్రయత్నించినా నిద్ర రాలేదు.

కాంతమ్మకి ఎలాగయినా నచ్చచెప్పాలి అనుకున్నా రావిడ. ఇంక ఈ విషయాలు కదిపి మీరాని బాధించకూడదని కూడా అనుకున్నారు.

ఎంతో నిబ్బరంతో ధైర్యంగా వున్న మీరాని ఖంగారు పెట్టటమే అవుతుందనిపించింది ఆవిడకి. మీరా మొదట్నించీ చెప్పినవి ఆవిడేం మర్చిపోలేదు. ఆనాడు మీరా అన్నమాటకి కాంతమ్మ మూడు రోజులు మంచం దిగలేదు. ఆ విషయం బామ్మగారు మర్చిపోలేదు.

ఓ చెంప నొప్పులతో బాధపడుతున్నా తనకి పుట్టిన బిడ్డని ఎక్కడ మాయం చేస్తారో నని మీరా ఎంత ఖంగారుపడిందీ, ఎంత గొడవ చేసిందీ ఆవిడ మర్చిపోలేదు. కడుపు తీపి ఎక్కడికి పోతుంది? అయినా మీరాని చూస్తే ఆవిడ కేమిటో చాలా చిత్రంగా అన్పిస్తుంది.

మీరా ఇక్కడ కొచ్చినప్పుడు ఎంత స్తబ్దుగా వుండేది?

ఆ రోజులు నిన్న మొన్నట్లా అన్పిస్తున్నాయి బామ్మగారికి.

* * *

మీరా పరిస్థితికి గుండెలు పగిలిపోయి మీరాని తీసుకుని బామ్మ దగ్గరికి వచ్చింది కాంతమ్మ.

అసలు విషయం చెప్పకుండా బామ్మగారి కాళ్ళదగ్గర కూలబడి గొల్లున ఏడ్చింది. కాంతమ్మచేత అసలు సంగతేమిటో చెప్పించేసరికి బామ్మగారికి తల ప్రాణం తోకొచ్చినంత పనయింది.

మీరా స్తబ్దుగా తన విషయం ఏం కాదన్నట్టు కూర్చుండిపోయింది.

మీరా లేకుండా కాంతమ్మ చెప్పింది. "మీరా నాకేం చెప్పటం లేదు దొడ్డమ్మా! నువ్వే అడిగి తెలుసుకోవాలి. ఎలా అడుగుతావో ఏమో! అది గట్టెక్కకపోతే నేను బ్రతకలేను."

బామ్మగారు ఎన్నివిధాల బుజ్జగించి అడిగినా ఒకటే సమాధానం "నాకేం తెలియదు. నాకేం తెలియనప్పుడు నేనేం చెప్పను!" అని.

మనిషేమన్నా 'షాక్' తిందా అన్పించింది మొదట బామ్మగారికి.

మళ్ళీ అది కాదనిపించింది.


బామ్మగారు నాలుగు రోజులు అడిగినా మీరా ఏం చెప్పకపోవటం చూసి కాంతమ్మ విరుచుకు పడింది. "నా మాట లెక్కలేనప్పుడు ఇంక నేనెందుకు? ఈ బాధకి నేను తట్టుకోలేను ఏదేనా మింగి చస్తాను." కాంతమ్మ ఏడవటం మొదలెట్టింది.

కాంతమ్మ ఇంక హైదరాబాదు వెళ్ళనంది.

మీరా మనసులో ఏముందో ఎవరికీ తెలియదు. తల్లి ఏమన్నా మౌనంగా వుండిపోతుంది. కాంతమ్మ యింక హైదరాబాదు వెళ్ళననటంతో వయసు పైబడుతున్నా వంట్లో ఓపికలేకపోయినా మీరానీ కాంతమ్మనీ తీసుకుని మద్రాసు చేరుకున్నారు బామ్మగారు.

రోజులు గడుస్తున్నకొద్దీ కాంతమ్మ గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. బామ్మగారితోటీ తల్లితోటీ ఏం మాట్లాడలేకపోయినా ఇంట్లో ఏదో ఒక పని కల్పించుకుని గిరగిరా తిరిగే మీరా ఓ రోజు స్తబ్దుగా కూర్చుండిపోవటంతో కాంతమ్మ ఖంగారుపడింది. బామ్మగారు నింపాదిగా అడగగా "ఏమిటోలా వుంది" అంది మీరా. ఆపూట ఆహారం కూడా సరిగా తీసుకోలేక పోయింది. బామ్మగారికి అర్థమయిపోయింది.

సోంతి



ఒక్కొక్కరి ఆలోచనలు ఒకోరకంగా వున్నాయి.

మీరాని డాక్టరు పరీక్షచేసి గంటలో డెలివరీ అవుతుందని చెప్పింది. అంత బాధలోనూ మీరా బామ్మగారి చేతులు పట్టుకుని ఖచ్చితంగా చెప్పింది. "బామ్మా! ప్రాణంతో వున్నా లేక పోయినా అ పుట్టిన బిడ్డని నేను చూడాలి—లేకపోతే నేననేదాన్ని వుండను. నన్నెవరూ ఆపలేరు........"

బామ్మగారు చప్పున మీరా నోటిమీద చెయ్యి వుంచుతూ, "ఛ! ఏం మాటలమ్మా మీరా అన్నీ సవ్యంగా జరుగుతాయి. ధైర్యంగా వుండాలి" అన్నారు. అక్కడే వున్న కాంతమ్మకి నవ నాడులూ కృంగిపోయినట్టయింది.

ఈ అయిదారు నెలలనుండీ ఆవిడ తల బ్రద్దలయేలా ఆలోచించి ఆలోచించీ ఒక నిర్ణ యానికి వచ్చింది. దాంతో కాస్త మనసు కుదుటపడింది. ఆ ఆశని కూడా ఇప్పుడు మీరా తుడిచి పారేసింది. కూతురు తనకన్నా ఎక్కువ ఆలోచనలతో వుందని ఆవిడ ఇప్పుడే గ్రహిం చింది. మీరాకి పుట్టిన బిడ్డని ఏ అనాథ శరణాలయంలోనన్నా ఇచ్చేసి మీరాకి బిడ్డచచ్చిపోయి నట్టు చెప్పాలనుకుంది. ఒక నర్సుకి డబ్బు ఆశ చూపి మాటాడింది కూడా.

కాని మీరా అభిప్రాయాలు ఆవిడకి తెలియవు.

క్రితం జన్మలో తను ఏ పాపం చేసుకుందో—ఈ జన్మలో తన జీవితం ఇలాయింది. తను ఏ పాపం చేయకపోయినా ప్రకృతిసిద్ధంగా ఆ పాపం తన మీదనే ముద్రించబడింది— మధ్య పుట్టబోయే బిడ్డ ఏ పాపం చేసింది? ఇంకో ప్రాణిని ఈ సంఘానికి భయపడి అవస్థపాలు చేయాలి? తను ఎలాగు పెళ్ళి చేసుకోదు. తను ఇలా అని తెలిసి—చూస్తూ చూస్తూ ఎవరూ చేసు కోరు. అన్నీ కప్పెట్టి చేస్తారు. పెళ్ళి గురించి తన సుందరమైన స్వప్నం కూకటి వేళ్ళతో కూలి పోయింది. ఇప్పుడు ఈ పాపం చేసి వచ్చే జన్మకి ఇంకా పాపాన్ని మోసుకు వెళ్ళలేడు. బ్రతికి బయటపడితే—చేయని తప్పుని జీవితాంతం భరిస్తుంది. క్రితం జన్మలో చేసిన పాపం ఈ జన్మతో సరిసమాప్తి అయిపోవాలి....తను ఎన్నుకుంది! మంచి మనసున్న వాణ్ని పెళ్ళి చేసుకుని తల్లి శేషజీవితమన్నా హాయిగా నిశ్చింతగా తన నీడలో ఆవిడ సంతోషంగా గడిపేలా చేయాలనుకుంది.

(సశేషం)

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

పిల్లతెమ్మెర

నవులూరి వెంకటేశ్వరరావు

"దాని సంగతి తెలీదు మీకు. ఈ ఉద్యోగం గురించి ట్రయల్స్‌లో వున్నపుడు ఆఫీసు కొచ్చింది. రామ్మోహనుకు తనను పరిచయం చేసుకుంది. నాలుగున్నరకు వాడు ఇంటికెళుతుంటే కొంతదూరం వెంటబడిందట వగలు కురిపిస్తూ. గురుడు తెలివైనోడు కదా తప్పించుకో గలిగాడు."

"ఊహూఁ."

"ఊహూఁ కాదు. ఇది పచ్చి నిజం. నాల్రోజులు పోతే అన్ని విషయాలూ తెలుస్తాయి **మీకే.**"

హాల్లో ఆ చివర్సీటు ఆమెది. ఈ చివరిది తనది. తన పక్కనే శేషగిరి. వివరాలు చెబుతున్నది అతనే. అతన్ని వదిలించుకోవాలని వుంది. కానీ యెలానో తెలీలేదు. అతనితో యెక్కువ పరిచయంలేదు. చెబుతున్నది వినకుండా ఫైలులో తలదూర్చితే యేమన్నా అనుకుంటాడేమో.

ఇంతలో వాడొచ్చాడు.

"శ్రీపతిగారు పిలుస్తున్నారండి."

అప్పారావు. పదహారు సంవత్సరాలుంటాయి. పదమూడు, పధ్నాలుగేళ్ళవాడిలా కనిపిస్తాడు. గారపట్టిన పళ్ళు. బండ చెముడు. మొన్నటిదాకా వెనకవైపు పీపుదాకా, ప్రక్కల చెవులమీద నించి భుజాలదాకా పెరిగి అట్టలు కట్టిన జుత్తుండేది. నాల్రోజులుగా ఈ బొద్దు బిక్షువు అవతారం.

ఒక యెక్స్క్యూజ్ మి చెప్పి సీట్లోనించి లేచాడు.

శ్రీపతి, తనూ కాఫీకి బయలుదేరారు. క్రీవాల్‌తో బూడిదరంగు క్రేన్స్ రొద చేస్తున్నాయి. నాలుగయిదు నౌకలలో లోడింగ్ అన్లోడింగ్ జరుగుతున్నాయి.

కష్టమ్స్‌వాళ్ళు, పోర్టు సిబ్బంది, ఇండస్ట్రియల్ సెక్యూరిటీవాళ్ళు, పనిచేసే లేబరర్స్.... గందరగోళంగా వుంది డాక్ ఏరియా. ట్రాన్సిట్ షెడ్డులలో నేలపాలయిన గోధుమ గింజలు, సిమెంటు.

క్యాంటీన్ కిటికీలోంచి అన్నీ దర్శనమిస్తున్నాయి.

"వాడ్ని కనుక్కున్నానండి. ఒక్క గదీ వందరూపాయలు చెబుతున్నాడు" శ్రీపతి.

"భరించలేం."

"మరో యిద్దరికి చెప్పేలేండీ—చూస్తామన్నారు. పోనీ ఆ గది ఖాళీచేసి నా గదికి వచ్చేయండి. అంతవరకూ యెలాగో సర్దుకోవచ్చు."

"పర్లేదండి. అనవసరంగా మీకు అసౌకర్యం."

క్యాంటీన్ చాలా అసహ్యంగా వుంది. శుభ్రం అన్న మాటకు తావులేదు అన్నట్లు, నేలంతా ఖాళీ లేకుండా కాగితాలు, సిగరెట్, బీడీ చుట్టల ముక్కలు, దుమ్ము. నడుంచుట్టు ఉండనా మాననా అన్నట్లున్న మాసిన టవల్‌తో "టీ మాష్టర్." బొమ్మలాంటి కదలిక. శరీరం మీద మరో నూలుపోగు లేదు. చంకలలో పెరి


గిన, ఛాతీనిండా యేపుగా వున్న వెంట్రుకలు అసహ్యాన్ని కలిగిస్తున్నాయి. వేళ్ళకు పొడవుగా పెరిగిన గోళ్ళు మట్టిని దాచుకుని వున్నాయి. ఆ వేళ్ళనే నాలుగయిదు గ్లాసులలో ముంచి టీ, కాఫీలు అందిస్తున్నాడు.

ఆఫీసుకు తిరిగొచ్చేసరికి పదకొండు గంటలవుతుంది. 'మెయిన్ ఆఫీసుకు' అని మూవ్‌మెంటు రిజిష్టరులో వ్రాసి నలుమూలలకు వెళ్ళిపోయిన కారణంగా హాలంతా ఖాళీగా వుంది. నలుగురయిదుగురు మిగిలారు. ఆఫీసు జనాభా తిరుగుళ్ళను అరికట్టటానికి ఆ రిజిష్టరు పెట్టారు. అది యే విధంగానూ ఉపయోగపడటంలేదు. అందులో 'మెయిన్ ఆఫీసు'కు అనో, 'డిస్పెన్సరీకి' అనో, వ్రాసి వెళ్ళిపోతారు పూటలకు పూటలు.

ఆమె, అతను లోకాన్ని మరిచి మాట్లాడుకుంటున్నారు. సుబ్బారావు న్యూస్ పేపరు తీసి "ఓపెన్ పేజ్" చదువుతున్నాడు. శ్రీనివాసరావు, చలపతి షిప్పులలో సంపాయించిన ప్లేబాయ్ యు.అయి, పెంట్ హౌస్ మ్యాగజీన్స్ చూస్తున్నారు.

సరైన పని తనకు యింకా కేటాయించలేదు. చిల్లర మల్లర పనులు చేస్తున్నాడు. అంతా కొత్త. ఊరు కొత్త, పనిచేసే ఆఫీసు కొత్త; వాతావరణం కొత్త. కాకపోతే మనస్తత్వాలు పరిచితాలు! ఎక్కడికెళ్ళినా తారసపడేవి, విశ్వజనీనత వున్నవి.

గంటన్నర పని చేసేసరికి లంచ్‌టయిం.



శ్రీపతి దగ్గరకు వెళ్ళాడు. ఇద్దరు డైనింగ్ హాలులోకి చేరారు.

డైనింగ్‌హాల్ రేకుల షెడ్. మనుషులు భోంచేస్తుంటే కుక్కలు బెంచీలక్రింద, టేబిల్స్ క్రింద దూరుతుంటాయి. ముఖ్యంగా ఒక గుడ్డి కుక్క వుంది. ఎవరో రాయితో కొడితే కుడి గుడ్డుగాజు బుడగలా పేలిపోయింది. ఎర్రగా మాంసం కనిపిస్తుంది కనుగుడ్డు వుండవలసిన చోట. ఎంత తోలినా ఈ కుక్క పోదు. కొట్టబోతే పళ్ళు చూపిస్తూ మొరుగుతుంది. భోంచేసే వాళ్ళకు కుక్కలు ఫర్నిచర్‌లా డైనింగ్ హాలులో ఒక భాగమైపోయాయి. పట్టించుకోవడం మానేశారు.

నేలమీదపడ్డ మెతుకులు కుక్కలపాలయితే క్యారేజిలో మిగిలిన ఎంగిలి మెతుకులు అప్పారావువి. వాడి చేతిలో పింగాణి బొచ్చె. ద్వేషం అంటే తెలీనట్లు కనిపిస్తాడు. దుఃఖం అంటనట్లు అనిపిస్తాడు. ఎప్పుడూ పళ్ళికిలిస్తూ వుంటాడు పలకరింపుగా. మనిషిలో ఎంతో అణకువ. ఊగుతూ నడుస్తాడు.

వాడి తల్లి తన మూడో మొగుడితో వుంటోంది. మొదటి భర్త రైల్వే స్లీపర్లు దొంగతనం చేస్తూ ఆర్పీయఫ్ కాల్పులలో చనిపోయాడు. రెండోవాడు సంవత్సరం కాపురం చేసి వదిలేశాడు. మూడవవాడు పిల్లాడ్ని వదిలేస్తేగాని తనతో వుండనీయనంటే వాడిని (పిల్లాడిని) బయిటకి వెళ్ళగొట్టింది.

అరగంటలో సీట్లకు తిరిగి వచ్చారు. ఫైళ్ళలో మునిగి తేలేసరికి సాయంకాలం అయింది. హాలంతా ఖాళీ అయిపోయింది నాలుగున్నరకు అయిదు నిముషాలు ముందుగానే. శ్రీపతి తన సీటు దగ్గరకు వచ్చాడు. పోదామా అన్నాడు. ఇద్దరూ కలసి రోడ్డు దగ్గరకు వచ్చేసరికి చల్లటి గాలి.


"నమస్కారమండీ" గరపళ్లు ఇకిలిస్తూ వాడు-అప్పారావు. వాడిచుట్టు మరి ముగ్గురు కుర్రాళ్లు: పద్నాలుగేళ్ళ పిల్ల. మాలచ్మి అని పిలుస్తారు దాన్ని మావాళ్ళు. పైట వెయ్యాల్సిన అవసరరం వున్నా ఆ పిల్ల ఒంటిమీద అది లేదు.

హార్బరు గేటు దగ్గర విపరీతమైన జనాభా. మంగళ శుక్రవారాలలో హార్బరు చూడనిస్తారు. ఈరోజు శుక్రవారం. గేటు కెదురుగా చెట్టు, ప్రక్కనే పోలీస్ స్టేషన్. చెట్టుక్రింద అయిదున్నర అడుగుల నల్లరాతి విగ్రహంలాంటి, ముక్కున ఎర్ర పుడక వున్న ఆడమనిషి మజ్జిగ అమ్ముతుంది. రంగునీళ్ళ బండి కొంచెం ముందుగా. హార్బరుగోడ పొడవున పదిహేను యిరవై రిక్షాలు. వాళ్ళు మామూలు బేరాలకై అంత బాధపడరు. "సిప్పు" లోంచి ఒక్క "దొర" దొరికితే చాలు అని చూస్తారు. పది, పదిహేను ఎంతైనా దొరకవచ్చు. మీడియం ఆఫ్ కమ్యూనికేషన్ ఇంగ్లీషు అని పిలవబడేది. తెల్ల తోలువాడుగాని, తారు నలుపు తోలువాడుగాని షిప్పులోంచి గేటు దాటితే—వాంట్ మార్కెటింగ్? ఫకింగ్? కమాన్.... టేక్యూ అంటూ వెంటబడతారు. రెండవదైతే (సాధారణంగా, వారాల కొలది సముద్రంమీద ఆకలితో గడిపినవాళ్ళకు అదే అవసరం) రిక్షావాళ్ళకు మరి రెండు డబ్బులు దొరుకుతాయి. వాళ్ళ వృత్తికి సంబంధించినవాళ్ళే అప్పారావు, మిగతా కుర్రాళ్ళు. అప్పారావుకి పగలంతా ఆఫీసువాళ్ళ చిల్లర మల్లర పనులు చేయడానికి, డైనింగ్‌హాల్లో అడుక్కోడానికి సరిపోతుంది. సాయంకాలంపూట ఈ వృత్తి. "దొర"లని "బుక్" చేసుకోలేకపోతే వాళ్ళెక్కిన రిక్షాను వెంబడించి మైలు దూరమైనా పరిగెత్తి అడుక్కుంటారు. దొరికే ఫారన్ కరెన్సీని పక్కనే వున్న బ్యాంక్‌లో మార్చుకుంటారు.

మర్చంట్ నేవీ క్లబ్‌దగ్గరున్న బస్టాపులో నిలబడ్డారిద్దరూ. ఆమె విషయం కదిపాడు తను శ్రీపతితో. ఇంకొకళ్ళ విషయాలలో ఆసక్తి మానవ బలహీనత. అయితే ఈ వారం రోజులుగా తను చూసిన వ్యక్తుల మాటలు బట్టి వాళ్ళలో కేవలం మిగతావాళ్ళ విషయాలలో ఆసక్తికాక సమాజానికి తమకు యేదో

రచయిత గురించి

ఆరేళ్ళనుంచి కథలు వ్రాస్తున్నాను. వ్రాసినవి చాలా తక్కువ-ఇరవై కూడా వుండవు. బహుమతి రావడం ఇది రెండవసారి. మొదటిసారి ఆంధ్రజ్యోతి వారు 1977 దీపావళి కథల పోటీలో "పొగమంచు"కు ఒక ప్రత్యేక బహుమతి ఇచ్చారు.



విశాఖపట్నం పోర్టు ట్రస్టులోని స్టోరు డిపార్టుమెంటులో స్టెనోగా వుద్యోగం. వివాహం అయింది. ఒక ఆర్నెల్ల అమ్మాయి (భావన) వుంది. ఈ సర్వసామాన్య విషయాలకన్న చెప్పుకోడానికేమీ లేవు.

ద్రోహం జరుగుతున్నట్లు వాళ్ళు భావిస్తున్నట్లు కనిపించారు. తరిచిచూస్తే ఆ తపన కేవలం అసూయకు, ఈర్ష్యకు ముసుగు అనిపించింది.

"మీరు విన్నది నిజమే. కొంత మీ కంటితోనే చూశారు కదా. క్రితం సంవత్సరం జరిగింది. తంగవేలు అని వుండేవాడు. ఏదో షిప్పింగ్ ఏజన్సీలో పనిచేసేవాడు. వయస్సు ముప్పై అయిదు వుంటుంది. బట్టతల ఎప్పుడు చూసినా ఏదో మాట్లాడుకుంటూ కనిపించే వాళ్ళు. అంతులేని విషయాలు. అవేవో వాళ్ళకే తెలియాలి. స్కూటర్ మీద రెండు మూడుసార్లు ఆమె దగ్గరకు వచ్చేవాడు రోజు. సాయంకాలాలు కలిసే గడిపేవాళ్ళు.

"ఆ రోజు బాగా గుర్తుంది నాకు. నేనూ, భానుమతి ఒకే సెక్షనులో వుండేవాళ్ళం. పన్నెండు గంటల టయిం అయివుంటుంది, ఎవరో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. కాస్త బయటికి వస్తారా మీతో మాట్లాడాలి అన్నారు. గుమ్మందాటి నిలబడింది. వాళ్ళేదో చెప్పేరు. అంతే. విరుచుకు పడిపోయింది. అందరం కలిసి టేబుల్ మీదికి చేర్చాం. మొహాన నీళ్ళు కొట్టా. రెండు మూడు నిముషాలకి తేరుకుంది. ఈలోపల ఏం జరిగిందో వాళ్ళని అడిగాం. చెప్పేరు. తంగవేలుకు పక్షవాతం వచ్చిందట.

అతని గదికి మకాం మార్చింది. రెండు మూడు నెలలు శలవు పెట్టింది. సంవత్సరం పాటు అతనితో గడిపింది. ఆ తర్వాత అతను చనిపోయాడు.

ఇప్పటి వ్యవహారం రెండు మూడు నెలల నించి జరుగుతోంది."

బస్సొచ్చింది. కానీ ఆగలేదు. లేడర్ మీద కూడా జనం. ఫుట్‌బోర్డ్సుమీద పాతికమంది వుంటారు. బస్ వాళ్లు ఎక్కలేదు. బస్ వాళ్ళని లాక్కుపోతోంది. బస్సు లోపల మాత్రం కనీసం పదిహేనుమంది పట్టేంత ఖాళీ.

"నడుద్దాం. బస్సు దొరికేలోపల నడిచే వెళ్ళచ్చు"

లక్ష్మీటాకీసు వైపు నడక. మురిక్కాలువ దాటాలి. ఎవరు పెట్టారో దీనికి లవెండర్ కెనాల్ అని. దానిమీద వున్న వంతెన హౌరా బ్రిడ్జి. దానిపైనించి కన్వేయర్ గ్యాలరి. దాని క్రింద గుడిసెలు. లవెండర్ కెనాల్ చుట్టూ అవే. మెయిన్ రోడ్డు ఎక్కారు. అది రోడ్డు అని పిలవబడే సందు. ఈ వూరి జనానికి సాయంకాల వేళల్లో అదే షాంజెలిజె! దాన్ని వెడల్పు చేయించబోయిన ఒక ప్రభుత్వ భగీ

రధుడు రెండోరోజు బదిలీ చేయించబడ్డాడు.

హోటల్‌లో కాఫీ టిఫిన్ చేసి శ్రీపతి గదికి చేరారు. ఒక గంట చెస్ ఆడిం తర్వాత బాల్కనీలోకి కుర్చీలు లాగాడు శ్రీపతి.

"మానవతా విలువలు క్షీణించిపోతున్నాయి. మనిషి తోటి మనిషితో సమాధానపడలేక పోతున్నాడు. మనుష్యుల మధ్య ద్వేషం పేరుకుపోతోంది. దయార్ద్రత ఆరిపోతోంది. మనిషి ప్రాణానికి విలువ నశించిపోయింది. కాలం చెల్లిన నీతులని పట్టుకుని వ్రేలాడు తున్నాం. ఈనాడు ఏది నీతి ఏది కాదు, దేన్ని పట్టించుకోవాలి, దేన్ని పట్టించుకోగూడదు అన్న ప్రశ్నలు వేధిస్తున్నాయి" అన్నాడు తను అంతకు ముందు గంటనించి రాజ్యమేలుతున్న నిశ్శబ్దాన్ని పారద్రోలుతూ.

ఒక నిముషంపాటు మౌనంగా వున్నాడు శ్రీపతి. తను అన్న మాటలు విన్నట్లు అని పించలేదు. అప్పుడు గొంతు సవరించుకున్నాడు అన్నాడు—

"భానుమతి విషయం తీసుకుందాం. ఆమె ప్రవర్తనవల్ల మరొకరికి జరిగే నష్టం ఏమీ లేదు. మనిషికి అనేక దైహిక అవసరాలు న్నాయి, కోరికలున్నాయి. వాటినించి పారి పోవడానికి కుదరదు. భానుమతి ఒంటరిది. మానవుడికి ఒంటరితనం కూడా ఒక వేధించే సమస్య. ఆయనెవరో అన్నట్లు మానవుడి అనేక చర్యలు ఒంటరితనంనించి పారిపోవ డానికి చేసే ప్రయత్నాలలానే అనిపిస్తాయి. ఇంట్లో మరొక తోడులేని స్త్రీ మరొకరి సాన్ని హిత్యాన్ని కోరుకోడం తప్పుకాదు. అందునా, శారీరక అవసరం తీర్చుకోవాలి. ఆకలిలాంటిదే సెక్సూనూ. సెక్సు పరమైన 'అవినీతి'ని భరించలేం.

"సంవత్సరంపాటు ఎలాంటి ఫలాపేక్ష లేకుండా పక్షవాతం వాడితో గడిపింది. తనకు కావలసింది అందిపుచ్చుకుని అతన్ని వదిలి వేయొచ్చు. అలా చేయలేదు. అదీ నీతి. వాడు చచ్చిపోయ్యాడు. మళ్ళీ ఒంటరి జీవితం, దైహిక అవసరం, ఇంకొకరికి చేరువయింది. సమాజానికిగాని, దేశానికిగాని దానివల్ల నష్టం లేదు. వాళ్ళ జీవితంతో జోక్యం కలగజేసు కోవడం ఒకవిధమైన అవినీతి."

ఇద్దరూ సిగరెటు తాగుతున్నారు. ఒకరి మొఖం మరొకరి ...గుపడటం లేదు. ఒకరి కొకరి సిగరెట్లు మాత్రం కనిపిస్తున్నాయి. పొగ లోపలికి పీల్చినప్పుడు ఎర్రటి వెలుగు. చీకటి రక్తంలా—అప్పుడు మొఖాలు కని పిస్తున్నాయి. నగరమంతా వున్నట్లుండి సద్దు మణిగినట్లనిపించింది. ఎవరో అన్నట్లు నగరం తనలో దనొదిగిన తాబేలులా వుంది.

"వ్యక్తికి పరిమితమైన 'నీతి'ని ఆ వ్యక్తికే వదిలేయాలి. దాని విషయం పట్టించు కోకూడదు. సమాజంపట్ల మన బాధ్యతలని మనం నెరవేర్చడం వైపు మొగ్గు చూపాలి. మానవతా విలువల్ని గురించి ఆలోచించాలి."

* * *

అప్పారావు తల్లి అదే అన్నారెవరో. కిటికీ లోంచి చూస్తే ఆమె కనిపిస్తోంది. అంత పొడవూ పొట్టీ కాదు. కొద్దిగా మాసిన తెల్లచీర నల్ల జాకెట్టు. నలభై సంవత్సరాలు దగ్గిర పడుతున్నాయి. బలమైన మనిషి. కోపంగా చేతులు ఆడిస్తూ మాట్లాడుతోంది. ఏం మాట్లాడుతున్నదీ సరిగా వినపడటం లేదు. ఒక నిమిషం గడిచిన తర్వాత అప్పారావు మెడపట్టుకుని నడుం వంచి మూడు గుద్దులు గుద్ది వెళ్ళిపోయింది కోపంగా.

కూర్మాచారి గదిలోంచి వరండాలోకి వెళ్ళి అప్పారావుగాడ్ని పిలిచాడు.

"ఏంట్రా మీ యమ్మ కొడుతోంది నిన్ను"

"ఇంకేముందండీ. డబ్బులు కావాలంట."


"నువ్వొద్దుగాని, నీ డబ్బులు మాత్రం కావాలి?"

"ఎన్ని డబ్బులయినా చాలవండీ మా యమ్మకి."

సమాచారసేకరణ తర్వాత గదిలోపలకి వచ్చాడు.

"కాంతూ, వీడెమ్మ మంచి ఎట్రాక్టివ్ పెర్సనాలిటీ హోయ్—వెల్‌బిల్ట్"

"ఆడ కుక్కమీదయినా నీ కన్ను పడటం



మానదు కదా. ఎందుకట వచ్చింది?"

"మామూలేగా, నెలకొకసారి రావడం, వీడికి నాలుగు వడ్డించటం, గోళ్ళూడగొట్టి డబ్బులు రాల్చుకుపోవడం."

రోజులు గడిచిపోతున్నాయి. ఊరు పాతబడి పోతోంది. శ్రీపతికి తనమధ్య సన్నిహితం ఎక్కువవుతోంది. భానుమతి రమణారావుల ప్రేమవ్యవహారంలో కొత్తదనం లేదు.

ఆరోజు మామూలుగా మధ్యాహ్నం డైనింగ్ హాల్‌కు వెళ్ళాడు. ఒక టేబుల్ మీద అప్పారావుగాడు పడుకుని మూల్గుతున్నాడు. జ్వరం. అయిదారుగురు చుట్టూ మూగి వున్నారు.

"ఏమిటి కథ? ఏమయింది."

"ఏముందండి. మామూలు కథే, సిఫిలిస్సో గనేరియావో. నెలకూ రెండు నెలలకు వెధవకి అలవాటయి పోయింది."

"ఎక్కడిది కెళ్ళావురా వెధవ?" ఎవరో అడిగారు.

"హౌరాబ్రిడ్జికి— ఇంకెక్కడి కెళతాడు? ఏ అద్దురూపాయి ముండ దగ్గరకో వెళ్ళి కొని తెచ్చుకున్నాడు."

"డిస్పెన్సరీకి పోరా వెధవ."

భోంచేయలేకపోయాడు సరిగా. పది నిముషాల్లో వచ్చాడు తిరిగి. క్రమ క్రమంగా అందరూ భోజనాలు ముగించుకుని తిరిగి వచ్చారు ఆఫీసుకు. ఇప్పుడు కాలక్షేపం కావాలి జనాలకి.

"అనకాపల్లి రోడ్డుమీద చూశా ఇద్దరినీ మొదటిసారి. ఒక కిలోమీటరు రాయి దగ్గరున్నా రిద్దరూ. వాడు స్కూటర్ బాగు చేస్తున్నాడు. అది ఆ రాయిమీద కూర్చుని వుంది. అది మొదలు అందరికీ తెలిసిపోయింది వ్యవహారం. బొత్తిగా ఈమధ్యే బరితెగించారు."

"అసలు నెల్లూరెక్కడ ఈ వూరెక్కడ? ఆ మూలనించి ఈ మూల కొచ్చిందంటే అక్కడ ఎన్ని గ్రంథాలు నడిపిందో ఎవరికి తెల్సు?"

చలపతి సీట్లోంచి లేచాడు. హెల్మెట్, కళ్ళజోడు పెట్టుకుని బయిటికి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

"ఇంక బాబుగారు సాయంకాలమేనా దర్శన

మిచ్చేది? నాలుగూయిరవై అయిదుకి ఆఫీసుకు ముఖం చూపించి వెళ్ళండి" వెటకారంగా అన్నాడు కృష్ణారావు.

"మొన్న తమరు చేసిందేమిటో? ఒంటి గంటకొచ్చి, అటెండన్సు రిజిష్టరులో తొమ్మిది న్నర మార్కు చెయ్యలా?...." అన్నాడు చలపతి.

నోట మాట రాలేదు కృష్ణారావుకు. సెక్షనులో, సగంరోజు శలవుపెట్టానని కోశాడు ఆఫీసుకు రావడం ఒకపూట లేటవటంవల్ల. 'ఈ వెధవ రిజిష్టరు తనికీ చేశాడన్నమాట. వీడెవడు అసలు?"

చలపతి వెళ్ళిపోయాడు.

తనవైపు చూస్తూ అన్నాడు కృష్ణారావు గొంతు తగ్గించి. "చలపతిగాడు దాని గురించి పెద్ద చెబుతున్నాడుగాని వీడి భాగవతమేమిటో తెలుసా? వీడి స్నేహితు డున్నాడ్లేండి సన్నగా ఈకలా, పొడవుగా వుంటాడు. వాడు వీడు పెళ్ళాలతో వీడి యింట్లో నెలకు రెండుసార్లు కలవటం వైఫ్ స్వాపింగ్ చేసుకోడం...."

కృష్ణారావు, కూర్మాచారి చాలా క్లోజ్‌గా వుంటారు. కూర్మాచారి అన్నాడు: "ఒరే కృష్ణా యెవడిమీదో ఒకరిమీద పడడం ఎందు కురా. స్కాండల్స్ లేవదీయడం మంచిది కాదు వోయ్" ఆ మాటలు కృష్ణారావుని ఇంకా ప్రొవోక్ చెయ్యడానికి వుద్దేశించబడ్డాయని తేలికగా తెలుసుకోవచ్చు.

యూరినల్స్‌కి వెళ్ళొస్తానని రూమ్‌లోంచి బయిటికి వచ్చాడు. టాయిలెట్ దుర్గంధ భూయిష్టంగా వుంది. గోడలు మొదలుకొని ఎక్కడ ఖాళీవుంటే అక్కడల్లా వుచ్చలతో తడిసిపోయి వుంది. నీటి సౌకర్యంలేదు. పోయకుండా వుండటం కష్టం. పోయడం మహా కష్టం. బయిటికి వస్తుంటే కూర్మాచారి ఎదురయ్యాడు ముక్కుపొడుం పీలుస్తూ.


"చూశారా! ఒకళ్ళమీద యింకొకళ్ళు ఎలా ఏడుస్తున్నారో? వాడేదో పెళ్ళాం మార్పిడికి పాల్పడతాడని యేడుస్తున్నాడుగాని వీడు నీతి మంతుడా? టెండర్ సెక్షన్‌లో వుండగా ఏదో కొటేషన్ మ్యానిపులేట్ చేయకపోతే పెద్ద గొడవై యీ సెక్షన్లోకి మార్చివేసిన గోవిందు నీతిమంతుడా?"

సాయంకాలం శ్రీపతితో ఈ విషయాలు కదిలిస్తే అన్నాడు: "ఇక్కడ పని చేస్తున్న వేల జనాభాలో యెవర్ని కదిలించినా మరొకడి గురించి యెన్నైనా విషయాలు తెలుస్తాయి. తమది తప్ప మిగతావాళ్ళ ప్రవర్తన బాగుండాలని కోరుకుంటారు. కూర్మాచారి స్టేషనరీ ఇంచార్జి కదా, మూడోవంతు స్టేషనరీ తిరిగి బజార్లో యెలా అమ్ముడుపోతుందో కాంతారావుని కదిలిస్తే చెబుతాడు. నిలేసి అడిగితే కూర్మాచారి అంటాడు ఆఫీసు జీపులు ఆఫీసర్ల పెళ్ళాల్ని మార్కెటింగ్‌కి, సెకండ్ షో సినిమాలకి చేరవేయడానికి, ముండలని తార్చడానికి యెలా వుపయోగపడుతున్నాయో చెబుతాడు. కొందరు డ్రైవర్లు పెట్రోలు కల్తీ చేసి మిగిలినదాన్ని ఎట్లా అమ్ముకుంటున్నారో చెబుతాడు. దీనికి అంతులేదు. దేశంలోని అవినీతి గొలుసు కట్టుకథకి లింకులు వీళ్లు."

సాయంకాలం శ్రీపతిని వెళ్ళిపొమ్మన్నాడు తను. ఆఫీసులో వుండిపోవాలి. నాలుగున్నరకు వెళ్ళడానికి వీలుకాదు. పార్లమెంట్‌లో వేసిన 'స్టార్డ్' ప్రశ్నకు వివరాలు సేకరించాలి. మిగతా తతంగం చాలా వుంది. ఇంటికెళ్ళడం లేటవుతుంది. ముగ్గురు మిగిలారు. నాలుగున్నరకు బయటికెళ్ళి ఒక దొక్కు టీ కొట్టులో టీ త్రాగి వచ్చి పనికి పూనుకున్నారు.

రాత్రి పదవుతుంది పని పూర్తయేసరికి. ఆఫీసు తలుపు వేయించి వెలుపలికి వచ్చారు ముగ్గురూ. వరండాలో చీకట్లో దిగులుగా పడుకునివున్న గజ్జికుక్క. మసకవేసిన వెన్నెల. మెయిన్‌గేటు దాటి నడుస్తున్నారు. ఎక్కడా అంత జనసంచారం లేదు. ఆస్పత్రిలోని దీపాల వెలుగు—బాధలా. ఏదో కిటికీదగ్గర నిలబడి యెవరో దిగులుగా మసక వెన్నెల్లోకి చూస్తున్నట్లు భ్రాంతి. సీమన్స్ క్లబ్ దాటి నాలుగడుగులు వేశారు. అంతే. ఏదో గొడవ జరుగుతోంది.

"పోతుల్లా వున్నారు లంజకొడుకులు."



"తినేది మరేంటి—గొడ్డు మాంసం—గొడ్డులా బలవడే."

"ఈనాకొడుకులకి గిత్తల కొట్టినట్టు కొట్టి చిప్పెక్కించాలి."

"ఏం జరిగిందసలు?"

"ఏం జరుగుతుందండీ. మదమెక్కిన మనుషులు పశువులతో సమానం. పశువులా వూరి మీద పడితే యేమవుతుంది?"

"అప్పటికీ అది ఒకడి చెయ్యి కరిచింది. ఒకడయితే పర్లేదు. ఇద్దరూ. ఏం చేస్తుంది?"

ఎడమచేతివైపే మైదానం వుంది. అందులో ఒక చిన్న రేకుల షెడ్, బహుశా ఆడవాళ్ళు బట్టలు మార్చుకోడానికి కట్టింది. అక్కడే జరిగింది.

కొరియన్ షిప్పులోంచి ఇద్దరు దిగివస్తున్నారు ఊళ్ళోకి. ఈ ఊరు కొత్తకాదు. శరీరాలలో మండే మంటలాంటి కోరికకి ఆజ్యంలా మధువు తోడయింది.

చలికోత. రిక్షావాళ్ళని వదిలించుకుని పరిచితమైన రోడ్డున పడ్డారు. నడుస్తుండగా—

అప్పారావు తదితరులతో తిరిగే పత్నాలు గేళ్ళపిల్ల 'మాలచ్మి' "గివ్ మి మని:...." అంది.

ఒకత్తే మిగిలింది. తోటి పిల్లలు లేరు. కడుపులో ఆకలి. ప్రాణం లేసొచ్చింది వాళ్ళని చూడగానే. ఆహారం దొరికినట్లనిపించింది.

"గివ్ మి మని" వెంటబడింది.

ఈసారి తేరిపార చూశారు. చీకటిగా ఉంది. ప్రాణం లేసొచ్చింది. ఆహారం దొరికినట్లనిపించింది. చుట్టూ చూశారు. అదొక్కతే ఆ చీకట్లో మానవాకారం. సైగలు చేశారు చేత్తో. షెడ్డు దగ్గరకు రమ్మన్నారు. వయసుకిమించిన అనుభవం వుంది, లోకజ్ఞానం వుంది. రానంది. గడ్డం పట్టుకుని బ్రతిమలాడుతున్నట్లు రమ్మన్నాడు. వదిలించుకుని వెళ్ళబోయింది. ఒకడు, రెండు చంకలలోనించి ఎడమచేయి పోనిచ్చి రెండో చేత్తో నోరు మూశాడు. రెండవవాడు కాళ్ళు పట్టుకొన్నాడు. షెడ్డుదగ్గరకు మోశారు.

అదే సమయంలో "దొర"లతో ఊరంతా తిరిగి వస్తున్నాడు అప్పారావు డైనింగ్ హాల్ వరండాలో పడుకోవడానికి. గొడవ చూసి కేకలేశాడు. ఒకడి చెయ్యి కరిచాడు. వాడు వీడి గొంతు పిసికి కొనప్రాణంతో వదిలాడు. వీలుచిక్కినంతవరకు అరిచి పడిపోయాడు అప్పారావు. ఇంతలో జనం మూగారు. వాణ్ణి ఆసుపత్రికి మోసుకెళ్ళారు. వాళ్ళిద్దర్ని పోలీస్ స్టేషన్‌కి అప్పగించారు.

జనం పల్చబడిపోతున్నారు. తనూ కదిలాడు. ఉక్కపోతున్న వాతావరణంలోనించి అప్పుడప్పుడూ వీచే పిల్లగాలి మరొకసారి వీచింది. సిగరెట్ ముట్టించాడు. □

హనీమూన్

జోతిగుంట రామచంద్రమూర్తి



అయిదయింది....

ఆఫీసులోంచి బయట కొచ్చిన మోహన రావు కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు. జేబులో వున్న చిన్న దువ్వెన తీసి తల దువ్వుకున్నాడు. ఆ తర్వాత ప్యాంటు జేబులో చేతులు పెట్టుకున్నాడు. కుడి జేబులో వున్న రూపాయల కట్ట చేతికి మెత్తగా తగిలింది. బొచ్చుకుక్కపిల్ల తలను నిమిరినట్లు ఆ రూపా

యల కట్టను ఓసారి ఆప్యాయంగా నిమిరేడు జేబులోనే.

ఎదురుగా వున్న హోటల్లోకి నడిచేడు. కానీ ఏమీ తినాలనిపించలేదు. అదేం విచిత్రమో కానీ, తాను చాలాసార్లు గమనిస్తూనే వున్నాడు.... జేబులో పుష్టిగా డబ్బున్నప్పుడు ఏమీ తినాలనే అనిపించదు. డబ్బులకు కొరత ఏర్పడినప్పుడే జిహ్వా చాపల్యం మరీ మితి మీరుతుంది.

అందుకే అన్నారు కాబోలు—'దరిద్రుడికి ఆకలెక్కువా డబ్బున్నవాడికి ధైర్యం ఎక్కువా' అని.

ఎలాగా హోటల్లోకి వచ్చినందుకు, కేవలం గ్లాసుడు మంచినీళ్ళు తాగి వెళ్ళిపోతే మర్యాదకు భంగమని కప్పు కాఫీ తాగి బిల్లు చెల్లించాడు. ఇంటికి వెళ్ళే దారిలో పది రూపాయలు పెట్టి స్వీట్లు కొన్నాడు. ఓ రెండు రూపాయలు పెట్టి మల్లెపువ్వులు కొన్నాడు.

ఇంటికి చేరగానే హాల్లో ఎదురయిన అమ్మ చేతిలో ఆ స్వీట్స్ ప్యాకెట్ పెట్టేడు మోహనరావు.

మల్లెపువ్వుల్ని మాత్రం జాగ్రత్తగా తన గదిలో దాచిపెట్టి— ఆ రాత్రి భోజనాలయ్యాక, తన దగ్గరకు వచ్చిన నీరజ చేతికి అందించాడు. మళ్ళీ వాటిని భర్త చేతిలోనే పెట్టి తాను వెనక్కి తిరిగి నిలబడింది నీరజ.

"ఇవాళ మాకు బోనస్ ఇచ్చారోయ్" అన్నాడు మోహనరావు, ఆ మల్లెచెండును తన భార్య తలలో పెడుతూ.

"అలాగా! ఎంతిచ్చారూ?" వుత్సాహంగా అడిగింది నీరజ.

మోహనరావు చెప్పేడు.

"రేపు ఆఫీసుకు సెలవు పెట్టేను. మనిద్దరం రేపు మధ్యాహ్నం షాపింగ్‌కి వెడదాం. నీకు ప్రెజెంటేషన్ ఏం కావాలో కోరుకో; కొంటాను. ఆ తర్వాత హోటల్లో టిఫిన్ తిని 'ఫస్టు షో' సినిమాకి వెడదాం.... సినిమా అయ్యేక హోటల్లోనే భోంచేసి ఇంటికొద్దాం" భార్య నడుం చుట్టూ చేతులు బిగించి మీదకు లాక్కుంటూ అన్నాడు మోహన్‌రావు.

"నాకేం ప్రజెంటేషన్ అక్కర్లేదులెండి" చిరుకోపం ప్రదర్శించింది నీరజ.

నీరుకారిపోయాడు మోహనరావు.

"అదే మీ ఆడవాళ్ళతో వచ్చింది; మొగుడు సరదాగా వున్నప్పుడు, ఆ సరదాలో పాలు పంచుకోవాలనీ, హుషారుగా వుండాలనీ అనుకోరు; నిప్పులమీద నీళ్ళు చల్లినట్లు ఆనందాన్ని ఆర్పిపారేస్తారు" సిగరెట్ వెలిగించుకుని చిరు విసుగు ప్రదర్శించేడు.

"అవును; ఎంతసేపూ మీ సరదాల్లో పాలుపంచుకోవటం — పట్టెమంచం దగ్గరకు పాలగ్లాసుతో తయారవటం—మీ సరదాలు తీర్చటం—ఇవి తప్ప మా సరదాలు మీకేం పట్టవ్." నిష్ఠూరంగా అన్నది నీరజ.

"నీ సరదా నేనేం కాదన్నాను చెప్పు?"

"మన పెళ్ళయి రెండేళ్ళు కావస్తోంది.... ఈ రెండేళ్ళనుంచీ 'హనీమూన్‌కి వెడదామండీ' అని, కనీసం ముప్పయి మూడుసార్లయినా అడిగేను. తీసుకెళ్ళేరా?.... డబ్బుంటే శలవు దొరకదు....శలవు దొరికితే డబ్బుండదాయె; రెండూ కలిసొస్తే మరో అవాంతరం. మా శ్యామల్ని పెళ్ళి చేసుకున్న మూడో రోజునే వాళ్ళ మొగుడు, మైసూరూ ఊటీ తీసుకెళ్ళేడు ఇంచక్కా!" మంచంమీద, భర్తకి దూరంగా జరిగి కూర్చుంది.

మోహన్‌రావుకి విషయ యేమిటో అర్థమైంది.

నిజమే!

అసలు తమ పెళ్ళయిన నాలుగో రోజునే భార్యను తీసుకుని ఢిల్లీ వెడదామనుకున్నాడు తను. కానీ సరిగ్గా అప్పుడే వాళ్ళ నాన్నకి గుండెపోటు రావటం, ఆస్పత్రిలో ఎడ్మిట్ కావటం, బోలెడంత ఖర్చు కావటం జరిగేయి. ఎలాగో యిరవై రోజులు ఆస్పత్రిలో వున్నాక—తిరిగి క్షేమంగా ఇంటికొచ్చేడాయన. ఆ తర్వాత రెండు మూడుసార్లు— వెళ్ళాలని ప్రయత్నం చేసినా ఏదో ఒక ఆటంకం రానే వచ్చింది.

తన మరదలు శ్యామలకి యీ మ ధ్య నే పెళ్ళయింది....పెళ్ళయిన మూడో రోజునే, శ్యామలా, వాళ్ళాయనా, హనీమూన్ పేరుతో హాయిగా పదిరోజులు తిరిగివచ్చేరు.

నీరజ కూడా అలాంటి ముచ్చట తీర్చుకోవా లనే కోరిక కలగటంలో ఆశ్చర్యం యేముం టుంది? అసలు అంతవరకూ యెందుకూ? పెళ్ళి కాని క్రితం తనమటుకు తాను ఎన్ని ముచ్చట్లు తీర్చుకోలేదూ? పైగా యింట్లో తల్లీ, తండ్రీ, తమ్ముడూ, చెల్లెలూ ఇంతమంది ఉండటంతో-ఓ సరసమాడుకోవటానికీ—ఓ సరదా తీర్చు కోవటానికీ సరైన అవకాశమే దొరకదాయె! అన్ని పనులూ యాంత్రికంగా జరిగి పోతూంటే, యిక జీవితంలో థ్రిల్లేముం టుందీ?....

అలా అయిదారు నిముషాలు సీరియస్‌గా ఆలోచించిన తర్వాత మోహన్రావ్ ఒక నిర్ణ యానికి వచ్చాడు.

"ఆల్ రైట్! రేపే మన ప్రయాణం'.... గెట్ రెడీ!" అన్నాడు, హుషారుగా భుజం తట్టి....

నీరజ కళ్ళు ఆనందంతో మెరిసేయి.

అప్పుడు కానీ ఆ గదిలో 'బెడ్ లైట్' వెలగలేదు.

హనీమూన్‌కి వెడుతున్నట్టు యింట్లో చెప్ప టానికి కొంచెం యిబ్బంది పడ్డాడు మోహ న్రావు....తిరుపతిలో గల ఫ్రెండ్ పెళ్ళికి వెడు తున్నట్టుగా కోసి, ఆ మర్నాడు పొద్దున్నే భార్యతోసహా రైలెక్కేడు.

సాయంత్రం నాలుగయ్యేసరికి యిద్దరూ విజయవాడ చేరుకున్నారు. అక్కడ ఓ మంచి హోటల్లో ఆ రాత్రి గడిపి మర్నాడు మదరాసు వెళ్ళాలని అతని ఉద్దేశం!

కానీ వాళ్ళకి హోటల్లో 'రూం' దొరకటమే గగనమయిపోయింది. ఒకటి రెండు హోటల్లో కనీసం—'సింగిల్‌రూం' కూడా ఖాళీ లేక పోయింది. మరో రెండు మూడు చోట్ల డబుల్ రూములువున్నా -మ కివ్వటానికి వాళ్ళెందుకో సందేహిస్తున్నారనే అనుమానంకూడా వచ్చింది మోహన్రావుకి.

అలా తిరగ్గా తిరగ్గా చిట్టచివరకి—ఓ హోటల్లో—

"ఓ గంటసేపు వెయిట్ చేస్తే డబుల్‌రూం ఖాళీ అవుతుంది....ఇస్తాం!" అన్నారు. ఆ గంటసేపూ పడిగాపులు గాయక తప్పలేదు.

మొత్తానికి రాత్రి ఏడయ్యేసరికి ఆ రూంలో సెటిలయ్యేరు మోహన్‌రావూ నీరజా!

"ఇవాళ రాత్రి అసలు మనం నిద్రపోవ టానికి వీల్లేదు .... హాయిగా కబుర్లు చెప్పు కుందాం!" అన్నాడు మోహన్‌రావు వేణ్ణీళ్ళ స్నానం చేసివచ్చేక లుంగీ కట్టుకుంటూ.

నీరజ మాట్లాడలేదు. భర్తవైపు కొంటెగా చూసి చిలిపిగా నవ్వింది. ఆమె చూపులోనూ, నవ్వులోనూ కనిపించిన మత్తుతో, అంతకు ముందు 'రూం'కోసం తాను పడిన శ్రమనంతా మరచిపోయేడు మోహన్రావు.

మరికొంతసేపటికి నీరజకూడా స్నానంచేసి వచ్చింది. తెల్లటి వాయిల్‌చీర తీసి కట్టుకుంది. జడ వదులుగా అల్లుకుని అంతకుముందు స్టేషన్లో కొనుక్కున్న మల్లెపూల దండ తీసి జడలో తురుముకుంది.

అంతవరకూ బెడ్ మీద పడుకుని భార్యవైపే తదేకంగా చూస్తున్న మోహన్రావుకి—ఆ క్షణాన, ఆమెలో ఏదో కొత్త ఆకర్షణ కని పించి పులకింపచేసింది. ఫేనుగాలి వల్ల, ఆ గదినిండా వ్యాపించిన మల్లెపూల పరిమళం అతని ఊహలకి పదును పెట్టింది.

చటుక్కున లేచి—భార్యదగ్గరకు వచ్చేడు. ఆమె ముఖాన్ని తన రెండు చేతుల్లోకి తీసు కుని—పెదాలమీద ముద్దు పెట్టుకున్నాడు.


నీరజ ఉక్కిరిబిక్కిరయింది.

"ఛీ....పాడు! అన్నింటికీ తొందరే!" విది లించుకుంటూ అంది.

"తొందర కాదు! స్వేచ్ఛ! ఇంట్లో అయితే యిలాంటి అవకాశం యెలాగా దొరకదు!" అంటూ బజర్ నొక్కేడు.

బోయ్ వచ్చి నిలబడ్డాడు.

"తొందరగా వెళ్ళి ఓ హాఫ్ బ్లాక్‌నైట్



విస్కీ తీసుకురా! రెండు మీల్స్ కూడా!" ఆర్డరిచ్చి; వాడి చేతిలో మూడు పదినోట్లు పెట్టేడు.

బోయ్ వెళ్ళిపోయేడు.

"విస్కీ ఎందుకూ?" భర్తవైపు కొత్తగా చూస్తూ అనుమానంగా అడిగింది.

"తాగటానికి!"

ఆ జవాబు విన్న నీరజ కళ్ళల్లో క్షణంసేపు భయంలాంటిది మెదిలింది.

"మీరు తాగుతారా?" అడిగింది.

"ఎప్పుడైనా!.... మన పెళ్ళి కాని క్రితం, నేను కొంతకాలం మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేశానులే! అప్పట్లో క్యాంప్‌కి వెళ్ళినపుడు, అప్పుడప్పుడు తాగేవాణ్ణి! ఆ తర్వాత ఆ ఉద్యోగాన్ని వదిలేయటంతో ఆ ఛాన్సూ పోయింది."

"తాగటం కూడా ఛాన్సే నేమిటి? సిగ్గు లేకుండా ఇంకా చెప్పుకుంటున్నారు!"

"అవకాశం వచ్చినప్పుడు తాగటంలో తప్పు లేదన్నారు!"

"ఎవరూ అలా అన్నది?"

"సుబ్రమణ్యం అనీ, నా ఫ్రెండొకడుండేవాడు! నే నెప్పుడు తాగినా వాడే నాకు తోడు! అయినా ఒక్కణ్ణూ బిక్కు బిక్కుమంటూ కూర్చుని, దొంగచూపులు చూస్తూ తాగాలంటే బోర్!....'కంపెనీ' వుంటేనే బాగుంటుంది! యెంతసేపయినా హాయిగా కబుర్లు చెప్పుకుంటూ తాగచ్చు!" సిగరెట్ వెలిగించుకుంటూ చెప్పేడు మోహన్రావ్.

"మరి మీకిప్పుడు తోడెవ రొస్తారో?.... ఆ బోయ్‌గాడ్ని కూర్చోబెట్టుకుంటారా పక్కన?" కోపంగా అడిగింది నీరజ.

"నువ్వున్నావుగా!" బెడ్ మీద ఆమె పక్కనే కూర్చుంటూ అన్నాడు.

త్రుళ్ళిపడింది నీరజ.

"నేనా!...." భయంగా చూసింది భర్త వైపు.

"అవును! ఏం భయంలేదు....చాలా బాగుంటుంది. లైట్‌గా తీసుకుందువు గాని!" తాపీగా సిగరెట్టు పొగ వదుల్తూ అన్నాడు.

"నేను మాత్రం చస్తే తాగను!" బెడ్ మీద నుంచి లేచిపోయి దూరంగా వున్న కుర్చీలో కూర్చుంది.

మోహన్‌రావ్ నవ్వుకున్నాడు.

మరికొన్ని నిమిషాలకు బోయ్ 'మీల్స్' తీసుకొచ్చాడు. విస్కీబాటిల్ కూడా బల్లమీద

పెట్టి వెళ్లిపోయేడు.

ఓ గాజు గ్లాసులో కాస్త విస్కీ పోసి—నిండా నీళ్ళు నింపేడు మోహన్రావు. భార్య ముందు ప్రతాపం చూపిస్తున్న వీరునిలా దాన్ని రెండుగుక్కల్లో తాగేశాడు. ఖాళీ అయిన గ్లాసులో మళ్ళీ—మరి కాస్త విస్కీ పోసుకుంటూ—

"నువ్ భోజనం చేసెయ్—" అన్నాడు.

అంతవరకూ భర్తను నిశితంగా గమనిస్తున్న నీరజ—

"ఏం—మీరు భోంచెయ్యరా?"— అని అడిగింది.

"ముందీ మందు! ఆ తర్వాతనే విందు! అదీ ప్రొసీజరు" మళ్ళీ మరో సిగరెట్ వెలిగించేడు మోహనరావు.

"మీరిలా తాగుతారని తెలిస్తే అసలు ఈ హనీమూను ప్రసక్తే తేకపోయేదాన్ని!" నిష్ఠూరంగా అంది నీరజ.

"నువ్ మరీ అలా ఫీలయిపోవడం నాకేం నచ్చలేదు నీరూ! ఇపుడేమయిందని అంత సీరియస్సయిపోతావ్? స్వేచ్ఛ దొరికినప్పుడు హాయిగా యిలా ఎంజాయ్ చెయ్యటంలో తప్పేముందీ? ఎప్పుడో చాలాకాలం క్రితం తాగేను. మళ్ళీ ఇప్పుడు తాగాలని అనిపించింది. దట్సాల్! అంతమాత్రంచేత నేనేం తాగుబోతునయిపోను....అయినా తాగిం తర్వాత ఎంత బాగుంటుందో నీకు తెలీదు....అందుకే నిన్ను కూడా కొంచెం తీసుకొమ్మని రిక్వెస్టు చేస్తున్నాను....ఇది ఓ టానిక్....తెలుసా?....తాగిన తర్వాత ఆకలి బాగా పుడుతుంది. మన పల్లెటూళ్ళలో చంటిపిల్లలకి ఉగ్గు ఎలా పోస్తారో ఫారెన్ కంట్రీస్‌లో చిన్నపిల్లలకి ఈ 'మందు' అలా పోస్తారట....అంతవరకూ ఎందుకూ! మన దేశంలో ఎంతోమంది లేడీస్ కూడా తాగుతారు. సినీమాల్లో యాక్టుచేసే ఆడవాళ్ళెందరో తాగుతారట. సుబ్బరమణ్యం చెప్పేడు."

తాగిన మందు కొంచెం తలకెక్కటంతో మోహన్‌రావుకి ఉపన్యాస ధోరణి మొదలయింది.

"ఇందులో కొంచెం ఇపుడు నువ్ కూడా తాగాలి" విస్కీ వున్న గ్లాసులోకి, మళ్ళీ నీళ్ళు పోస్తూ అన్నాడు.

"నేను చచ్చినా తాగను!" కళ్ళనీళ్ళపర్యంతమవుతున్న నీరజ మొండిగా చెప్పింది.

"నువ్ తాక్కపోతే నామీద ఒట్టే! కమాన్!" లేచి ఆమె దగ్గరకు వస్తూ అన్నాడు.

భయంతో వణికిపోయింది నీరజ.

"ఛ! నువ్వింత పిరికిదానివనుకోలేదు నీరూ" తన కుడి చేతిని ఆమె నడుం చుట్టూ గట్టిగా బిగించి, దగ్గరకు లాక్కుని నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు.... ఆ తర్వాత ఓ అడుగు వెనక్కువేసి మళ్ళీ అన్నాడు—

"నామీద ఒట్టన్నా నీకు లక్ష్యం లేదుకదూ! పోన్లే....నేనేమైపోతే నీకేం! నీ సుఖం నువ్ చూసుకో! మొగుడి సరదా తీర్చటానికి ఇంత బాధపడిపోతావని అనుకొని వుంటే, అసలీ హనీమూన్‌కి వచ్చేవాడ్నేకాదు.... మనూరి కాఫీ హోటల్లో రవ్వదోసె తినేసి, ఓ సినిమా చూసేసి ఇంటికి పోయేవాళ్ళం....అసలు హనీమూన్ అంటే నీకు అర్థం తెలీదు నీరూ! అంతే!—"


అయినా నీరజ బదులు చెప్పలేదు. తల ఒంచుకుంది. ఆ మౌనాన్ని అందులో కనిపించే రాజీ ధోరణినీ అర్థం చేసుకున్న మోహన్‌రావు మరి కొంచెం యెడ్వాన్సయ్యేడు.

"ఆనాడు సావిత్రీ, సుమతీ, సీతా, అనసూయా మొదలైన మహా పతివ్రతలంతా తమ తమ మొగుళ్ళకోసం యెన్నెన్నో త్యాగాలు చేసేరు....అలాంటివాళ్ళ కథలు చదివి—'ఆహా ఓహో' అంటే సరిపోదు! మొగుడు గాడు ముచ్చటపడి ఓ చిన్న కోరిక కోరితే దాన్ని ధైర్యంగా తీర్చగలగాలి!"

భర్త ధోరణి నీరజకు బాధ కలిగించింది. తాను తాగక తప్పదనుకుంది.

"చేదుగా వుంటుందా?" విస్కీ వున్న గ్లాసు వైపు భయం భయంగా చూస్తూ అడిగింది.

"ఛ! చేదుగా వుంటే నేను మాత్రం తాగుతానా? కమ్మగానే వుంటుంది. మొట్టమొదటి



గుటక పడేవరకూ ఓరు చేదున్నా—ఆ తర్వాత చాలా బాగుంటుంది!" గ్లాసు ఆమె చేతికి అందిస్తూ అన్నాడు.

అందులో వున్నదాన్నంతా ఒకే గుక్కలో తాగేసింది నీరజ....ఆ తర్వాత గొంతు మండినట్లయితే మరో గ్లాసుడు మంచినీళ్ళు కూడా తాగింది.

ఆమె ధైర్యాన్ని అభినందించేడు మోహన్‌రావు. భార్యంటే అలా వుండాలని మెచ్చుకున్నాడు. సీసాలో మిగిలిన విస్కీనంతా మళ్ళీ గ్లాసులో పోసి నీళ్ళతో నింపేడు.

"ఇది కూడా ఫినిష్ చేసేస్తే, భోజనం చేసేయచ్చు!" అన్నాడు!

"అది కూడానా?....నాకొద్దు!" దూరంగా జరిగింది.

అయినా ఆమెకు తప్పలేదు....భర్త బలవంతం మీద మరికాస్త తీసుకుంది.

ఇద్దరూ ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేసేరు.

బోయ్ వచ్చి ఖాళీ అయిన ప్లేట్లూ, గ్లాసులు తీసుకుపోయేడు.

"ఇప్పుడెలా వుంది?" మంచం మధ్య అడ్డంగా పడుకున్న భార్యను తన కౌగిట్లోకి లాక్కుంటూ అడిగేడు.

నీరజ ఏదో చెప్పింది. ఆమె కనురెప్పలు బరువుగా మూతలు పడుతున్నాయి. మాటలు ముద్దగా వస్తున్నాయి. అవేం మోహన్‌రావుకి వినిపించటం లేదు. భార్యలోని అందాలు, మత్తెక్కిన అతని కళ్ళకు పదింతలుగా కనిపించి పరవశుణ్ణి చేస్తున్నాయి.

సరిగ్గా అదే క్షణంలో బెల్ మోగింది.

ఎవరో బయటనుంచి బజర్ నొక్కుతున్నారు.

విసుక్కుంటూ వెళ్ళి తలుపు తీసేడు మోహన్‌రావు....ఎదురుగా వున్న పోలీసుల్ని చూసి క్షణంపాటు దిగ్భ్రాంతుడయ్యేడు.

"క్షమించాలి! ఈ హోటల్ రూమ్స్‌లో గేంబ్లింగూ, వ్యభిచారం జరుగుతున్నాయని మాకు రిపోర్ట్సు వస్తున్నాయి" అంటూ ఇన్‌స్పెక్టర్ లోపలకు వచ్చాడు. అతని వెనక మరో ఇద్దరు కానిస్టేబుల్స్ కూడా వచ్చేరు.

మోహనరావ్‌కి మైకం పూర్తిగా దిగిపోయింది.

ఇన్‌స్పెక్టర్ నీరజ దగ్గరగా వచ్చాడు.

భయంగా లేచి నిలబడిన నీరజ పమిటను భుజాలమీదుగా కప్పుకుంది.

"ఎవరు నువ్?" అడిగేడు ఇనస్పెక్టర్, ఆమెవైపు తీక్షణంగా చూస్తూ.

"షీ ఈజ్ మై వైఫ్!" మోహన్రావ్ వెంటనే బదులు చెప్పేడు.

నవ్వేసేడు ఇనస్పెక్టర్.

"లాడ్జిలకు అమ్మాయిల్ని తీసుకొచ్చే— మీలాంటివారంతా ఆ మాటే చెప్తారు.... ఇలాంటి కేసుల్ని నా సర్వీసులో చాలా చూసేను మిస్టర్!" అన్నాడు.

మోహనరావ్‌కి కోపం వచ్చింది. అయినా తమాయించుకున్నాడు. తన గురించీ, తన వాళ్ళ గురించీ, తన వుద్యోగం గురించీ చెప్పుకున్నాడు.... హనీమూన్‌కి వచ్చిన విషయం చెప్పేడు. భార్య మెడలో వున్న మంగళ సూత్రాన్నీ, కాలివేళ్ళకున్న వెండి మట్టెల్నీ కూడా చూసుకోమన్నాడు.

అయినా ఇన్‌స్పెక్టర్‌కి నమ్మకం కుదర లేదు. లాడ్జిలకు తయారయ్యే అమ్మాయిలు చాలామంది ఇప్పుడు అలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నాడు.ఆ విధంగా వచ్చే ఆడవాళ్ళే తాగుతారన్నాడు. చెప్పుకోవలసిం దేదయినా వుంటే కోర్టులో మెజిస్ట్రేటు ముందు చెప్పుకోమన్నాడు.

మోహన్‌రావుకి ఏడుపొచ్చినంత పనైంది. నీరజకయితే ఏడుపొచ్చేసింది.

వాళ్ళ ఏడుపు మొహాలు చూసిన ఇన స్పెక్టర్‌కి జాలేసింది.

"పోనీ ఈ ఊళ్ళో మీకు తెలిసిన వాళ్ళెవ రయినా వున్నారా?" అని అడిగేడు.

అప్పటికిగానీ కర్తవ్యం బోధపడలేదు మోహన్‌రావ్‌కి. సుబ్బరామయ్య అనే, వాళ్ళ నాన్న స్నేహితుడొకాయన ఆ వూళ్ళో లాయరుగా వుంటున్న సంగతి చటుక్కున జ్ఞాపకం వచ్చింది. తమ పెళ్ళిలో మోహన్‌రావ్ ఆయనను చూసేడు కూడా. ఆ సంగతే ఇన్ స్పెక్టర్‌కి చెప్పి, తన డైరీలో వున్న ఆయన ఫోన్ నెంబర్ యిచ్చేడు.

వెంటనే ఇన్‌స్పెక్టర్ సుబ్బరామయ్యకు ఫోన్ చేసేడు.

అంత రాత్రివేళ ఫోనేమిటోనని ఖంగారు పడుతూనే ఫోనెత్తేడు సుబ్బరామయ్య.

"మీరు అర్జంటుగా హోటల్‌కి రావాలి! ఇక్కడ రూం నెంబర్ తొమ్మిదిలో వున్న మోహనరావ్‌ని గుర్తుపట్టాలి!" చెప్పేడు ఇన్‌స్పెక్టర్.

అవతల నుంచి మాట్లాడుతున్న సుబ్బ రామయ్యకి అర్థం కాలేదు.

మోహన్‌రావు వూరి పేరూ, తండ్రి పేరూ, వివరాలూ చెప్పేడు ఇన్‌స్పెక్టర్.

"అయ్యో! ఆ మోహన్‌రావా!.... అతను తెలీకేం? వాళ్ళ నాన్నా నేనూ ప్రాణస్నేహి తులం! పాపం.... పెళ్ళయి యింకా రెండేళ్లు కూడా కాలేదు... అందమైన పెళ్ళాముంది.... బంగారంలాంటి వుద్యోగం వుంది. మరి ఆత్మ హత్య ఎందుకు చేసుకున్నాడో?" అవతల నుంచి సుబ్బరామయ్య మాటల్ని విన్న ఇన్ స్పెక్టర్ త్రుళ్ళిపడి అన్నాడు—

"ఛ! ఛ! అదేం కాదండీ! అతను హాయి గానే వున్నాడు. మీరు ఓసారి రండి! కేసే మిటో అర్థమవుతుంది. వెంటనే వెళ్ళిపోదురు గాని!" అని ఫోను పెట్టేసేడు.

మరో అరగంటకల్లా సుబ్బరామయ్య వచ్చేడు....విషయం తెల్సుకుని నవ్వేశాడు.

"హడలగొట్టేశారుకదండీ! కేసనీ, గుర్తు పట్టటం అనీ మీరు చెప్పగానే నేను ఖంగారు పడిపోయాను" అన్నాడు నవ్వుతూనే.

మోహన్‌రావూ, నీరజా తనకు తెలుసుననీ, వాళ్ళిద్దరూ భార్యాభర్తలేననీ, సుబ్బరామయ్య చేత రాయించుకుని వెళ్ళిపోయేడు ఇన్‌స్పెక్టర్.

"అయినా బెజవాడ వచ్చినవాళ్ళు హాయిగా మనింటికి రాకుండా యీ హోటల్లో భాగోతం యేమిటోయ్?" అని మెత్తగానే చివాట్లువేసేడు ఆయన.

నీరజ సిగ్గుతో తల వంచుకుంది.

"జరిగిందేదో జరిగిపోయింది. ఈ సంగతి మా నాన్నగారికి తెలియనివ్వకండి!", సుబ్బ రామయ్య వెళ్ళిపోతుంటే మోహన్‌రావ్ ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

"ఛీ! దరిద్రపు గొడవ! సిగ్గు కూడానూ, హోటల్లో యిలాంటి రైడింగులు జరుగుతాయని తెలిస్తే—నేను అసలు యిక్కడ ఉండేదాన్నే కాదు. సమయానికి ఆయ నెవరో—దేవుడిలా వచ్చారు కనక సరిపోయింది....లేక పోతే యెంత రభస జరిగేదో?" తలుపులు వేసి వచ్చిన భర్తతో అంది నీరజ.

"ఒక్కొక్కసారి అలాగే జరుగుతూ ఉంటుంది నీరూ! యేం చేస్తాం? అయినా నీతికి నిజాయితీకి రోజులు కావు! మోసం చేసేవాడెపుడూ ముందు జాగ్రత్తలు తీసుకుంటూనే వుంటాడు. అంతవరకూ ఎందుకు? రెండేళ్ళ క్రితం ఓసారి సుబ్రమణ్యం ఈ హోటల్లోనే 'రూం' తీసుకుని—ఓ అమ్మాయిని తెచ్చుకున్నాడు.... తెలుసా?" మంచినీళ్ళు తాగుతూ అన్నాడు మోహన్‌రావు.

"మరి అప్పుడు పోలీసులు రాలేదా?...." అమాయకంగా అడిగింది.

"అప్పుడు కూడా వచ్చేరు. కానీ వాణ్ణి అనుమానించలేదు!"

"ఎందుకనీ?"

"అసలు అలాంటి అమ్మాయిల్ని సప్లయి చేయటానికి కొందరు బ్రోకర్లుంటారు. వాళ్ళే అమ్మాయిలతోబాటు చిన్న పిల్లల్ని కూడా సప్లయి చేస్తారు....ఎవరి రేటు వాళ్ళకుంటుంది. ఆ రోజున కూడా యిలాగే పోలీసులు వచ్చినప్పుడు—ఆ అమ్మాయి తన పెళ్ళామనీ—అక్కడే వున్న రెండేళ్ళ కుర్ర వెధవ తన కొడుకనీ—కనకదుర్గ గుళ్ళో మొక్కు తీర్చుకునేందుకు వచ్చేమనీ కోసేడు!....అంతే! పోలీసులు మారు మాట్లాడకుండా వెళ్ళిపోయారు! అసలు మనం కూడా అ యిదో పదో పారేసి ఓ పిల్లాణ్ణి అద్దెకు తెచ్చుకోవాల్సింది!"

"అలా బతికేవాళ్ళు కూడా వుంటారన్నమాట!" ఆశ్చర్యపడుతూ అంది నీరజ.

"ఏం చేస్తారు మరి? కూటికోసం కోటి విద్యలన్నారు!" గొప్పగా చెప్పేడు మోహన్‌రావ్.

"ఇంతకీ సుబ్రమణ్యం కథంతా మీకెలా తెలుసు?" ఓ నిమిషం తర్వాత యధాలాపంగా అడిగింది.

"ఎలా తెలుసంటే... యెలా తెలుసేమిటీ నీ మొహం!....వాడు నా ఫ్రెండని చెప్పేనుగా! వాడే చెప్పాడు యీ కథంతా!" తత్తరపడుతూ అన్నాడు.

"పోన్లెండి. అలాంటి లక్షణాలు మీకు ఒంటబట్టలేదు!...." అంది నీరజ—తృప్తిగా నిట్టూర్చి.

నిజంగా తన భర్తకి సుబ్రమణ్యం అనే పేరుగల స్నేహితుడు యెవడూ లేడనీ—రెండేళ్ళ క్రితం జరిగిన తన అనుభవాన్నే సుబ్రమణ్యానికి అన్వయించి చెప్పేడనీ ఆ అమాయకురాలికి యిప్పటికీ తెలీదు పాపం! □

అద్దె ఇల్లు


ఒరియా మూలం:
అనంత్‌ప్రసాద్ పండా

తెలుగు:
డి. కామేశ్వరి
డి. శైలజ

హరిహర సామంతరాయ్ మొదటిసారి ఆఫీసరుగా ఉద్యోగంలో చేరడానికి కటక్ వచ్చినపుడు ఆ టౌన్ యింకా అంత వృద్ధి కాలేదు. అపుడు అక్కడ అన్నీ పెంకుటిళ్ళు, మామూలు పాయిఖానాలు వుండేవి. అలాంటి ఒక యింట్లో హరిబాబు ముందు కాపురం పెట్టాడు. వర్షాకాలంలో యింటిముందు మట్టి రోడ్డు బురదతో నిండిపోయి నడవడానికి నానా యిబ్బందిగా వుండేది. రోడ్డుపక్క వున్న కుళ్లు కాలువ వర్షం పడగానే నిండిపోయి యింటి వరండా దాటుకుని వచ్చేసేది. పెంకుల సందు నించి నీళ్ళు టపటపమని రాలి యిల్లంతా నిండిపోయేది. ఆ అవస్థలన్నీ చూసి హరిబాబుకి విసుగుపుట్టినా యేం చెయ్యడానికి పాలుపోయేది కాదు. ఇంతకంటె మంచి యిల్లు ఆ వూర్లో దొరకడం కష్టం అని అతనికి తెలుసు. ఈ బాధలన్నీ పోవాలంటే ఓ స్వంత ఇల్లు కట్టుకోవాలని తీర్మానించాడు. తన మనసులో ఆలోచన భార్య చతురకి చెప్పాడు. చతుర అంతా విని "మీకేమి మతి పోయిందా యేమిటి? గవర్నమెంటు వుద్యోగాలన్నీ మర్రిచెట్టు నీడలాంటివి. ఈ రోజిక్కడ—మరో నాలుగు రోజులుపోతే యెక్కడికి బదిలీ చేస్తారో? ఎల్లకాలం యిక్కడే యెలా వుంటాం? యింటికిప్పటినుంచి యేం తొందర లెండి! తరువాత చూసుకుందాం. ముందు నా మాట విని ఆ డబ్బుతో నాకు నగలు చేయించండి. అవి వుంటే మనవసరానికి యెప్పుడైనా పనికొస్తాయి" అని సలహా పారేసింది. ఆఖరికి భార్య మాటలకి తల ఒగ్గక తప్పలేదు హరిబాబుకి. అపుడు కటక్‌లో ఇళ్ళ స్థలాలు చాలా చవగ్గా వుండేవి. స్థలం కొనడానికి యిచ్చిన అడ్వాన్సు డబ్బు తిరిగి తీసుకుని చతుర కోరిన ప్రకారం భార్యకి నగలు చేయించడానికి యిచ్చాడు.

ఇది జరిగిన కొన్నాళ్ళకే హరిబాబు తండ్రి గ్రామంనించి ఉత్తరం రాశాడు—అందులో ముసలాయన "అబ్బాయీ! నీకోసం అన్నీ తెగ నమ్మి నిన్ను పెంచి పెద్దచేసి చదువు సంధ్యలు చెప్పించాను. నువ్వు యిప్పుడు ఆఫీసరువయ్యావు. బాగానే వుంది కాని యిక్కడ యింటిస్థితి అధ్వాన్నంగా వుంది. రేపో మాపో కూలిపోయేలా వుంది. నీ వావూర్లో యిల్లు కట్టేబదులు, యీ యిల్లు బాగు చేయించి మిద్దె యిల్లు కట్టిస్తే బావుంటుంది. నే నింక యెంత కాలం వుంటాను. ఆ తరువాత నీవు నీ పిల్లలే కదా అనుభవించేది. బాగా ఆలోచించుకో" అని రాశాడు.

ఉత్తరం చదివిన తరువాత హరిబాబుకి తండ్రి రాసింది నిజమే ననిపించింది. ఇప్పుడు యిక్కడ యేన్నో మేడలు కడ్తున్నారు. తను ఒకవేళ యిక్కడ మిద్దెయిల్లు కట్టినా ఆ పెద్ద మేడల మధ్య వెలవెల బోతుంది. అదే పల్లెటూరిలో అయితే గొప్పగా వుంటుంది. రిటైరయ్యాక యీ టౌనులో వుంటే యిల్లు గడవడం కష్టం. గ్రామంలో అయితే అన్నీ చవక. రిటైరయ్యాక అక్కడే వుండచ్చు అని ఆలోచించి తన ఆలోచన చతురకి చెప్పాడు. ఆమెకి ఆ పల్లెలో యింటిమీద డబ్బు ఖర్చుపెట్టడం



యిష్టంలేదు. కాసేపు అసంతృప్తిగా సణిగింది. ఆఖరికి ఎలాగో వప్పుకుంది.

హరిబాబు వూర్లో యిల్లు కట్టించడం ఆరంభించాడు. ఆ వూరు వెళ్ళాలంటే రెండుమూడు చెరువులు, నదులు దాటుకుని వెళ్ళాలి. గట్టిగా రెండురోజులు వర్షం పడినా నీరు ఏరు దాటి పొంగిపోతూంటూంది. అలాంటి స్థితిలో అక్కడ యిల్లు కట్టించడం ఎంత నష్టమో తెలుసుకొనేవేళకి పరిస్థితి చేయిదాటి పోయింది. అప్పటికే చాలా డబ్బు యిటుకలు, సిమెంటు మీద ఖర్చయింది. ఇప్పుడు వెనక్కి తిరిగితే నష్టం తప్ప లాభంలేదు. హరిబాబు చాలా ఇరకాటంలో పడ్డాడు. కాని యేదైతే అదే అవుతుందని యిల్లుపని ఆపలేదు. దాని ఫలితం కటక్‌లో అలాంటి యిల్లు కడితే ఎంత అవుతుందో అంతకు రెట్టింపయింది ఆ పల్లెటూరిలో.

ఇల్లు కట్టడం పూర్తి అయింది. గృహప్రవేశం రోజుకి హరిబాబు సపరివారంగా పల్లెకి వెళ్ళాడు. చాలా భారీయెత్తున గృహప్రవేశం జరిగింది. రకరకాల పిండివంటలతో వూరివాళ్ళంతా సుష్ఠుగా భోంచేశారు. ఆ వూర్లోనేకాదు చుట్టుపక్కల ఐదారు గ్రామాలలో అలాంటి యిల్లు చూడలేదన్నారు అంతా. హరిబాబు కనక అలాంటి యిల్లు కట్టించగలిగాడు అందరికీ చేతనవుతుందా అని పొగిడారు. హరిబాబు పుణ్యమా అని మేము ఇలాంటిల్లు కళ్ళార చూడగలిగాం అని వుబ్బేశారు. హరిబాబు ఆ పొగడ్తలు విని పొంగిపోయాడు.

కాని.... ఆ సంబరం మూన్నాళ్ళ ముచ్చటయిపోయింది. గృహప్రవేశం మర్నాడే హరిబాబు ముసలితండ్రి గోవర్ధన్ సామంత్‌రాయ్ డిసెంట్రీతో మంచం పట్టాడు. అలాగే తీసుకు

తీసుకు పదిహేనురోజులకి చచ్చిపోయాడు.తల్లి ముందే చచ్చిపోయింది. ఇప్పుడు యిహ హరి బాబుకి యింతపెద్ద యిల్లు యెలా మేనేజ్ చెయ్యాలనే చింత పట్టుకుంది. ఆ పల్లెటూరిలో అద్దె కిద్దామన్నా వుండేవాళ్ళుండరు.

దానికి తోడు హరిబాబు తండ్రి పోగానే వూర్లో రకరకాల వ్యాఖ్యానాలు బయలుదేరాయి. "వాళ్ళ ఏడు తరాల్లో ఎవరూ ఇలాంటి యిల్లు కట్టలేదు. ఇప్పుడు హరిబాబు కట్టేసరికి వాళ్ళ పూర్వీకులు సహించలేక పోయారు. గృహప్రవేశం అయిందగ్గర నించి ముసలాడు మంచంపట్టి మరి లేవలేదు" అన్నారు కొందరు. మరికొందరు "అదికాదు. వాళ్ళు కట్టిన యిల్లు వాస్తుశాస్త్రం ప్రకారం లేద"న్నారు. "ఇది ఒక్క ముసలాడితో సరికాదు, ముందు ముందు ఇలాంటివి యెన్నవుతాయో చూడండి" అన్నారు కొందరు.

పల్లెటూరిలో యిలాంటి వదంతులు చాలా త్వరగా వ్యాపిస్తాయి. ఇలాంటి కథలు ఎన్నో రంగు రంగులు పులుముకుని హరిబాబు చెవిలో పడ్డాయి. అతడు యెంత యింగ్లీషు చదువులు చదివినా యిలాంటి భావాలు అతని నర నరాల్లోనూ జీర్ణించి వున్నాయి. అందుకే నిజంగానే యిల్లు అచ్చిరాదేమోనని బాధపడ్డాడు. అందుకు తగ్గట్టు చతురకూడా...."చూశారా! నే చెపితే వినిపించుకోలేదు. వద్దంటే ఆ పల్లెటూరిలో అంతిల్లు కట్టారు. చాలుగాని యింక యెలాగో ఆలాగ ఆ యిల్లు వదల్చుకోండి. అమ్మి పారేయండి" అని పోరింది. హరిబాబు యిల్లు అమ్మకానికి పెట్టాడు. కాని అంత పెద్ద యిల్లు ఆ చిన్న వూర్లో యెవరు కొంటారు? అందులోనూ యింటి గురించి అన్ని పుకార్లు బయలు దేరాక? ఎవర్ని అడిగినా 'అమ్మో ఆ యిల్లా? బతికుంటే బలుసాకు తినచ్చు"అనడం మొదలు పెట్టారు.

ఆఖరికి అద్దెకుండడం మాట అటుంచి వూరికే యింట్లో వుండి దీపం పెట్టమన్నా యెవరూ వప్పుకోలేదు. క్రమంగా అంత మంచి యిల్లు పాడుపడడం మొదలుపెట్టింది. హరిబాబు కష్టార్జితం పదివేలు బూడిదలో పోసిన పన్నీరయింది. అలాంటి పల్లెలో యిల్లు కట్టి యెంత పెద్ద తప్పు చేశాడో అర్థం అయి లెంపలు వేసుకున్నాడు. కటక్ నించి ఆ వూరికి కాని చుట్టుపక్కలలో కాని ట్రాన్స్ఫర్ చేయించుకుందామని అతను యెంత ప్రయత్నించినా కుదరలేదు!

* * *

కాలం ముందుకు సాగింది. ఇప్పుడు కటక్ టౌన్ విపరీతంగా పెరిగిపోయింది. ఎక్కడ పడితే అక్కడ కుక్కగొడుగుల్లా తెల్లారేసరికి కొత్త కొత్త యిళ్లు పుట్టుకొస్తున్నాయి. హరిబాబు ముందున్న యింటికన్న కాస్త మంచి యింట్లోకి మారాడు. కాని కటక్‌లో యిళ్ళ అద్దెలు విపరీతంగా పెరిగిపోయి జీతంలో చాలా మటుకు అద్దెలకే సరిపోతూంది. అందుకని హరిబాబుకి కటక్‌లో మళ్ళీ యిల్లు కట్టుకోవాలన్న ఆలోచన వచ్చింది. ఇన్నాళ్ళు పట్నవాసం అలవాటయ్యాక రిటైరయ్యాకన్నా పల్లెలో వుండాలంటే యెవరికీ మన సొప్ప లేదు.

ఆఖరికి కటక్‌లో ఓ యిల్లు కట్టాలని తీర్మానం అయింది—కాని అప్పటికి యిళ్ళ స్థలాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇదివరలో గజం ఐదు వుండేది యిప్పుడు పదిహేను అయింది. అయినా అవసరం. హరిబాబు స్థలంకొని యిల్లు ఆరంభించాడు. స్థలాలతోపాటు మిగతా వస్తువులు నాలుగింతలు పెరిగాయి. ముందు ధరల్లో పదివేలకి వచ్చే యిల్లు ముప్పైవేలు ఖర్చుపెడితేగాని యిల్లు తయారవలేదు. అంత డబ్బు హరిబాబు దగ్గిర యెక్కడుంది? తప్పనిసరిగా ఆఫీసులో లోన్‌కి అప్లయ్ చేశాడు. అపుడు చతుర బుర్రలో మళ్ళీ ఓ అనుమానం ఉదయించింది. "బాగానే వుంది. అప్పు తీసి యిల్లు కట్టారుకాని అది తీర్చేదెలా? మీరు నాలుగేళ్ళలో రిటైరవుతారు, అపుడు పెన్షన్‌తో బతకడమే కష్టం. ఇంటి మీద యెలా అప్పు తీరుస్తారు?"అని సందేహం బయటపెట్టింది. హరిబాబు భార్య మాటలు విని కృంగిపోయాయాడు. ఏం దారి అనుకున్నాడు.

చతుర మళ్ళీ తనే ఒక ఆలోచన చెప్పింది. "మన యింటిని అద్దెకిద్దాం. ఆ అద్దె అప్పు కింద చెల్లవడదాం. అప్పు తీరాక యింట్లోకి వెడదాం. ఎలాగో యిన్నాళ్ళు యిక్కడే వున్నాం గదా, మరో రెండు మూడేళ్ళు కళ్ళు మూసుకుంటే మన కష్టాలు తీరుతాయి" అని ఓదార్చింది. భార్య సలహా ఆచరించక తప్ప లేదు. అంత డబ్బుపెట్టి, అంత కష్టపడి కట్టుకున్న యింట్లో వుండడానికి నోచుకో లేదు.

* * *

హరిబాబు కష్టాలు అంతటితో తీరలేదు. యిల్లు మూడేళ్ళ కంట్రాక్టుమీద అద్దెకిచ్చాడు. కాని అతనున్న యింటి యజమాని యిల్లు ఖాళీ చెయ్యమని నోటీసిచ్చాడు. హరిబాబు కదిలితేగాని అద్దె పెరగదని తెలుసు అతనికి. ఇప్పుడు హరిబాబుకి యింటి సమస్య తలెత్తింది. స్వంత ఇంటికి వెళ్ళాలన్నా మూడేళ్ల కంట్రాక్టు రాశాడు. మరో ఇల్లు యింత ప్రయత్నించినా దొరకలేదు. ఆఖరికి ఇల్లుగలాయనతోపాటు కోర్టుకెక్కాడు.

ఆఖరికి కేసు యిల్లుగలాయన గెలిచాడు. అప్పటికి అతను రిటైరయ్యాడు. మళ్ళీ హరిబాబు అద్దెయిళ్ల వేటలో పడ్డాడు. □

మినీ కథ

తనదాకావస్తే?

"ఇవ్వాళ మా ఆయనకి లేబ్‌లో పనుందిట. కూరగాయలకి వెళ్దాం వస్తారూ?" రాధాదేవి విమల గార్ని అడిగింది. ఆవిడ వెంటనే ఒప్పుకుంది. ప్రతి ఆది, శుక్ర మంగళవారాలు కళ్యాణ్‌పూర్‌లో సంత జరుగుతుంది. కూరలు చవగ్గా దొరుకుతాయి. విమలగారు తయారై వచ్చింది సంచీ, బుట్టలతో. యిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

"మొన్న ఆ మీనాక్షి గారితో వెళ్ళానా? మొగుడు అసిస్టెంట్ ప్రొఫసరయినా అంత పీనాసేమిటండీ ఆవిడ! కళ్యాణ్‌పూర్‌కి టెంపోవాడు తీసుకున్నది లక్షనా ఏమన్నానా? మహా అయితే పావలా! అదికూడా ఖర్చు ఆవిడకి. అంతవరకూ నడిచే వెళ్దామంది. ఎంత గీసి గీసి బేరమాడుతుందనుకున్నారూ? నాకు చిరాకు బాబు" అంది రాధాదేవి.

"మరే! ఏమిటో ఆ కక్కుర్తి. కట్టుకు పోతుందా ఏమన్నానా?" యిద్దరూ టెంపో కోసం చూడసాగారు. అరగంట గడిచినా టెంపోల జాడలేదు.

"ఈపాటికి నడిస్తే వెళ్ళిపోయి వుండేవాళ్ళం. ఈ టెంపో ఇంక అరగంటకైన వస్తుందో రాదో? పిల్లలు వచ్చేవేళకి ఏదో ఒక టిఫిన్ చెయ్యాల" రాధాదేవి విసుక్కుంది.

"మరే! మావారుకూడా టీకి ఎవర్నో పిల్చారు. అప్పుడే మూడైనట్టుంది, పోనీ నడుద్దామా?" విమలగారు అంది.

"నడుద్దాం పదండి. పట్టుమని పదినిముషాలుకూడా పట్టదు. ఎంత దూరం ఏమిటి? టెంపో వాడు పావలా మింగుతాడు. పావలా అయినా పొదుపు పొదుపేకదండీ. నడక ఒంటికి ఆరోగ్యం కూడాను. ఏమంటారు?"

"బాగా చెప్పారు. ఈ కాన్పూరు నీళ్ళకి తెగ ఒళ్ళు వస్తుందండీ. ఎంత తిండి మానేసినా తగ్గదు. యిలా అప్పుడప్పుడు నడవడం మంచిదే!"

—ముక్కామల వసుంధరాదేవి.



బస్తీ మాయాబజార్

భయం భయంగానే మళ్ళీ వెనక్కి తిరిగి చూశాను. అవును. అనుమానం లేదు. అతను నన్ను ఫాలో అవుతున్నాడు. గుండెలు జల్లుమన్నాయి. చలివల్లనో భీతివల్లనోగాని నరాలు జివ్వుమంటున్నాయి. రోమాంచలం అయింది. చాలా దూరం నుంచి వెంబడిస్తున్న

అతగాడెవరో అంతుపట్టడంలేదు. నా పని పట్టించడానికి వాళ్ళు నియమించిన కిరాయి మనిషో, మఫ్టీలో వున్న పోలీసో కావచ్చు. నేను వేసుకున్న ప్లానంతా బట్టబయలయి పోయిందో ఏమో? ఆ ఆలోచన రాగానే ఒళ్ళంతా నిస్సత్తువ ఆవరించినట్టయింది. ఏది ఏమైనా ధైర్యం కూడగట్టుకోవాలి. అనుకొన్న దంతా ఈ రాత్రికే పూర్తి చెయ్యాలి.

సిగరెట్టు కాలిస్తే బావుణ్ణనిపించింది. జేబులు తడుముకున్నాను. ఉత్తి చేతులు బయటకు వచ్చాయి. నేను గమనించనేలేదు. క్షణాల మీద అతను నా దగ్గరకు వచ్చేశాడు. బిక్కుబిక్కుమంటూ మసక చీకట్లోనే అతన్ని తేరి పార చూశాను. తెల్లటి బట్టల్లో నల్లగా పొడుగ్గా వున్నాడు. అతని గుండెకాయ ఎర్రగా వుందో, తెల్లగా వుందో నల్లగా వుందో....

అతని చేతిలో సిగరెట్ పెట్టె. పళ్ళు సలపటం మొదలెట్టాయి. అడిగితే ఒకటివ్వక పోడు అనుకున్నాను. ఆలోచనలు చదవగలిగే మనిషిలా వున్నాడు. అడక్కుండానే 'హేవిట్' అంటూ చెయ్యి ముందుకు చాపాడు. గుండెలు టుబుక్కు టుబుక్కుమంటున్నాయి. తటపటాయిస్తూ కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాను. చివరకు నోరు పెగలదీసుకుని "మీరు...." అని మాత్రం అనగలిగాను.

"అర్ధరాత్రి ఆగంతకుడు ఎవడా అని ఆశ్చర్యపడక్కర్లా. శత్రువుని మాత్రం కాదు. టేకిట్" మూత తెరిచి అన్నాడు అతను.

భయం స్థానే ఆశ్చర్యం దోబూచులాడుతోంది. చిత్రమైన మనిషి. అంతరంగాన్ని ఇట్టేపట్టేస్తోన్నాడు. వణుకుతున్న చేతితోనే సిగరెట్ అందుకుని "థాంక్స్" అన్నాను నోట్లో పెట్టుకుంటూ.

"దట్సాల్‌రైట్'' అంటూ మిగిలిన ఒక్క సిగరెట్‌నూ పెదాల మధ్య బిగించి ఖాళీ పెట్టెను కింద పారేశాడు.

ఆశ్చర్యం మళ్లీ నన్ను ముంచెత్తింది. గుండెలు దడదడా కొట్టుకోవడం మొదలెట్టాయి. అంత చలిలోనూ ముచ్చెమటలు పోశాయి. అగ్గిపుల్ల వెలిగించకుండానే అతను సిగరెట్ పీలుస్తున్నాడు.

"....ఆర్....యూ....ఏ.... మెజీషియన్'' అన్నాను పదాలు కూడబలుక్కుంటూ. అతను చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

అంతకన్నా ఆశ్చర్యం నా నోట్లో సిగరెట్ కూడా దానికదే వెలుగుతోంది. గట్టిగా ఒక్క దమ్ములాగి గుండెల్నిండా పొగపీల్చుకొన్నాను. హాయిగా వెచ్చగా వుంది.

"బలే చిత్రంగా వుందే" అన్నాను కొంచెం తేరుకొని.

"నా కూడా రా. ఇంతకన్నా చిత్రాలు చూపిస్తా" అన్నాడు.

గుండె దడ తగ్గింది. భయం టప్పున ఎగిరి పోయింది. అతన్ని వెంబడించాను. వేగంగా పడుతున్నాయి మా అడుగులు

జనసంచారం అసలు లేదనే చెప్పాలి. ఠాణాలో కొడుతున్న గంటలు లీలగా వినిపిస్తున్నాయి. అక్కడక్కడా చీకటి ముయ్యారంలో జీబురు జీబురుమంటున్నాయి చెట్లు. దూరంగా నక్కలు ఉండి ఉండి చేస్తున్న గానాలాపన కర్ణకఠోరంగా వినపడుతోంది.

"ఎక్కడికి?"

"చూద్దువుగాని."

మౌనంగా అతనిపక్కనే నడుస్తున్నాను. రెండు మూడు సందులు తిప్పి ఒక కాలనీలోకి లాక్కొచ్చాడు. ఏదో చటుక్కున గుర్తొచ్చినట్టు ఒక ఇంటిముందు ఆగాడు. చెయ్యి చురుక్కుమంది. ఆఖరిదమ్ము లాగి సిగరెట్టు కింద పారేశాను. అతడు సిగరెట్టు ఎప్పుడు పారేశాడో నేను గమనించలేదు. ఆలోచనలు ఊపిరి సలపనివ్వడంలేదు.

నా చెయ్యి పట్టుకొని ఆ ఇంటిముందు నడిపించాడు. ఇద్దరం ఆ ఇంటి వరండా దాటి తలుపు ముందుకు వచ్చాం. నాకు బితుకు బితుగ్గా ఉంది. మంత్రముగ్ధుడిలా అతని వెంట వెళ్ళడం మినహా మరేమీ చేయలేకపోయాను. తలుపు యెలా తెరిచాడో గుర్తులేదు. క్షణాల మీద లోపలి గదిలోకి వచ్చేశాం.

మంచంమీద వోరగా పడుకొని వున్న వ్యక్తి కసిగా "డర్టీ కంట్రీ" అనడం వినిపించింది.

"అవునవును" కీచుగొంతుతో వంతపాడాడు ఆగంతకుడు.

"సేఫ్ పీరియడ్ కూడా కాదు" అతన్ని అంటిపెట్టుకొని పడుకొన్న ఆమె నిట్టూరుస్తూ అంది.

పక్కనే ఉన్న చీరతో అతని నుదుటికి పట్టిన చెమటను తుడిచిందామె.

నా నరాలు పెళపెళ మంటున్నాయి.

"అవసరమయితే యేదో ఒకటి చేద్దాం లెండి" అందామె.

ఎదురుగావున్న మమ్మల్ని గుర్తించే స్థితిలో వాళ్ళు ఉన్నట్టులేరు. ఇద్దరూ బాత్‌రూమ్‌లోకి నడిచారు. మేమూ వెంబడించాం. గచ్చుమీద నీళ్ళు వొలికిన చప్పుడు. పిగిలిన కండోమ్ వెక్కిరిస్తూ మోరీలోకి జారిపోయింది.

నాలుగేళ్ళ పాపాయి అన్న యెందుకో నిద్దట్లో నవ్వుకొన్నాడు.

ఇద్దరం బయటకు వచ్చాం.

"అర్థమయిందా?" అన్నాడు ఆగంతకుడు.

"వూ" అన్నాను నెమ్మదిగా.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

"మీకు కనికట్టు లాంటిదేమన్నా తెలుసా?" అన్నాను మళ్ళీ ఆశ్చర్యంగా.

"ఉష్!" అంటూ నోటికి అడ్డంగా కుడిచేతి చూపుడువేలు బిగించి తర్వాత చిన్నగా నవ్వేశాడు.

నేనూ నవ్వేశాను.

మళ్ళీ కొంతదూరం నడక. మామధ్య అంతగా మాటలు దొర్లడం లేదు. అతని కథా కమామిషూ వెంటనే అడిగి తెలుసుకోవాలని మహా కుతూహలంగా వుంది. కొంచెంసేపు ఓపిక పట్టడం మంచిదని నన్ను నేను నిగ్రహించుకున్నాను. ఈసారి ఇద్దరం ధర్మాసుపత్రిలోకి చొరబడ్డాం. మమ్మల్నెవరూ అడ్డగించకపోవడం ఈసారి నాకు ఆశ్చర్యంగా లేదు.

"చూడు."

"ఏఁవిటి?"

"బేవర్."

అరుగులమీదా, వరండాలోనూ ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా పడున్నాయి మహా నిద్రలోకి ఒరిగిపోయిన విగత జీవాలు.

చచ్చిన పాముల్లాంటి స్టెతస్కోపులూ, దీపాల వెలుతురులో ట్రేలతోపాటే మెరిసిపోతున్న తెల్ల గౌన్లూ, కర్రపెత్తనం చేస్తున్న కాకీ చొక్కాలూ తెగ హడావిడి చేస్తున్నాయి.

....ఏడ్పులూ .... మొత్తుకోళ్ళూ.... నిట్టూర్పులూ....మూలుగులూ....పెడబొబ్బలూ....

....మేల్సూ.... ఫిమేల్సూ.... హైడ్రోసూ లాట్రోసూ... హేవ్సూ.... హేవ్‌నాట్సూ....

....పత్తికాయల్లా పేలిపోయిన గుడ్లూ.... మెలికలు తిరిగిన చేతులూ....చచ్చుపడిన కాళ్ళూ....

....తెగీతెగని గాలిపటాలూ....టుప్పుమనబోయే గాలిబుడగలూ....

గుడుంబా వాసనకు ముక్కుపుటాలు ఎగిరిపోతున్నాయి.

"లెక్కపెట్టు" అన్నాడతడు.

ఆలోచన మళ్ళింది. లెక్క తెగక గొణుక్కున్నాను.

"డాక్ ఎడిషన్‌కు దెబ్బయ్యారు. సిటీ ఎడిషన్‌కు రెట్టింపు కావచ్చు" అన్నాడు.

నేను తల వూపడం చూసి—"చలో!" అన్నాడు.

రోడ్డుమీదకు వచ్చాం.

హోటల్ వెనుక పేవ్‌మెంటుమీద చెత్తకుండీ. పక్కనే పందులకూ, కుక్కలకూ కొంచెం యెడంగా, పుణ్యభూమి దౌర్భాగ్యానికి ప్రతీకల్లా, లోకం కుళ్ళు తెలీని బజారుబిడ్డలు, వంటిమీద సరైన ఆచ్ఛాదనన్నా లేకుండా చలికి వణుకుతూ మునగదీసుకొని పడుకున్నారు.

"కాంట్రాక్టరును పూనిన యముడో, యముణ్ణి పూనిన కాంట్రాక్టరో! పెద్దగా ఓ వెధవ నవ్వు నవ్వాడు...." చెప్పటం మధ్యలో



ఆపి అతను నావంక చూశాడు.

"వింటున్నా" అన్నాను.

"కడుతూ కడుతూ వున్న భవనం పెద్ద గోడ ఆ వికటాట్టహాసానికి నిలువునా కుప్ప కూలింది...."

"ప్చ....ప్చ...."

"....ఇద్దరు మగకూలీలూ, వారి పెళ్ళాలూ అక్కడికక్కడే సజీవసమాధి అయ్యారు. నోట్లు చేతులు మారాయి. చేతులు జేబుల్లోకి వెళ్లాయి...."

చేతులు రెండూ ఒక్కసారి గట్టిగా రుద్దుకొని పాంటుజేబుల్లో పెట్టుకొన్నాను.

"చలిగా వుందా?" అతడు అడిగాడు.

"వూ" అన్నాను నెమ్మదిగా.

"కొంచెం వోర్చుకో."

ఒక్కక్షణం ఆగి అతడు మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు.

"....అనాథ ప్రేతలకు సంస్కారం చేసిన పుణ్యం వెట్టోళ్ళకు దక్కింది. వీళ్ళకిక్కడ ఇంత చోటు చిక్కింది" అన్నాడు.

"డబ్బుంటే పాపం చెరిపేసుకొని పుణ్యం కొనుక్కోవడం మహా తేలిక" అన్నాను వుండబట్టలేక.

అతను మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టున్నాడు. నాలుగయిదు అడుగులు వేశామో లేదో "నడుస్తున్న ఆ శవాన్ని చూడు" అన్నాడు మళ్ళీ.

అతను చెప్పింది నిజం. మా ముందు నడుస్తున్న ఆ వ్యక్తి అచ్చు పీనుగులా వున్నాడు. ప్రేతకళ వచ్చినట్టు ఇట్టే గ్రహించవచ్చు.

"చచ్చేకిందా?"

" ంత అదృష్టమా?"

"ఏం జబ్బు మరి?"

"మామూలు జబ్బే."

"అంటే?"

"ఆకలి జబ్బు."

"ఎవడీ దౌర్భాగ్యుడు?"

"ఆరేళ్ళు నిరుద్యోగం, మూడేళ్లు చిరుద్యోగాలూ చేశాడు. నానాగడ్డి కరిచి చివరకు బతకనేర్వని బడిపంతులయ్యాడు. జీతం పుచ్చుకొని ఏడాది, తిండి తిని నాలుగు రోజులూ, విషం తాగి రెండు రోజులూ అయింది...."

"ఇట్స్ రియలీ హెల్" అన్నాను విచారంగా.

"కొందరికి చచ్చేందుకూడా హక్కుండదు. మనిషిని నిల్లగా నిలువెల్లా కాటేసే గరళం

తెల్లగా పాలిపోయి ఇతని ముందు గుడ్లు తేలేసింది'' అన్నాడు.

గుండెల్లో చెయ్యిపెట్టి దేవినట్టయింది.

ట్రంకు రోడ్డుమీద లారీలు పెద్దగా చప్పుడు చేస్తూ పరుగెడుతున్నాయి. నిద్రపట్టని కుక్కలు ఎందుకోగాని వుండి వుండి మొరుగుతున్నాయి. మునిసిపల్ దీపాలు ఒక్కసారి ఆరిపోయి మళ్ళీ వెలిగాయి.

రోడ్డు పక్క యింటి అరుగుమీద ముసుగు వేసుకొని మౌనంగా రోదిస్తూన్న ఒకామెను చూడమన్నట్టు సైగ చేశాడు. ఆమె వడిలో పసికందు ఆదమరిచి నిద్రపోతున్నాడు. నేను అడక్కుండానే అతను చెప్పడం మొదలు పెట్టేడు.

"దిక్కులేని పక్షి. ముగ్గురు బిడ్డల తల్లి."

"పాపం.''

''....గుర్తింపులేని వెట్టిచాకిరీ చేసి చేసి మూలన పడ్డాడు మొగుడు."

''ఆ జబ్బేనా?''

''అలాంటిదే....భయంలేదు. దివ్యౌషధం. క్షణాలమీద అంతా చక్కబడుతుం దన్నాడు డాక్టరు గ్యారంటీగా. డాక్టరు మాట వీరుపోలేదు. అంతా నిమిషాలమీద అయిపోయింది."

"ఉయ్ హేవ్ టు షూట్ దెమ్ ఆల్...." అన్నాను కొంచెం గట్టిగా.

ఉద్రేకంపాళ్ళు అతగాడిలో ఏ కోశానా వున్నట్టు లేవు.

"యస్పెన్స్" అని అతి నెమ్మదిగా మాత్రం అన్నాడు.

ఆకాశంలో మిణుకు మిణుకుమంటున్న చుక్కల్ని చూశాను. తర్వాత అతన్ని ఎగా దిగా చూశాను. ప్రపంచాన్ని కాచి వడబోసి పుక్కిట పట్టిన తేజోమూర్తిలా వున్నాడు. మహోదివిగా, గంభీరంగా అడుగు లేస్తున్నాడు.

"సస్పెన్సుతో చంపేస్తున్నారు. ఇంతకూ మీరెవరో ఏవిటో చెప్పనేలేదు...." అతని పక్కనే నడుస్తూ ఇక వుండబట్టలేక కక్కేశాను....

"ఉష్" అటు చూడమన్నట్టు సైగ చేశాడు.

ఇంటి పెరటిలో చెట్టుకింద రెండు ఆకారాలు....

"....ఆ రాత్రి బాగా వర్షం పడింది."

"అయితే...."

'తమాయించుకోలేకపోయాను.'

"చెప్పడానికి సిగ్గెయ్యడంలేదూ?"

"మన మధ్య రహస్యా లుండకూడదని నువ్వే అన్నావ్."

"అన్నాను."

"తెలిసో తెలియకో పొరపాటు జరిగితే గోరంతలు కొండంతలు చేసుకోకుండా సర్దుకు పోవాలన్నావ్."

"అంటే అనుండొచ్చు."

"అనుండొచ్చు కాదు. అన్నావ్."

"అయితే ఏమంటావ్?"

"ఆరు నూరయినా నూరు ఆరయినా మనం విడిపోకూడదన్నావ్."

"అంటే నిన్ను నెత్తిమీద పెట్టుకుని వూరేగమంటావా?"

"అలాగని నేను అనలేదే!"

"మరి....?"

"గుట్టు రట్టు కాకుండా చేసుకునే తెలివి తేటలు నాకు తెలీకే బయట పడ్డాననుకొంటు న్నావా?"

"అతిగా వాగకు."

"పోనీ నీ ప్రియురాళ్ళ గురించి కొంచెం కొంచెం చెప్పమన్నావా?"

"గొప్ప తెలివిగా మాట్లాడుతున్నాననుకో మాకు."

"నీలా నంగనాచి కబుర్లు చెప్పడం నాకు చేతకాదు."

"బరి తెగించావ్."

"అదే నేనూ అంటే!''

"వెయ్యి చెప్పు నీకూ, నాకూ ఇక సరి పడదు.''

"నీ కాళ్ళు పట్టుకుని బతిమాలతాననుకుం టున్నావా?"

"నిన్నెవడు కట్టుకుంటాడో చూస్తాను."

"గొప్ప హీరోవి మరి?''

"షటప్."
"యూ షటప్."
"..............."
"..............."
మాంచి రసవత్తరంగా కథ నడుస్తూంటే పూర్తిగా విననివ్వకుండా, మాటా మంతీ లేకుండా ఆగంతకుడు నన్ను చెయ్యి పట్టుకుని ముందుకు లాక్కుపోవడం మొదలెట్టేడు. నేను చెయ్యాల్సిన పని చటుక్కున గుర్తుకొచ్చింది. ఇతగాడి మాయాజాలంలో చిక్కుకుని అసలు సంగతి మరిచిపోయాను.
"ఎక్కడికి?" కోపంగా అన్నాను.
"కోప మొచ్చినట్లుందే" అతగాడు శాంతంగా అన్నాడు.
"నన్నింక ఒదిలిపెట్టు" చెయ్యి ఒదుల్చుకుంటూ అన్నాను.
అతను నా చెయ్యి ఒదిలేశాడు.
"ఎక్కడికి కెళ్ళాలేమిటి?"
"నీకనవసరం."
"నువ్విప్పుడు ఇంటికెళ్ళడం అనవసరం" అన్నాడు.
గతుక్కుమన్నాను.
"ఎందుకని?" అప్రయత్నంగాఅడిగాను.
"నువ్వుతలపెట్టిన పని ఈ జన్మలో చేయలేవు గనక."
"చేయగలను."
"చేయలేవు."
"ఐకెన్."
"యు కాంట్."
"నేనేమీ చేయాలనుకున్నానో, ఎందుకు చేయలేనో నీకెలా తెలుసు?"
"నా కంతా తెలుసు"
"నీకు టెలిపతీ తెలుసా?"
అతను సమాధానం చెప్పలేదు.
"నీకేంతెలుసో చెప్పు చూద్దాం" రెట్టించాను.
రోడ్డు మధ్యలోనడుస్తున్నాం. అతివేగంగా యమకింకరుడిలా, దీపాలన్నా లేకుండా ముందుకు దూసుకువస్తున్న లారీని ఆ క్షణంవరకూ మేముచూడనేలేదు. క్షణాలమీద మమ్మల్నిమట్టి కరిపించేస్తుంది. అంతా అయిపోయిందనుకున్నాను. అవాక్కయిపోయాను. నరనరాల్లోంచి చలిజ్వరంలాంటి వణుకు. ముందుకుగాని, వెనక్కుగాని, అటుగాని, ఇటుగాని ఎటూకదలలేకపోయాను. చెప్పరానిభయంతో గట్టిగా అరుస్తూ కుప్పలా కూలిపోయాను. అతడు నా నడుం పట్టుకొని పైకిగుంజడం లీలగా గుర్తుంది. గాలిలో తేలిపోయినట్టుభావన. భయంభయంగానే కళ్ళు తెరచిచూశాను. ప్రమాదం తప్పిపోయింది. లారీ వెళ్ళిపోయింది. మేమింకా రోడ్డుమధ్యేవున్నాం.
"ప్రక్కనేనడుద్దాం" అంటూ అతణ్ణి ఓ పక్కకు లాక్కొచ్చాను. కొంచెంకొంచెంగా తెప్పరిల్లాను.
"మీరు నిజంగా దేవుడు. రక్షించారు" అన్నాను అతన్ని గట్టిగా కౌగలించుకొంటూ.
"కాదు నీలాంటి వాణ్ణే" అన్నాడతడు.
"ఆర్ యూఏ పారాసైకాలజిస్ట్?"
అతనినుంచి సమాధానం లేదు.
"మీరెవరో నాకుచెప్పకపోయినా, నాగురించి మీకు చెప్పాలనుకొంటున్నా" అన్నాను తిరిగి.
"అవసరంలేదు"
"మీరు నిజంగా దివ్యపురుషులేమోనని నా అనుమానం"
అతను మామూలుగా మళ్ళీ నవ్వి ఊరుకున్నాడు.
"ఆ నవ్వుతోనే నన్ను కష్టపెస్తున్నారు. మీరెవరో మీసంగతేమిటో చెబితేగాని వూరుకొనేది లేదు. ముందు నాగురించి ఏంతెలుసో చెప్పండి" దబాయించినట్టు గట్టిగా అడిగాను.
"చెప్పక తప్పదా?"
"తప్పదు"
"అయితేవిను...."
గుండెలు పీచుపీచు మనడం మొదలుపెట్టాయి.
"ప్రేమించి పెళ్ళిచేసుకొన్నావ్. అవునా?"
"అవును."
"తర్వాత ఖంగుతిన్నావ్."

FREE!! **దేవుడు మాట్లాడుచున్నాడు** ఉచితం!!

దేవుడు మాట్లాడుచున్నాడు

దేవుడు తన విరోధులతో మాట్లాడుటకు ఈగవంటి అల్పమైన వాటినికూడ తన సాధనముగా వాడుకొని తన దివ్య సంకల్పాన్ని నెరవేర్చగలడని మీకు తెలుసా! దైవశక్తి వలన తమ చెడు ప్రవ ర్తనను మార్చుకొన్న కొంతమందిని పరిశీలించిన నాస్తికుడొకడు, ఈ దైవశక్తి ఎలా పనిచేస్తుందో చూడాలనే ఆశతో ఒక భక్తికూటమినకు వెళ్ళాడు. ఆ దైవజనుని బోధ వినాలని ఏమాత్రమూ ఆసక్తిలేదు. కేవలం కుతూహలం కొలదీ అక్కడికి వెళ్ళి ఒక చెట్టుమీద కూర్చొని సమ స్తము తిలకిస్తున్నాడు. ఆ బోధకుని మాటలు వినకూడదని తనచేతి వ్రేళ్ళను చెవుల్లో దూర్చుకొని అలా తిలకించుచుండగా ఒక ఈగ వచ్చి అతని ముక్కుమీద వ్రాలి అటూ ఇటూ తిరగటం మొదలుపెట్టింది. అది చేసే గొడవ భరించలేక దాన్ని తోలుటకు చేతివ్రేళ్ళను బయటకు తీసాడు. వెంటనే "దైవాత్మ చెప్పుచున్న మాటలు చెవులు గలవాడు వినునుగాక" అనే మాటలు బోధకుని నోటినుండి బిగ్గరగా వినిపించాయి. ఆ వ్యక్తి కాస్త కలవరపడ్డాడు గాని, తిరిగి చేతులతో చెవులు మూసుకొని కూర్చున్నాడు. అయితే ఆ ఈగ గొడవచెయ్యటం మానలేదు. ఈసారి చెవుల్లోనుండి వ్రేళ్ళు బయటకు తీసినప్పుడు "నా కుమారుడా, నా మాటలు ఆలకింపుము. నా వాక్యమునకు చెవి యొగ్గుము. నీ హృదయములో వాటి భద్రపరచుకొనుము." ఈ మాటలు ఎంతో లాలనగా వినిపించినవి. "ఏమిటి ఈ ఆశ్చర్యం, ఈ మాటలు నాతో పలుకుచున్నాడా! కాని, నేను మాత్రం విననే వినను" అనుకొని తిరిగి చెవులు మూసుకొన్నాడు. అయితే ఈగ మటుకు అతనిని బాధించటం మానలేదు. మూడవసారి చేతులు తీసినప్పుడు "నేను పిలువగ మీరు వినకపోతిరి, నే చెప్పిన బోధ మీరు వినక త్రోసివేసితిరి. కాబట్టి మీకు అపాయము కలిగినప్పుడు నే నవ్వెదను" అనేమాటలు విన వచ్చినప్పుడు ఆ వ్యక్తికి మూర్ఛ వచ్చినంత పనై చెట్టుమీద నుండి క్రిందపడ్డాడు. దేవుడు మాట్లాడటం అంటే ఇదే కాబోలు. తానెవ్వరికి తెలియవని తలచిన తలపులన్నీ ఈ దైవజనుడు వేదిక యెక్కి చాటేస్తున్నాడు. సమ స్త హృదయాలోచనలను దేవుడు యెరిగిన వాడనే సత్యం ఆయన విశ్వసించి, తన పాపమార్గం విడిచి పశ్చాత్తాపముతో ప్రభువుకు తన హృదయాన్ని అంకితం చేసాడు.

ప్రియపాఠకా!

అనుక్షణం తనకు దూరంగా పారిపోతున్న మానవులతో మాట్లాడుటకు క్రీస్తు ప్రభు ఆశిస్తున్నాడు. దైవ జనులద్వారా, పరిశుద్ధ గ్రంథముద్వారా, భక్తుల జీవితంద్వారా, పరిస్థితుల ద్వారా, వ్యాధి బాధల ద్వారా, ప్రేమించిన వారి మరణంద్వారా ప్రభు మనతో మాట్లాడుతున్నాడు. అయితే ఆ మాటలు వినకూడదని చెవులు మూసుకు కూర్చున్నావా! మూయబడిన హృదయద్వారముయొద్ద నిలచి ఆయన తట్టుచున్నాడు. ఎవడైనను అతని స్వరము విని తలుపు తీసిన యెడల ఆ ప్రభు అతని హృదయములో ప్రవేశించి దయ్యాల కుహరాన్ని దైవస్తుతి మందిరముగ మార్చగలడు. దాటిన తరుణం తిరిగి రాదు. ఈ నాడె ప్రభు మాటలను ఆలకించి నీ బ్రతుకును సరిదిద్దుకో.

—చదలవాడ చంద్రమతీదేవి

నేను మాట్లాడలేదు.

"వట్టిపనికిమాలిన గుమస్తాగాడు అంటూ మీ ఆవిడ ఈసడించుకోవడం నీకు తెలుసు."

"అవును,"

"కువైట్ కుర్రాడితో లేచిపోదామని ప్లాను కూడా వేసుకొంది"

"దాని ప్రేమ వట్టి బూటకం అని తెలిసి పోయింది. అందుకే ఇద్దర్నీ పైకి పంపేద్దామను కొంటున్నాను."

"ఆ సంగతి నాకూ తెలుసు, ఆ పని నువ్వు చెయ్యలేవనికూడా తెలుసు"

"ఎందుకుచెయ్యలేను?" గట్టిగా అన్నాను.

"వాళ్ళిద్దరూ ముందే నీపని పట్టేశారు గనుక" నావంక సూటిగా చూస్తూ సౌమ్యంగా అన్నాడు ఆగంతకుడు.

"ఏవిటీ?" అతను చెబుతున్నది ఒక పట్టాన అర్థంగాక అయోమయంగా చూశాను.

"గుర్తు తెచ్చుకో"

కళ్ళముందు పచ్చటి....ఎర్రటి....నల్లటి.... తెల్లటి.... రంగుల కాంతులు....గాజుగ్లాసు.... గ్లాసులో తియ్యటి తెల్లటి పాలు....మైకం.... మైకం....మైకం....

ఒళ్ళంతా ఒక్కసారి జలదరించినట్టయింది. పుట్టెడు దుఃఖం అమాంతం ముంచుకొచ్చింది.

"అవును గుర్తొచ్చింది. భయంభయంగా ఉంది" అన్నాను అతని చెయ్యిగట్టిగా పట్టు కొంటూ.

"ఇంకా నీకు పాతఅలవాట్లు అనుభూతులూ పోలేదు. తొందర్లోనే పోతాయిలే" అన్నాడు భుజంమీద చేయివేస్తూ.

"ఇక మీసంగతి చెప్పండి?" అన్నాను.

"ఒక్కముక్కలో చెప్పాలంటే నీకు కొంచెం సీనియర్ని" నవ్వుతూ చెప్పాడు.

"ఏమిటీ?" అన్నాను కుతుహలంగా.

"చంటి బిడ్డనెత్తుకొని ఏడుస్తూ కూచుంది చూశావూ? ఆమెకు ఒకానొకప్పుడు మొగుణ్ణి"

నా అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి.


....సుఖం—దుఃఖం—రాగం - ద్వేషం— కోపం—తాపం—స్వార్థం — పరమార్థం— కష్టం—నష్టం—పాపం —పుణ్యం—కలిమి లేమి వంటివి అణుమాత్రంతేని ద్వంద్వాతీత ప్రపంచంలో నిశ్శబ్దంగా నవ్వుతున్న నా మిత్రుడితో శృతికలిపాను.

"కింకర్తవ్యం?" అన్నట్టు అతని ముఖం లోకి చూశాను.

"కుత్సిత ప్రపంచంబొరుసును మాత్రమే చూశావ్. బడుగుజీవుల్ని ఉన్న పళంగానే పీక్కుతినే రాబందుల రెక్కలచప్పుడూ, అగ్ని శిఖల అట్టడుగు ఆక్రందనలూ వినబడే అసలు బొమ్మను చూద్దువుగాని నడువ్" అంటూ అతను నా చెయ్యి పట్టుకొని ముందుకు వడి వడిగా అడుగులు వేయసాగాడు.

దూరంగా కర్తవ్యం మరచిపోని తొలి కోడి అరుపు....అవచేతన స్థితిలోంచి పుట్టుకొచ్చిన భీకర ఘోషలూ, చీకటి నీడల క్రీనీడలూ, నైరూప్య దృశ్యాల అన్యాపదేశాలూ ఒక్కొక్కటే క్రమంగా అదృశ్యంకాసాగాయి.... □

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారం నవంబరు '79

అడ్డం

1. డైరెక్షన్
3. పడకపోతే అనావృష్టి
5. అర
7. వృత్తం
9. తెగించడం మొండితనం (తలక్రిందులు)
10. డిటెక్టివులు కనిపెట్టేది
12. అప్పారావు (బసవరాజు) గారి యాత
13. శ్రీ
15. అసురుడి పేరిట ఊరు
16. కరటకుడు (లేదా, దమనకుడు)
17. వాళ్ళు నీళ్ళు
18. అవిశ్వాస తీర్మానానికి ముందు
20. శివుడే దేవుడు, దేవుడే శివుడు
22. మైనస్
23. ఆ యిది పిలుపు
25. ఇజారు ఊడ్వమంటుంది
27. ఇకశ్యాలకుడు

29. రాగ విశేషం
31. అబ్బే! ఏంలేదు
32. చదరంగంలో సత్తువ

నిలువు
1. వేమన—కవి
2. సత్యానికీ సుందరానికీ మధ్య
3. అయిన—ఆత్మీయులు
4. పత్రిక పబ్లిషర్లు
5. రెండు నోటీలు
6. తప్పకుండా రాయాలి
7. తమరా? (మధ్యమపుష్టిలేదు)
8. శ్రేష్ఠవాచకం

11. మనడం మరణం
14. మాv, మీv
15. 8లో ఒక సిద్ధి
18. అందంలేనిది ఆకాశం
19. ఆది మానవుల రాష్ట్రపతి భవనం
21. పాలకడలి తొలి కానుపు
22. ఒక పురం (మధ్యది లేదు)
23. కొనకపో ఉపయోగం లేదు
24. నాకు లోకువ
26. 14 రికమండేషన్లలో లక్ష్యం
28. మరు త్తరాట్చరిత్రలో హేమవాచకం
30. అమ్రేడిస్తే ఆరాటం

అక్టోబర్ పదబంధ ప్రహేళికకు సమాధానాలు:

అడ్డం: 1 గుడి, 3 ఆన, 5 వడ్లగింజ, 7 కరువలి, 9 డగూ, 10 తమాలం 12 కోపి, 13 బలం, 15 నటి, 16 కిటి, 17 ఈగ, 18 వాణి, 20 రంగు, 22 మాతా, 23 హసీబీ, 25 నగ, 27 సంయమనం, 29 సీతాపతి, 31 నంది, 32 జాము.

నిలువు: 1 గుడ్లగూబ, 2 డిగిం, 3 ఆరు, 4 నవకోటి, 5 వడ, 6 జత, 7 కలం, 8 లిపి, 11 మాట, 14 లంకిణి, 15 నగరం, 18 వాతాయనం, 19 గ్రోసీ, 21 గునపము 22 మాసం, 23 హనం, 24 బీసీ, 26 గతి, 28 మది, 30 తాజా.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి అక్టోబరు 25 వ తేదీలోపు మాకు చేరునట్లు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

గతసంచిక పదబంధ ప్రహేళిక విజేతలు

హైదరాబాద్ నుంచి: (1) ఎస్. నరసింహాచారి (2) శ్రీమతి దాశరధి విజయలక్ష్మి (3) డా॥ నాగరాజు సురేంద్రకు ప్రవీణ. (4) శ్రీమతి కొల్లూరు శ్రీలక్ష్మి (5) గొబ్బూరి సర్వేశ్ బాబు. మద్రాసునుంచి: (6) బి. సాహితి. (7) వి.గోపాలకృష్ణ మచిలీపట్నంనుంచి: (8) పి. ప్రభావతి. నందివెలగు నుంచి: (9) అలపర్తి వెంకట సుబ్బారావు, నగరంనుంచి (10) వై. రాజారాం. (11) బి. ఎస్. ఆర్. ప్రసాద్. రాజమండ్రినుంచి: (12) కె. వి. ఎస్. లక్ష్మీపతిరావు తణుకునుంచి; (13) ఎమ్. ఎస్. లక్ష్మి. తెక్కలినుంచి: (13) బి. బి. ఆర్. కె. మూర్తి.


సినిమా

గోరింటాకు

త్రాగుబోతయిన తండ్రి తల్లిని హింసించటాన్ని చూసి కుమిలిపోయిన దుర్భర బాల్యం రాముది. పరిస్థితులు మారిపోయి తల్లి చల్లని అనురాగపు నీడన చదువు సాగించి పై చదువులకు రాగలిగాడు. చిన్నతనాన్నుంచీకూడా సంతోషంకన్న విషాదమే ఎక్కువ అనుభవించి వుండడంతో క్లాసువారితో కలవలేక ఏకాకిగా, ఏకాంతంగా గడపటం అలవాటు చేసుకున్నాడు అతను. స్వప్న అతని సహ విద్యార్థిని. అతనిలో అనురాగం చూసింది. ఎందుకలా నిరాశగా వుంటావని నిలదీసి ప్రశ్నించింది. అతని వేదన చెప్పుకునేందుకు ఆత్మీయురాలిగా నిలిచి అతనిలో ఉత్సాహాన్ని నెలకొల్పింది. అతనిలో తన భావిజీవిత సహచరుడిని చూసుకొంది. అయితే తన ప్రేమ వ్యక్తపరచడంలో విఫలమయ్యాడు రాము. మొహమాట పడ్డాడు. స్వప్నకు పెళ్లి కుదిరిననాడు నిజమైన ప్రేమికుడిగా తన ప్రేమను తనలోనే దాచుకొని ఆమెకు తన ఆశీర్వాదం తెలిపాడు. ఎంత తరచినా స్వప్న రాము నుంచి తనను ప్రేమిస్తున్నానన్న జవాబు పొందలేకపోయింది. ఒకరికొకరు తమ మనసులోని మాటను స్పష్టంగా చెప్పుకో



సంస్థం త్రికూట ఫిల్మ్స్‌లో చంద్రమూవీస్, విజయనగర్లో



'గోరింటాకు'లో శోభన్ బాబు, వక్కలంక పద్మ

లేని అసహాయస్థితిలోపడి దూరమయ్యారు స్వప్న రాము. మరలా విషాదంలో పడిన రాము జీవితంలో అంతకుముందే దురదృష్టం పాలై విషాదజీవితం గడుపుతున్న పద్మ ప్రవేశంతో చక్కని మలుపు యెదురైంది. విషాదంలోవున్న రెండు హృదయాలూ ఒకరిలో ఒకరి ఓదార్పును చూసుకున్నారు. మనసులు చేరువైనాయి. మమతలు చిగురించాయి. స్వప్నను దూరం చేసుకున్న గాయాన్ని కాలం మాన్పగా రాము కొత్త జీవితాన్ని కోరుకున్నాడు. అయితే మనిషి ఆలోచనలు జరగేతీరులో ఆచరణలు విధిగా సాధ్యపడాలని లేదు. భర్తను పోగొట్టుకొన్న స్వప్న తిరిగి తండ్రి దగ్గరకు చేరుకొని అనుకోకుండా రాము తనను ప్రేమించాడన్న విషయం తెలుసుకో గలుగుతుంది. ఆమెలోని ఆశకు తిరిగి చిగురు తొడుగుతుంది. కానీ అప్పటికే రాము జీవితంలో మరో మలుపు తిరిగివుంది. ఈ మారిన పరిస్థితులలో వారి అనుభూతులెలా వుంటాయి. చిన్ననాడు తల్లిని అమితంగా హింసించిన తండ్రి, తరువాత ఒక స్థితిలో తన దగ్గరకే వైద్యానికి రాగా డాక్టరు వృత్తి ధర్మంగా వైద్యం చెయ్యగలిగినా, తన ఇంటికి, తండ్రిని రానివ్వలేని స్థిరమైన వ్యక్తిత్వంగల రాము ఈ కొత్తమార్పుకి ఎలా తట్టుకోగలడు. తన జీవితానికి తిరిగి వసంతం వస్తుందన్న ఆశతో, వుత్సాహంతో వున్న పద్మ ఎలా తట్టుకోగల దీ మార్పును. అత్యాంతాసక్తికరమయిన ఈ కథాంశంతో, దాసరి నారాయణరావు దర్శకత్వంలో యువచిత్ర నిర్మించిన వర్ణచిత్రం 'గోరింటాకు.' కె. నరసింహం నాయుడు సమర్పణలో కె. మురారి నిర్మించిన యీ చిత్రంలో పై ప్రధాన పాత్రలను శోభన్‌బాబు (రాము), సుజాత



'శివమెత్తిన సత్యం'లో కృష్ణంరాజు, శారద



(శ్రీనాయక విజయంలో కృష్ణంరాజు, వాణిశ్రీ)


(స్వప్న), నూతన నటి వక్కలంక పద్మ (పద్మ) పోషించారు.

తొలికోడి కూసింది

సీమ, శరత్‌బాబు, మాధవి, నగ్న సత్యం సుబ్బారావు, సరిత, ప్రసాదుబాబు, శాంతారామ్, రమణమూర్తి, ధూళిపాళ, సత్తిబాబు, ముఖ్యపాత్రలు పోషిస్తున్న రంజిత్ ఆర్ట్సువారి 'తొలికోడి కూసింది' వర్ణచిత్రంలో జీవా అనే కొత్త నటుడ్ని విలను భూమికలో పరిచయం చేస్తున్నారు. సెప్టెంబరు మాసాంతానికి నిర్మాణంపూర్తి చేసుకొనే యీ చిత్రంలో మాటలు:గణేష్ పాత్రో - పాటలు: ఆచార్య ఆత్రేయ - సంగీతం:ఎమ్ ఎస్ విశ్వనాథం, కెమెరా: బి. యస్. లోకనాధ్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : కె. బాలచందర్, నిర్మాత : కానూరి రంజిత్‌కుమార్.

'తాతయ్య ప్రేమలీలలు'

ప్రముఖ నిర్మాత యం. యస్. రెడ్డి కౌముదీ పిక్చర్స్ బేనర్ క్రింద యీ సారి నిర్మింపబోవు వర్ణచిత్రం 'తాతయ్య ప్రేమ లీలలు'. శృంగార—హాస్యరసాలు ప్రధానంగాగల యీ మృదుమధురమైన చిత్ర కథలో నూతనప్రసాద్, సీమ, చిరంజీవి, గీత, చక్రపాణి, సుమలత, హరిప్రసాద్, శుభ, ఎం.బాలయ్య, మాడా, కె.వి చలం,



'మంగళ తోరణాలు'లో తాళ్ళూరి రామేశ్వరి, చంద్రమోహన్

సి. హెచ్. కృష్ణమూర్తి మున్నగు నటీ నటులందరూ పాల్గొంటారు. బి. వి. ప్రసాద్ దర్శకత్వంలో ముస్తాబుకానున్న యీ చిత్రం మల్లెమాల రచనక్రింద నవ రసభరితంగా పేపరుపర్కు సాగుతున్న యీ చిత్రానికి సంగీతం: రాజన్‌నాగేంద్ర, కెమెరా: పి. యస్. ప్రకాష్, కూర్పు: మార్తాండ్ నిర్వహిస్తారు.

'నా మొగుడు బ్రహ్మచారి'

సీతాపతి సంసారం, ఇల్లాలి ముచ్చట్లు చిత్రాలకు భాగస్వాములయిన కె. గురవా రెడ్డి ప్రప్రథమంగా "నా మొగుడు బ్రహ్మ చారి" కలర్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జయచిత్ర, గీత, రావుగోపాలరావు, అల్లు రామలింగయ్య, చక్రవర్తి, ముక్కామల, మొదలయినవారు నటించే యీ చిత్రానికి మాటలు: జంధ్యాల, పాటలు: వేటూరి, సంగీతం: చక్రవర్తి, కెమెరా: పి. భాస్కర్ రావు, ఎడిటింగ్: బి. కృష్ణంరాజు, కళ: భాస్కరరాజు, ప్రొడక్షన్ కంట్రోలర్: ప్రకాష్, అసోసియేట్: వి. విద్యాసాగర రెడ్డి, నిర్మాతలు: గురవారెడ్డి, కె. శంకర రెడ్డి, స్క్రీన్‌ప్లే డైరెక్షన్: యం. ఎస్. కోటారెడ్డి.

వినాయక విజయం

మూషికుడ్ని జయించడానికి గజా ననుని పార్వతీ పరమేశ్వరులు బ్రహ్మ చర్య దీక్షకు దీవించి పంపుతారు—ఘోర తపమాచరించుచున్న గజాననుని వ్రత భంగము చేయుటకై మూషికాసురునిచే సృష్టింపబడిన నవజవ్వని లాలస తన నవయవ్వన అంగిభంగిమలతో గణేసుని తపస్సును వ్రతభంగము చేయ ప్రయ త్నించి, అపజయము పొందుతుంది.


TRIVENI
BETEL NUT POWDER
PRIDE OF INDIA
CHOICE OF MILLIONS
TRADE MARK
REGD. NO. 169608
BEST PICKED
FRESH PACKED
TRIVENI
PARIMALA
NUT POWDER

శారద. శ్రీధర్, బేబీ తులసిలపై ముఖ్య దృశ్యాలు దర్శకుడు బాపు తొలి షెడ్యూలులో చిత్రీకరించారు.

రచన: ముళ్ళపూడి వెంకటరమణ సంగీతం: కె. వి. మహదేవన్, కూర్పు: డి. వెంకటరత్నం, ఫోటోగ్రఫీ: బాలు మహేంద్ర. దర్శకత్వం: బాపు, నిర్మాత: అంగర సత్యం, యీ చిత్రం రెండవ షెడ్యూలు అక్టోబరు పదహారు నుంచి ముప్పై ఒకటి వరకూ మారేడిమిల్లి అడవిలో జరుగుతుంది- దీనితో యీ చిత్ర నిర్మాణం పూర్తి అవుతుంది.


త్రిమూర్తి ప్రొడక్షన్స్

క్వాలిటీ తగ్గకుండా కాంప్రమైజ్ కాకుండా చక్కని అభిరుచితో విశేష వ్యయంతో భారీ సెట్స్ వేసి రూపొందిస్తున్నారు, త్రిమూర్తి ప్రొడక్షన్స్ వారు తమ ఆరవ చిత్రాన్ని.

కృష్ణ. శ్రీదేవి, సత్యనారాయణ అంజలిదేవి, నూతన్‌ప్రసాద్, గిరిబాబు, సువర్ణ, త్యాగరాజు, అల్లురామలింగయ్య, ప్రధాన పాత్రలు పోషిస్తున్న యీ చిత్రం అక్టోబర్ పదితో నిర్మాణం పూర్తిచేసుకుంటుంది. చిత్రానికి మాటలు: భమిడిపాటి రాధాకృష్ణ. సంగీతం: సత్యం, కళ: యస్. కృష్ణారావు. కూర్పు: ఎస్. ఎస్. ప్రకాశం, డి. వెంకటరత్నం, కెమెరా: పుష్పాల గోపీకృష్ణ, సహకార దర్శకత్వం: యెం. జయదేవ్, బి. యల్. వి. ప్రసాద్, దర్శకత్వం: కె. యస్. ఆర్. దాస్, నిర్మాతలు: పి. బాబ్జి, జి. సాంబశివరావు.

గ్రహణం విడిచింది

'గతంలో ఒక వినూత్నమైన కథను చిత్ర రూపమిచ్చి వింతకథ అని పేరు పెట్టి దర్శకుడుగా పాత్రపోషణ గావించిన



'గుప్పెడు మనసు' సుజాత

వి. బోస్ ప్రస్తుతం తను రాసిన సొంత కథకు గ్రహణం విడిచింది అని పేరు బెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికిగాను ఇప్పటికి నాలుగు పాటలు ధ్వని ముద్రణం గావించారు. త్వరలో ప్రకృతి రమణీయతకు మారు పేరైన ఆంధ్ర ప్రదేశ్‌లో ఒక్క నెలలో పూర్తి చిత్రం రూపురేఖలు దిద్దుకోబోతుంది.

ఈ చిత్ర కళాశిల్పులు: మాటలు: దాసం గోపాలకృష్ణ, పాటలు: కొసరాజు, దాసం, గోపి, సంగీతం: రమేష్‌నాయుడు, ఛాయాగ్రహణం: వి. యస్. ఆర్. స్వామి, కూర్పు: అంకిరెడ్డి, కళ: కళాధర్. సహకార దర్శకత్వం: రామ్‌సూరి, కోటేశ్వర రావు, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి. బోస్. మురళీమోహన్, నూతన్‌ప్రసాద్, గోకిన రామారావు, పి. యేల్ నారాయణ, కవిత మొదలయిన వారు నటిస్తున్నారు.

—యస్వీనారాయణ